సూరత్: దుర్గాష్టమి సందర్భంగా ఉమీ యాధం ఆలయం వద్ద మహాహారతి

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం
ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి:58 • సంచిక169 • సోమవారం 7 అక్టోబర్ 2019 • హైదరాబాద్ ❊ పేజీలు:10+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

జేఏసీతో చర్చల్లేవ్.. ఆ ఉద్యోగులను తీసుకోం

విలీనం లేదు

త్వరలో కొత్త ఉద్యోగుల నియామకం

తెలంగాణ ఆర్టీసీపై సీఎం కేసీఆర్ సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. రెండు వారాల్లో ఆర్టీసీకి కొత్త రూపు తీసుకురాబోతున్నట్టు ప్రకటించారు. ఆర్టీసీకి కొత్త రక్తాన్ని ఎక్కించి సంస్థను సమస్యల ఊబిలోనుంచి బైటికి తీసుకువచ్చే బృహత్తర ప్రణాళికకు సీఎం కేసీఆర్ సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. ఉద్యోగులు కీలకమైన పండగ రోజుల్లో ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసి స్వార్థప్రయోజనాల కోసం సమ్మె బాటపట్టడం ఏమాత్రం సరికాదని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రజలు ఆర్టీసీ కార్మికుల వైఖరిని సహించలేకపోతున్నారని, అందుకే ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిందన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలు తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తెచ్చే క్రమంలో సవ్యంగా వ్యవహరించ లేదన్నారు. సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులను మళ్లీ సంస్థలోకి తీసుకోబోమని తేల్చి చెప్పారు.

సమ్మె చట్టవిరుద్ధం.. తీవ్ర తప్పిదం: సీఎం

- ఆర్టీసీ చరిత్రలో ఓ నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాం
- 15 రోజుల్లో ఆర్టీసీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తాం
- రెండు, మూడేళ్లలో సంస్థను లాభాల బాటలో పెడతాం
- సంస్థ మనుగడ సాగాలంటే కొన్ని కఠిన చర్యలు తప్పవ్
- క్రమశిక్షణారాహిత్యం, బ్లాక్‌మెయిలింగ్ విధానం ఉండకూడదు
- పండుగల సీజన్‌లో సమ్మెకు దిగిన వారితో రాజీ సమస్యే లేదు
- ఆర్టీసీ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు చట్టవిరుద్ధమైన సమ్మెకు దిగారు
- ఇక ఆర్టీసీలో మిగిలింది 1200 మంది ఉద్యోగులు మాత్రమే
- ప్రగతిభవన్‌లో ఉన్నత సమీక్షలో అధికారులతో సీఎం కేసీఆర్
- సునీల్ శర్మ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు.. నేడు నివేదిక

ప్రైవేటు భాగస్వామ్యం తప్పనిసరి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్టీసీ కార్మికుల సమ్మెను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వాదేశాలను ధిక్కరించి, సంస్థ నిబంధనలను ఉల్లంఘించి చట్టవిరుద్ధంగా సమ్మెకు పూనుకున్న వారందరినీ ఉద్యోగం లోంచి తొలగించినట్లు ప్రకటించింది. కొత్త నియామకాలను తక్షణమే చేపట్టి పక్షం రోజుల్లోగా సంస్థను పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రసక్తే లేదని, ఇకపై కార్మిక సంఘాలతో ఎలాంటి చర్చలు ఉండబోవని స్పష్టం చేశారు. కార్మికుల డిమాండ్లు పూర్తిగా అసంబద్ధమని, వారి బ్లాక్‌మెయిల్‌కు తలవంచబోదని తేల్చి చెప్పారు. ఒకపక్క ప్రైవేటు, మరోపక్క ప్రభుత్వ భాగస్వామ్యం సంస్థకు అవసరమని అభిప్రాయపడ్డారు. ఆ దిశగా 50శాతం ఆర్టీసీ, మరో 50శాతం ప్రైవేటు అద్దె బస్సులతో పునరుద్ధరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆదివారం సీఎం కేసీఆర్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రాత్రి తొమ్మిది గంటల వరకు సుమారు 3వ పేజీలో...

కొత్త గమ్యం వైపు ఆర్టీసీ

లొంగేది లేదు

తాటాకు చప్పుళ్లకు భయపడం
కార్మికులు అఘాయిత్యాలకు పాల్పడితే బాధ్యత సీఎందే
ప్రభుత్వ నిర్ణయంపై ఆర్టీసీ కార్మికుల జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ఫైర్

3

జోక్యం చేసుకోలేం

హైకోర్టు స్పష్టీకరణ
సమ్మెపై నివేదిక సమర్పించండి
సర్కారుకు, అసోసియేషన్లకు నోటీసులు



సద్దుల బతుకమ్మ.. వెళ్లి రావమ్మా!

ఎల్బీ స్టేడియంలో సంబురాలు ప్రారంభించిన సీఎం సతీమణి
శోభ • ట్యాంక్‌బండ్‌పై ధూంధాం • ఊరూవాడా హోరెత్తిన మహిళల ఆటాపాటలు

2

పిడుగుల మోత కుండపోత

6 మంది మృతి

రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
హైదరాబాద్‌లో గంటలో 7సెం.మీ వర్షం • రాజధాని అతలాకుతలం
మరో రెండ్రోజులు భారీ వర్షాలు
కేంద్రం హెచ్చరికతో అప్రమత్తం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు ఆదివారం మరింత భయపెట్టాయి. పిడుగులు, ఉరుములతో కూడిన కుండపోత బెదరగొట్టింది. అటు జిల్లాల్లోను, ఇటు గ్రేటర్ హైదరాబాద్‌లోను జనం గుండె చెరువైంది. పిడుగుపాటుకు వివిధ ప్రాంతాల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. జంట నగరాలలో జనం ప్రత్యక్ష నరకం చూశారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు 5వ పేజీలో...

గాజులరామారంలో ఓ ప్రైవేటు ఆసుపత్రి ఐసీయూలో వరద నీరు

కూలిన శిక్షణ విమానం

ఇద్దరు పైలట్ల దుర్మరణం

సుల్తాన్‌పూర్‌లో ఘటన

5

మైనర్లకు అమ్మితే పీడీ యాక్ట్

బోర్డులు పెట్టకపోతే లైసెన్సుల రద్దు
సిట్టింగ్ రూమ్‌ల్లో సీసీ కెమెరాలు మస్ట్
మద్యం పాలసీలో కఠిన నిబంధనలు.. శిక్షలు
మద్యం దుకాణాల్లో అక్రమాల నియంత్రణకు ప్రభుత్వం ప్రాధాన్యం
చట్ట సవరణకూ రెడీ.. అబ్కారీ శాఖ కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మద్యం దుకాణాలు, బార్ల నిర్వహణలో నిబంధనలు పాటించకపోతే లైసెన్సుల రద్దుతో పాటు కటకటాలూ తప్పవు. ఇన్నాళ్లూ చూసీచూడనట్లు వ్యవహరించిన ప్రభుత్వం ఇప్పుడు ఆ నిబంధనలను అమలు చేయడంతోపాటు కఠిన శిక్షలు విధించేలా చట్టంలో మార్పులు చేస్తోంది. కొత్త మద్యం విధానం తీసుకొచ్చిన 5వ పేజీలో...

నిషేధాజ్ఞల్లేవ్!

ప్లాస్టిక్ నిషేధంపై కేంద్రం మల్లగుల్లాలు

మాంద్యం వేళ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంతో పెను ప్రభావం
లక్షలాది ఉద్యోగాలు ఊడే ప్రమాదం
ఆందోళనల నేపథ్యంలో పున:సమీక్ష

8

చాకోలెట్లు, బిస్కెట్లు, చిప్స్, గుట్కా, పాలు, షాంపూ... ఇలా ఒకటేమిటి ప్లాస్టిక్ వినియోగంలేని ఉత్పత్తులను దాదాపుగా ఊహించలేని రోజులివి. ఇలాంటి పరిస్థితుల్లో తగిన ప్రత్యామ్నాయం లేకుండా దేశవ్యాప్తంగా ఒకేసారి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తే ఆర్థిక రంగం పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వుంటుందని ప్లాస్టిక్ పారిశ్రామిక రంగం నుంచి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ ప్రతిపాదనలతో ఉద్యోగాలు ఊడిపోతాయోమోననే భయాందోళనలు పెరిగాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నిర్వచనం ఏంటో తెలపకుండా నిషేధం విధించాలన్న నిర్ణయాన్ని ప్లాస్టిక్ పారిశ్రామికవర్గం తప్పుబట్టింది. దీంతో ఒకవైపు ఆశయం, మరోవైపు పర్యావరణహితం కోరుకున్నా నిస్సహాయస్థితిలో ప్రభుత్వం వెనుకడుగువేస్తోంది.

సద్దుల బతుకమ్మ.. వెల్లి రావమ్మ!

ఎల్బీస్టేడియం సంబురాల్లో పాల్గొన్న సీఎం సతీమణి శోభ.. ట్యాంక్‌బండ్‌పై ధూంధాం వేడుకలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సద్దుల బతుకమ్మ సంబురాలు తెలంగాణ వ్యాప్తంగా అంబరాన్ని తాకేలా సాగాయి. పండుగ సంబురాలతో పల్లెలు, పట్టణాలు కళకళలాడాయి. ఆటపాటలతో మార్మోగాయి. పూలపండుగ, పాటల పండుగను ఆడపడుచులు అబ్బురంగా నిర్వహించుకున్నారు. వర్షం అక్కడక్కడా ఇబ్బందులు పెట్టినా లెక్కచేయకుండా.. ప్రకృతితో మమేకమైన పూల పండుగను మహిళలు మురిపెంగా చేసుకున్నారు. ఉయ్యాల.. ఉయ్యాల.. ఉయ్యాలో అంటూ సంస్కృతి వైభవాన్ని చాటారు. వెళ్ళిరా.. బతుకమ్మ. మళ్ళీ రావమ్మా అంటూ బతుకమ్మ ఘాట్‌ల లో, చెరువులలో బతుకమ్మలను వదిలి వీడ్కోలు పలికారు. ఎల్బీస్టేడియంలో బతుకమ్మ ఉత్సవాలను, రథాన్ని సీఎం కేసీఆర్ సతీమణి శోభ ప్రారంభించగా, కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి శ్రీనివాసగౌడ్, ప్రభుత్వ కార్యదర్శి పార్థసారథి పాల్గొన్నారు. తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలతో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఎల్బీస్టేడియం నుండి ట్యాంక్‌బండ్ వరకు వందలాది మహిళలు బతుకమ్మలతో ర్యాలీగా కదిలారు. ట్యాంక్ బండ్ పరిసరాలన్నీ విద్యుత్ దీపాలతో కళకళలాడాయి. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేటలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, సంగారెడ్డిలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళా శిశుసంక్షేమ శాఖామంత్రి సత్యవతిరాథోడ్ హుజూర్‌నగర్ లో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి బతుకమ్మ

సంగారెడ్డి, ప్రభ న్యూస్ : ప్రపంచమంతా బతుకమ్మను ఘనంగా జరుపుకుంటుందని, తెలంగాణ ప్రజలు ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగ బతుకమ్మ అని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లాలోని కోమటి చెరువు వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఆయన కుటుంబ సమేతంగా హాజరయ్యారు. బతుకమ్మ ఆడేందుకు వచ్చిన ఆడపడుచులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే పూలను పూజించే పండుగ బతుకమ్మ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజు బతుకమ్మ పండుగను ఆడపడుచులు జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం కోమటి చెరువులో సతీమణి శ్రీలతతో కలిసి బోటింగ్ చేశారు.

10న హుజూర్‌నగర్‌కు కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈనెల 4న కేటీఆర్ హుజూర్‌నగర్ టౌన్‌లో రోడ్‌షో నిర్వహించగా, విజయవంతమైంది. ఈనెల 10న కేటీఆర్ మళ్ళీ హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రచారానికి వెళ్ళనున్నారు. ఓవైపు బతుకమ్మ,దసరా సంబురాల్లో ప్రజలు నిమగ్నం కాగా, ప్రజలతో కలిసి రాజకీయపార్టీల నేతలు కూడా ఇందులో మమేకమవుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే సీపీఐ, వైఎస్సార్‌సీపీ మద్దతు సాధించిన టీఆర్ఎస్ గెలుపుపై ధీమాతో ముందుకు వెళుతోంది. టీఆర్ఎస్ పార్టీ ప్రధానకార్యదర్శి పల్లా రాజేశ్వరరెడ్డిని ఉప ఎన్నికల ఇన్‌ఛార్జిగా నియమించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిరోజూ తాజా పరిస్థితి తెలుసుకుంటున్నారు. పార్టీపరంగా నియమించిన ఇన్‌ఛార్జిలు గ్రామాల్లోనే మకాం వేసి ప్రచారంలో పాల్గొంటున్నారు. పార్టీ ఇన్‌ఛార్జి పల్లా రాజేశ్వరరెడ్డి గత పదిరోజులకు పైగా స్థానికంగానే మకాం వేసి వలసలను ఆకర్షిస్తూ గెలుపు వ్యూహాలను రచిస్తున్నారు. కాంగ్రెస్ కంచుకోటలో గులాబీజెండా ఎగరేసేందుకు శ్రమిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు పిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యూహాత్మకంగా శ్రమిస్తున్నారు. పార్టీ అభ్యర్థి పద్మావతి ప్రచారంలో దూసుకుపోతోంది. బిజెపి అభ్యర్థి డాక్టర్ కోట రామారావు, టిడిపి అభ్యర్థి చావా కిరణ్మయి, ఇంటిపార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి తీన్మార్ మల్లన్న కూడా ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈనెల 19వ తేదీవరకు ప్రచారం కొనసాగనుంది. దసరా తర్వాత అగ్రనేతల పర్యటనలతో ధూంధాం జరగనుంది.

ఆఫీస్ స్పేస్ హైదరాబాద్‌షా

ఢిల్లీ, పుణె, బెంగళూరును అధిగమించిన వైనం

- 12 నుంచి 36శాతానికి పెరిగిన వాటా
- భాగ్యనగరానికి దేశ, విదేశీ కంపెనీలు
- ఐదేళ్లలో రూ.10వేల కోట్ల పెట్టుబడులు
- తనదైన శైలిలో వ్యవహరిస్తున్న ఐటీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టెక్నాలజీ హబ్‌గా ఎదుగుతున్న గ్రేటర్ హైదరాబాద్ ఐటీ పరిశ్రమ విస్తరిస్తుండటంతో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఐటీ పరిశ్రమలు ఎగుమతుల్లో సరికొత్త రికార్డులు నమోదు చేస్తుండటంతో ఇతర నగరాల నుంచి కంపెనీలు నగరానికి తరలివస్తున్నాయి. దీంతో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ పెరిగినట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. లక్ష కోట్ల పైచిలుకు ఎగుమతులను ఐటీ సాధించింది. దీంతో అన్ని కంపెనీలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. దేశ, విదేశీ కంపెనీలు హైదరాబాద్‌కు తరలివస్తున్నాయి. ఈ ఏడాది మూడో త్రైమాసికంలోనూ ఆఫీస్ స్పేస్ మార్కెట్లో నగరం తన సత్తా చాటింది. ఐదేళ్లలో ఇన్వెస్టర్ల నుంచి రూ.10వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏటా 6శాతం వృద్ధి సాధిస్తోంది.

నిన్న అమెజాన్, ఒన్‌ప్లస్.. నేడు ఇన్ఫర్మాటికా, మైక్రాన్

ఐటీ దిగ్గజ సంస్థల నుంచి స్టార్టప్‌ల వరకు.. అమెజాన్ నుంచి తాజాగా ప్రారంభమైన సెమీ కండక్టర్ దిగ్గజం మైక్రాన్ వరకు.. ఇన్ఫర్మాటికా, ఎంఫసిస్, మైక్రాన్ వంటి పెద్ద కంపెనీలు హైదరాబాద్ బాటపట్టాయి. ముంబై, ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై లాంటి మెట్రో నగరాలను కాదని కంపెనీలన్నీ తమ ఆఫీసులు భాగ్యనగరంలో ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్, క్వాల్‌కామ్ లాంటి అమెరికా కంపెనీలు హైదరాబాద్‌లో తమ కార్యక్షేత్రాలను ఏర్పాటు చేసుకున్నాయి. తాజాగా ఇన్ఫర్మాటికా, ఎంఫసిస్, మైక్రాన్ వీటికి తోడయ్యాయి. దీంతో రెండో సిలికాన్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇక్కడ నిపుణులు, సదుపాయాలు అనువుగా ఉండటతో పాటు తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక విధానాలు, టీఎస్ ఐపాస్‌లాంటి ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ పాలసీలతో ఈ అనుకూలత ఏర్పడినట్లు నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు వీటన్నిటిపై ఎప్పటికప్పుడు వ్యక్తిగత శ్రద్ధతో పర్యవేక్షణ జరుపుతూ, తాను పరుగెత్తుతూ.. ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్నారు మంత్రి కేటీఆర్. ఆయన పనితీరు కంపెనీల్లో భరోసా నింపడం కూడా మరో కారణంగా నిపుణులు చెప్పుకుంటున్నారు. ఏకంగా నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్‌కాంత్ ఈ విషయాన్ని మైక్రాన్ సంస్థ ప్రారంభ సభలో ప్రస్తావించడం విశేషం. కేటీఆర్ పనితీరుపై ప్రశంసల వర్షం కురిపించారు. అందుకే ఆఫీస్ స్పేస్ మార్కెట్లో హైదరాబాద్ వరుసగా అగ్రస్థానంలో నిలుస్తూ ప్రత్యేకత చాటుకుంటోంది.

గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్‌సిటీల్లో డిమాండ్

గచ్చిబౌలి నాలెడ్జిసిటీ, మాధాపూర్, హైటెక్‌సిటీ లాంటి ప్రాంతాల్లో కొత్త కార్యాలయాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. నాలెడ్జ్ సిటీలో నిర్మాణం పూర్తయిన వెంటనే హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. స్కైవ్యూ టవర్ ప్రారంభమైన కొన్ని రోజుల్లోనే పదుల కంపెనీలు వచ్చి చేరాయి. కొత్తగా ఏర్పడిన ఇన్ఫర్మాటికా, ఎంఫసిస్ విస్తరణ కేంద్రం, మైక్రాన్ వంటి ప్రముఖ సంస్థలు ఇందులోనే కొలువై ఉన్నాయి. నిర్మాణదశలోనే ఆఫీస్ స్పేస్ బుక్ అవ్వడం డిమాండ్‌ను తెలియజేస్తుంది. కోవర్కింగ్ స్పేస్‌కు డిమాండ్ పెరుగుతున్న దరిమిలా హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు మరింత డిమాండ్ పెరిగే అవకాశాలున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. ఒకవైపు దేశ ఆర్థిక వృద్ధిరేటు మందగించినా ఆఫీసు స్పేస్ మార్కెట్‌లో హైదరాబాద్ తనకు సాటిలేదని నిరూపించుకోవటం రియల్ ఎస్టేట్ రంగం, నిర్మాణ రంగానికి ఊపునిస్తోంది.

36శాతానికి పెరిగినవాటా

ఈ ఏడాది జూలై నుంచి సెప్టెంబరు మధ్య కాలంలో ఆఫీస్ స్పేస్ లీజులో 36 శాతం, కొత్త ఆఫీసుల నిర్మాణంలో 44శాతం మార్కెట్ షేర్‌ను హైదరాబాద్ దక్కించుకున్నట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సర్వీస్ సంస్థ జేఎల్ఎల్ తన తాజా నివేదికలో వెల్లడించింది. బెంగుళూరు, ఢిల్లీ వంటి నగరాలు కూడా హైదరాబాద్‌ను అందుకోలేకపోతున్నాయని చెప్పుకొచ్చింది. మూడో త్రైమాసికంలో దేశ వ్యాప్తంగా కోటి 10 లక్షల చదరపు అడుగుల గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ వినియోగంలోకి వచ్చింది. గత 9 నెలల్లో 3కోట్ల 30 లక్షల చదరపు అడుగుల ఆఫీస్‌స్పేస్‌ను కంపెనీలు వినియోగించుకున్నాయి. ఇదే వృద్ధి రేటు కొనసాగితే, ఈ ఏడాది చివరికల్లా దేశ వ్యాప్తంగా 4 కోట్ల చదరపు అడుగుల ఆఫీసు స్పేస్ కంపెనీలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్‌లో ప్రతీ ఏడాది ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ పెరుగుతోంది. గత మూడు త్రైమాసికాల్లో కోటి చదరపు అడుగుల స్థలం వినియోగంలోకి వచ్చింది. మూడు నెలల్లో 40లక్షల చదరపు అడుగుల స్పేస్‌ను కంపెనీలు సమకూర్చుకున్నాయి. ఈ విషయంలో చెన్నై, పుణె నగరాలు వెనుకబడ్డాయి. ఆఫీసు స్పేస్ మార్కెట్‌లో హైదరాబాద్ భాగస్వామ్యం 12శాతం నుంచి ఏకంగా 36 శాతానికి పెరిగింది. దీన్నిబట్టి హైదరాబాద్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో తెలుస్తోంది.

ఇంకెన్నాళ్లు... ఖాళీ చేయండి

- మాజీ ఎంపీలకు కేంద్రం అల్టిమేటం

న్యూఢిల్లీ: ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపాలైన ఎంపీల్లో 50 మంది ఢిల్లీలోని లుత్నేయెన్స్ ప్రాంతంలోని తమ అధికారిక నివాసాలను ఇంకా ఖాళీ చేయలేదు. గత లోక్‌సభ రద్దయ్యి ఇప్పటి నెలలు గడుస్తున్నా వారంతా అధికారిక నివాసాలను వదలడం లేదు. ఇలాంటి వారందరిపై ప్రజా ప్రాంగణాల చట్టం కింద చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ చట్టం ప్రకారం మాజీ ఎంపీలంతా తమ అధికారిక నివాసాలను తక్షణమే ఖాళీ చేయాలని అధికారవర్గాలు పేర్కొన్నాయి. సవరించిన కొత్త చట్టం ప్రకారం అధికారిక నివాసాలను ఖాళీ చేయని అధికారులకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేయవచ్చు. కేవలం మూడు రోజుల్లోనే ఆయా మాజీ ఎంపీలంతా స్పందించాలి. స్పందించేందుకు గతంలో 15 రోజుల గడువుండేది కానీ అది చట్టసవరణ ద్వారా కేవలం మూడు రోజులకే కుదించడం జరిగింది. ఢిల్లీలోని లుత్యేయెన్స్ ప్రాంతంలోని అధికారిక నివాసాలను 50 మంది మాజీ ఎంపీలు ఇంతవరకూ ఖాళీ చేయలేదు. వారంతా రోజుల వ్యవధిలోనే నివాసానలు ఖాళీ చేయకపోతే కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. బలవంతంగా ఖాళీ చేయించాల్సి ఉంటుందని అధికారవర్గాలు హెచ్చరించాయి. సీఆర్ పాటిల్ నేతృత్వంలోని లోక్‌సభ హౌసింగ్ కమిటీ ఈ ఏడాది ఆగస్టు 19న 200 మంది మాజీ ఎంపీలు తమ అధికారిక నివాసాలను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వారంలోగా ఖాళీ చేయకపోతే విద్యుత్, నీళ్లు, గ్యాస్ కనెక్షన్లను తొలగిస్తామని హెచ్చరించింది. దీంతో మొత్తం 150 మంది తమ అధికారిక నివాసాలను ఖాళీ చేశారు. కానీ 50 మంది మాత్రం ఇంకా ఖాళీ చేయలేదని సూచించింది.

ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వీయుజ మాసం, శుక్లపక్షం; తిథి: నవమి మ.12.37 వరకు; నక్షత్రం: ఉత్తరాషాడ సా.5.26 వరకు, అమృతకాలం: ఉ.10.24 నుండి మ.12.09 వరకు; వర్జ్యం: రా.9.54 నుండి 11:41 వరకు; దుర్ముహూర్తం: మ.12.27 నుండి 1.14 వరకు, మ.2.48 నుండి 3.35 వరకు; రాహుకాలం: ఉ.7.39 నుండి 9.07 వరకు; యమగండం: ఉ.10.35 నుండి మ.12.03 వరకు;

ఉన్నదంతా ఊడ్చేస్తున్నారు!

- సమ్మెవేళ ఛార్జీల బాదుడు... ప్రైవేటు దోపిడీ
- హనుమకొండకు రూ. 2వేలు!
- అడ్డగోలుగా ఆటోవాలాల దందా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీ సమ్మె రెండో రోజూ కొనసాగటంతో దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లాలనుకున్న ప్రయాణీకులకు తిప్పలు తప్పలేదు. ఒక్క బస్సు అయినా రాకపోతుందా అని గంటల తరబడి బస్టాండ్లలో వేచి చూసిన ప్రయాణీకులకు నిరాశే మిగిలింది. ప్రయివేటు వాహనాల్లో వెళదామంటే అవి ఎక్కడ ఉంటాయో కూడా తెలియక, ఉన్న అధికా ఛార్జీలతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం సాయంత్రం సద్దుల బతుకమ్మ పండుగ ఉండటం, ఆ మరుసటి రోజు దసరా పండుగ ఉండటంతో శనివారం కంటే భారీ సంఖ్యలో ఆదివారం ప్రయాణీకులు గ్రామాల బాట పట్టారు. పండుగకు ఇంటికి వెళుతున్నామన్న సంతోషం సమ్మె కారణంగా నీరుగారుపోయిందని ప్రయాణీకులు వాపోయారు. చిన్నపిల్లలతో , వృద్ధులతో ఊళ్లకు బయలుదేరినవారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బస్టాండ్లు, ప్రయివేటు వాహనాల వద్దకు తిరగలేక ప్రయాణీకులు సతమతవవుతున్నారు. పండుగ సమయంలో సమ్మె కొనసాగించటం సరికాదని ప్రయాణీకులు స్పష్టం చేస్తున్నారు. మూడు, నాలుగు వేలతో దసరా పండుగ జరుపుకోవాలనుకున్న సామాన్యుల పరిస్థితి దారుణంగా ఉంది. పండుగ కోసమని సంపాదించిన ఆ కాస్తోకూస్తో డబ్బులో 70 శాతం రవాణా చార్జీలకే వెచ్చించాల్సి వస్తోందని పేద ప్రయాణీకులు వాపోతున్నారు. పండుగకు వెళ్లేటప్పుడు ఉన్న సమ్మె పరిస్థితులే తిరుగు ప్రయాణంలోనూ ఉంటే దసరాకు అప్పు చేయకతప్పదని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా అయితే ... హైదరాబాద్ నుంచి నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం రూ.500తో బస్సులో హన్మకొండకు ప్రయాణించేవారు. సమ్మె కారణంగా హన్మకొండకు వెళ్లేందుకు ప్రయివేటు వాహనదారులకు రూ.2వేలదాకా చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఆటోవాలా నిలువు దోపిడి

ఆర్టీసీ సమ్మె కారణంగా రైళ్లలో సొంత ఊర్లకు చేరుకోవాలనుకున్న వారిని నగరంలోని రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలంటే ఆటో చార్జీ తడిసి మోపెడవుతోంది. సాధారణ రోజుల్లో మీటరుపై రూ.150 చెల్లించి స్టేషన్‌కు చేరుకునేవారమని, ప్రస్తుతం ఆటో వాలాలు మీటరు వేయకుండా గంపగుత్తాగా రెండింతల నుంచి మూడింతల చార్జీని డిమాండ్ చేస్తున్నారని ప్రయాణీకులు వాపోయారు. మీటరు వేయాలని డిమాండ్ చేస్తే ఆటోలో నుంచి దింపేస్తున్నారని చెప్పారు. బస్టాండ్లో బస్సులు లేకపోవటంతో రోడ్డుపై ప్రయివేటు వాహనాల కోసం వేచి చూసిన ప్రయాణీకులను వరణుడు ఇబ్బంది పెట్టాడు. హైదరాబాద్‌లో మధ్యాహ్నం 12.30 నుంచి 2 వరకు కురిసన వర్షంతో ప్రయాణీకులు తడిసిముద్దయ్యారు. తమతోపాటు వెంట తెచ్చుకున్న లగేజీ తడవకుండా ఉండేందుకు చాలా పాట్లు పడ్డారు.

మెట్రో సరికొత్త రికార్డు

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో మెట్రో రికార్డు నెలకొల్పింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మెట్రో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆర్టీసీ సమ్మెతో మెట్రో రైళ్లలో రద్దీ పెరిగింది. ప్రయాణీకులతో మెట్రో స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. శనివారం ఒక్కరోజే మొత్తం 3.65 లక్షల మంది ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చింది. గతంలో అత్యధికంగా 3.06 లక్షల మంది ప్రయాణించిన రికార్డును తిరగరాసింది. ఉదయం 5 గంటల నుంచే సర్వీసులను ప్రారంభించిన మెట్రో... ప్రతి మూడు నిమిషాలకో రైలును నడిపింది. ప్రతీరోజూ నడిపూ రైళ్లకు అదనంగా మరో ఆరు రైళ్లను చేర్చి... అదనంగా వంద ట్రిప్పులను నడిపింది. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయని ఆ సంస్థ ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డి తెలిపారు.

వరంగల్: భద్రకాళి ఆలయంలో దుర్గామాతగా కొలువుదీరిన అమ్మవారు

విశాఖపట్నం: కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి 4కేజీల బంగారం, 2కోట్ల నగదుతో ప్రత్యేక అలంకరణ

శారదాదేవిని ఆరాధిస్తే శుభాలు

శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్రసరస్వతి స్వామి

వరంగల్ కల్చరల్, ప్రభన్యూస్ : శారదాదేవిని ఆరాధిస్తే సర్వశుభాలు కలుగుతాయని విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్రసరస్వతి స్వామి అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా, హన్మకొండ హంటర్‌రోడ్డులోని రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఇంటిలో జరుగుతున్న రాజశ్యామల శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాజశ్యామల అమ్మవారిని వివిధ రకాలైన ఆభరణాలు, పూలు, పండ్లతో అలంకరించి పూజలుచేశారు. అనంతరం రుద్రాభిషేకం, శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, కెప్టెన్ లక్ష్మీకాంతారావు సరోజని దంపతులు, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, ఒడితెల సతీష్‌కుమార్ షమిత దంపతులు, లక్ష్మీకాంతారావు కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హరీష్‌రావుకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు.

విలీనం లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఐదున్నర గంటల పాటు ఆర్టీసీ భవితవ్యంపై సుదీర్ఘంగా సమీక్షించారు.

ఆ ఉద్యోగులను మళ్లీ తీసుకోం

సమీక్షసందర్భంగా అధికారులతో కేసీఆర్ అనేక అంశాలు ప్రస్తావిస్తూ తన అభిప్రాయాలు వెల్లడించారు. ఆర్టీసీ చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. ఆర్టీసీని లాభాల బాటలో ముందుకు నడిపించాల్సిన అవసరం అవశ్యమని, సంస్థ మనుగడ కొనసాగాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు, చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సంవత్సరానికి రు.1200 కోట్ల నష్టంతో, రు.5000 కోట్ల రుణ భారంతో, క్రమబద్ధంగా పెరుగుతున్న డీజిల్ ధరలతో ఆర్టీసీ ఇబ్బందుల్లో వున్న సమయంలో చట్ట విరుద్ధమైన సమ్మెను ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం విజ్ఞప్తి చేసినా పండుగ సీజన్లో సమ్మెకు దిగిన వారితో రాజీ సమస్యే లేదని, వారు చేసింది తీవ్రమైన తప్పిదమని వ్యాఖ్యానించారు. ఎట్టి పరిస్థితుల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రసక్తే లేదని, ఇక వారితో ఎలాంటి చర్చలు జరిపేది లేదని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఆర్టీసీకి సంబంధించి ఎలాంటి క్రమ శిక్షణా రాహిత్యం, బ్లాక్ మెయిల్ విధానం, తలనొప్పి కలిగించే చర్యలు ఉండకూడదని, శాశ్వతంగా పరిష్కారమార్గం చూపాలని ప్రభుత్వం భావిస్తున్నదని చెప్పారు. గడువు పూర్తి అయ్యేలోపల, అంటే ప్రభుత్వం విధించిన గడువు లోపల విధుల్లోకి హాజరు కాని సిబ్బందిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకునే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. ఇక ఆర్టీసీలో మిగిలిన సిబ్బంది కేవలం 1200 మంది లోపేనని తెలిపారు.

పక్షంలోగా పూర్వవైభవం

గరిష్ఠంగా 15 రోజుల్లోగా ఆర్టీసీని పూర్వస్థితికి తీసుకురావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ''గత నలభై సంవత్సరాలుగా ఆర్టీసీ చుట్టూ అల్లుకున్న వ్యవహారం ఒక నిరంతర సమస్యాత్మకం. దీనికి ఒక శాశ్వత పరిష్కారం కనుగొనాలి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక అనేక రంగాలలో ముందుకు దూసుకుపోతున్నది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ లాంటి సమస్యలు ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసే విధంగా మారాయి. ఇప్పుడు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె చట్ట వ్యతిరేకం, ఆలోచనా తప్పిదం, బాధ్యతారాహిత్యం. ఇప్పుడు రాష్ట్రానికి ఈ విషయంలో శాశ్వతమైన లాభం చేకూరాలి. మధ్యప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, మణిపూర్‌లో ఆర్టీసీనే లేదు. బీహార్, ఒరిస్సా, జమ్మూ, కాశ్మీర్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, యూపీ రాష్ట్రాల్లో నామ మాత్రంగా వున్నాయి. ఆ విధంగా చూస్తే కర్నాటక తరువాత తెలంగాణలో అత్యధికంగా బస్సులు నడుస్తున్నాయి. ఇంత మంచిగా చూసుకుంటుంటే సమ్మెకు దిగడం అవసరమా?'' అని అన్నారు కేసీఆర్.

ఆర్టీసీని లాభాల్లోకి తెస్తాం : సీఎం ధీమా

''ఆర్టీసీ తప్పకుండా లాభాల్లోకి రావాలి. దాన్ని లాభాల్లో నడిచే సంస్థగా రూపుదిద్దాలి. ఏదేమైనా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలగకూడదు. ఆర్టీసీ చేస్తున్న ఏర్పాట్లతో పాటు, రాష్ట్రంలో కోటి 22లక్షల 58వేల 433 వివిధ రకాల ప్రయివేట్ వాహనాలున్నాయి. ఇవన్నీ ప్రజల రవాణాకు ఉపయోగపడేవే. ఆర్టీసీలో ఉన్న యాజమాన్య నైపుణ్యాన్ని చక్కగా వాడుకోవాలి. ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా కూడా లాభాలు రాబట్టాలి. ఈ పోటీ ప్రపంచంలో వినూత్నంగా ఆలోచించి సంస్థను లాభాల్లోకి తీసుకురావాలి. అనేక రంగాలలో ముందున్న తెలంగాణ రాష్ట్రం ఆర్టీసీ విషయంలో కూడా ముందుండాలి. దానికి అవసరమైనదంతా చేయాలి. నాకు అన్నింటికన్నా అత్యంత ప్రాధాన్యమయింది తెలంగాణ గొప్ప రాష్ట్రంగా తయారు కావడమే. యావన్మంది ప్రజల క్షేమమే నా ధ్యేయం. ఒక అద్భుతమైన, గొప్పదైన, సమర్థమైన లాభాలబాటలో నడిచే సంస్థగా ఆర్టీసీ రూపుదిద్దుకోవాలి'' అని కేసీఆర్ ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరానికి చెందినంత వరకు నష్టాలను ప్రభుత్వం భరిస్తుందన్నారు. ప్రస్తుతం 10,470 బస్సులలో సుమారు కోటి మంది ప్రయాణం చేస్తున్నారని, భవిష్యత్ లో కూడా ఆ సౌకర్యం కొనసాగుతుందని వెల్లడించారు. సగటున ఆర్టీసీ సిబ్బందికి నెలకు రు.50,000 జీతం వస్తున్నా ఇంకా పెంచమని అడగడంలో అర్థం లేదన్నారు.

పునరుద్ధరణకు కమిటీ... నేడు సీఎంకు నివేదిక

ఈ విషయాలన్నీ కూలంకషంగా చర్చించి, ఒక నివేదిక సమర్పించడానికి రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ అధ్యక్షతన ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సభ్యులుగా రవాణా శాఖ కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా, టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పాండురంగనాయకులు ఉన్నారు. వాళ్ళు తమ ప్రతిపాదనలను సోమవారం ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, మేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపి మహేందర్ రెడ్డి, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్ రావు, సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి, రవాణాశాఖ కమిషనర్ సందీప్ సుల్తానియా, అడిషనల్ డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కొత్త నియామకాలు

తక్షణ చర్యగా 2500 బస్సులను అద్దె పద్ధతిలో తీసుకుని నడపాలని నిర్ణయించినట్లు చెప్పారు. ''ఆర్టీసీతో పాటు 4,114 ప్రైవేట్ బస్సులు ఇంకా వున్నాయి. వాటికి స్టేజ్ క్యారేజ్‌గా చేస్తే వాళ్ళు కూడా ఆర్టీసీలోకి అద్దె ప్రాతిపదికన వస్తారు. ఈ విషయంలో వాళ్ళతో ఆర్టీసీ, రవాణా అధికారులు చర్చలు జరుపుతున్నారు. అతి కొద్ది రోజుల్లోనే కొత్త సిబ్బంది నియామకం చేపడుతాం'' అని సీఎం పేర్కొన్నారు. నియామక ప్రక్రియ అతిత్వరగా చేపట్టాలని, కొత్తగా చేర్చుకునే సిబ్బంది యూనియన్లలో చేరమని ఒప్పంద పత్రం మీద సంతకం చేయించాలని అధికారులకు సూచించారు. కొత్త సిబ్బంది షరతులతో కూడిన నియామకం అవుతుందని, ప్రొబేషన్ పీరియడ్ వుంటుందన్నారు. ఏఏ కేటగిరీ సిబ్బంది సమ్మె కు పూనుకున్నారో, ఆయా కేటగిరీలకు చెందిన సిబ్బందిని భర్తీ చేయడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు.

ప్రజల క్షేమం కోసమే..

''భవిష్యత్‌లో ఆర్టీసీని ఏం చేయాలన్నా ముందు దృష్టిలో ఉంచుకోవాల్సింది ప్రజలను. ఆర్టీసీలో నైపుణ్యమైన, వృత్తిపరమైన యాజమాన్యం వుంది. అన్ని విధాలా స్థిరత్వం సాధించుకునే వీలుంది. మనం ఏదైనా నిర్ణయం తీసుకునే ముందర సమతుల్యం పాటించాలి. ఒక పక్క ప్రయివేట్ భాగస్వామ్యం, మరొక పక్క ఆర్టీసీ యాజమాన్యం వుంటేనే మంచిది. ప్రజలు సమ్మెకు దిగిన ఆర్టీసీ సిబ్బందిమీద చాలా కోపంగా వున్నారు. సోషల్ మీడియాలో కూడా వ్యతిరేకత వస్తున్నది.'' అని ముఖ్యమంత్రి కారాఖండిగా చెప్పేశారు.

అఖిలపక్షం డిమాండ్ అసంబద్ధం

''ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం గురించి అఖిలపక్ష సమావేశం జరపాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. వారికి ఆర్టీసీ విషయంలో మాట్లాడే హక్కులేదు. సీపీఎం అధికారంలో ఉన్నపుడు నాడు పశ్చిమ బెంగాల్‌లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసారా? కేరళలో చేసారా? బీజేపీ ఎన్నో రాష్ట్రాలలో అధికారంలో వుంది. కాని ఎక్కడైనా విలీనం చేసారా? కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు ఏ రాష్ట్రంలోనైనా చేశాయా? అందుకే వాళ్లకు అడిగే హక్కు లేదు". అని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు.

కొత్త గమ్యం వైపు ఆర్టీసీ

50 శాతం ప్రైవేటీకరణ...
అద్దె బస్సులు రెట్టింపు
కొత్త బస్సులకు ఇక నో.. సగానికి సగం తగ్గనున్న సిబ్బంది... వేతనాల భారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయంతో సంస్థలో కొత్త అధ్యాయం మొదలుకానుంది. సంస్థను ఆర్థికంగా పరిపుష్టి చేయడం, ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించడమే లక్ష్యంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలోని అంశాలతో ఆర్టీసీ దిశ, దశ ఎలా మారబోతోందోనన్న చర్చ మొదలైంది.

అద్దె బస్సులతో లాభాలెన్నో

ఆదాయంలో ఎక్కువ శాతం ఇంధనం, సిబ్బంది జీతభత్యాలకే వెచ్చిస్తోంది. ఈ భారాన్ని తగ్గించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్టీసీలో 10,470 బస్సులు న్నాయి. వాటిలో 2650 బస్సులు కాలం చెల్లినవి. అవికాక 2103 బస్సులు అద్దె బస్సులున్నాయి. ఇక నుంచి సంస్థకు కొత్త బస్సులను కొనుగోలు చేయకుండా ప్రైవేట్ బస్సులను అద్దె ప్రాతిపదికన నడిపితే సరిపోతుందని భావించింది. దీంతో వేతనాల భారం గణనీయంగా తగ్గనుంది. అధికారుల లెక్కల ప్రకారం ఒక బస్సుకు కనీసం 5గురు కార్మికులు అవసరం. అంటే 4వేల బస్సులను అదనంగా సమకూర్చుకోవడం ద్వారా సుమారు 20 వేల మంది ఉద్యోగులను తగ్గించుకునే వెసులుబాటు కలిగింది.

ఆస్తులు ప్రైవేటుకు.. సరకు రవాణాపైనా దృష్టి

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు దాదాపు రూ. 80 వేల కోట్ల విలువ చేసే ఆస్తులున్నాయి. వీటిల్లో చాలా వరకు కీలకమైన ప్రాంతాలలోనే ఉన్నాయి. వీటన్నింటినీ ప్రైవేట్ బస్సు యాజమాన్యాలకు అప్పగించి సరకు రవాణాకు ఉపయోగించాలన్న ప్రతిపాదన వచ్చింది. ఏ కేడర్‌లో ఎంత మంది ఉద్యోగాలు ఖాళీ అయ్యాయన్న విషయాలపై దృష్టి కేంద్రీకరించారు. ప్రస్తుతానికి ఉన్న సమాచారం మేరకు సమ్మెలోకి వెళ్ళని కార్మికులు 1200 మంది అని తేలింది. ఇందులో వేయి మంది డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌లు ఉంటారన్న అంచనాకు వచ్చారు. ఏ డిపోలో ఎంత మంది తాజాగా డ్రైవర్, కండక్టర్లతో పాటు మెకానిక్‌లను ఎంత మందిని రిక్రూట్ చేసుకోవాల్సి ఉంటుందన్న అంశాలపై ఆరా తీస్తున్నారు. విభాగాలవారీగా ఉద్యోగుల వివరాలను సునీల్‌శర్మ బృందం పరిశీలిస్తోంది.

లొంగేది లేదు

- తాటాకు చప్పుళ్లకు భయపడం
- సింగిల్ టెండర్‌తో బినామీలకు కట్టబెట్టే యత్నం
- మేఘా కృష్ణారెడ్డికి ఆర్టీసీని అప్పగించే కుట్ర
- ప్రభుత్వ నిర్ణయంపై అశ్వత్థామరెడ్డి ధ్వజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్టీసీలో ఇక మిగిలింది 1200 మంది ఉద్యోగులేనని ప్రభుత్వం చేస్తోన్న బెదిరింపులకు, తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ఆదివారం సాయంత్రం కీలక ప్రకటన చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ, ఆర్టీసీ సీఎం జాగీరు కాదని తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. వేలమంది ఆర్టీసీ కార్మికులను తొలగించేందుకేనా తెలంగాణ తెచ్చుకున్నది? ఏపీ ప్రభుత్వంపై మమ్మల్ని రెచ్చగొట్టి తెలంగాణ సాధించింది ఇందుకేనా? అని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. 'మిమ్మల్ని నమ్ముకుని తెలంగాణ ఉద్యమం సమయంలో సకలజనుల సమ్మె చేయటం బుద్ధి తక్కువయింది.' అని కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. ఆర్టీసీకి ప్రభు త్వం బకాయిపడిన రూ.2400 కోట్లను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజా రవాణా వ్యవస్థపై పన్నులు ఎలా విధిస్తారు? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ కళ్లు ఆర్టీసీ ఆస్తులపై పడ్డాయని, సింగిల్ టెండర్‌ద్వారా వాటిని తన ఒకరిద్దరు బినామీలకు కట్టబెట్టి, ఆర్టీసీని ముంచేందుకు సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజాస్వామంలో ఎంతోమంది నియంతలు వచ్చి పోయారని, ఎవరూ నిలబడలేదని, నియంతలా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్‌కు అదే గతి పడుతుందని హెచ్చరించారు.



ప్రభుత్వాన్నీ ప్రైవేటు భాగస్వామ్యంతో నడపండి

ఇక నుంచి ఆర్టీసీని ప్రయివేటు-ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిపిస్తామన్న నిర్ణయాన్ని అశ్వత్థామ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్టీసీ నష్టాల్లో ఉన్నట్టే.... 'తెలంగాణ ప్రభుత్వం కూడా అప్పుల పాలయింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని కూడా 50 శాతం ప్రయివేటు భాగస్వామ్యంతో నడిపించాలి. ఇలాంటి నిర్ణయాలతో ముందుకుపోతే సీఎం కేసీఆర్ ప్రభుత్వం కూలిపోవటం ఖాయం.' అని హెచ్చరించారు. ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.3 వేల కోట్లనే చెల్లించలేని వారు... రూ.3 లక్షల కోట్ల అప్పులను ఎలా తీరుస్తారని సీఎం కేసీఆర్‌నుద్దేశించి ఎద్దేవా చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా నిలబడాలని ఉద్యోగసంఘాలను కోరారు. ఓడ మీద ఉన్నంతసేపు ఓడ మల్లయ్య అని, ఓడ దిగాక బోడమల్లయ్య అన్నచందంగా ఆర్టీసీ కార్మికుల విషయంలో సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని అశ్వత్థామరెడ్డి సీఎం కేసీఆర్ తీరుపై విరుచుకు పడ్డారు. సీఎం కేసీఆరే ప్రయివేటు ఆపరేటర్ అని... మేగా కృష్ణారెడ్డికి ఆర్టీసీని అమ్మే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'మా బుద్ధి తక్కువయి మిమ్మల్ని ముఖ్యమంత్రిగా ఎనుకున్నాం.' అని ఆక్రోశం వెల్లగక్కారు.

జోక్యం చేసుకోలేం..!

- విరమించమని ఈదశలో చెప్పలేం
- సమ్మెపై నివేదిక సమర్పించండి
- హైకోర్టు స్పష్టీకరణ
- 11 వేల బస్సులు నడుపుతున్నాం
- హైకోర్టుకు నివేదించిన సర్కారు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న సమ్మె పై ఈ దశలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది... సమ్మెను విరమించాలని ఆర్టీసీ కార్మికులను ఆదేశించేందుకు, సమ్మెను చట్ట విరుద్ధంగా ప్రకటించేందుకు హైకోర్టు నిరాకరించింది. తాము రోజుకు 11 వేల బస్సులు నడుపుతున్నామని ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఆర్టీసీ సిబ్బంది సమ్మెలో ఉండగా అన్ని బస్సులు ఎలా నడుపుతున్నారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆర్టీసీ సమ్మెపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి, టీఎస్ ఆర్టీసీ ఎండీ, రవాణాశాఖ కమిషనర్, కార్మికశాఖ కమిషనర్, టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ కార్యదర్శులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.రాజశేఖర్ రెడ్డి, జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి తో కూడిన డివిజన్ బెంచ్ ఆదివారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 10కి వాయిదా వేసింది. సమ్మె విరమించాలని ఆర్టీసీ ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీని (జేఏసీ) ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. హైకోర్టు కు దసరా సెలవులు కావడంతో హౌస్ మోషన్ రూపంలో ఆర్ సుబేందర్ సింగ్ అనే రీసెర్చ్ స్కాలర్ ఈ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..ఆర్టీసీ సమ్మె కారణంగా సామాన్యులు ఇబ్బంది పడ్తున్నారని తెలిపారు.

సమ్మెపై మధ్యంతర ఉత్తర్వులు వద్దు : అడ్వకేట్ జనరల్ వాదన

ప్రభుత్వం తరపున తెలంగాణ అడ్వకేట్ జనరల్ బీఎస్.ప్రసాద్, అదనపు అడ్వకేట్ జనరల్ జె.రాంచంద్రారావు వాదనలు వినిపించారు. ఆర్టీసీ సిబ్బంది సమ్మెకు దిగడంతో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు విన్నవించారు. అయితే ఆర్టీసీ నిర్వాహణలో కేవలం 10 వేల బస్సులు మాత్రమే తిరిగేవని, తాము 11 వేల బస్సు సర్వీసులను నడుపుతున్నామని తెలిపారు. దీనిపై ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ఆర్టీసీ సిబ్బంది సమ్మెలో ఉండగా అన్ని బస్సులను ఎలా నడుపగల్గుతున్నారని ప్రశ్నించింది. దీనిపై టీఏజీ స్పందిస్తూ..ఆర్టీసీ లో కొన్ని అద్దె బస్సులున్నాయని, వీటికి తోడుగా కొన్ని ప్రైవేటు బస్సులు, పాఠశాల బస్సులకు రూట్ పర్మిట్లు ఇచ్చినట్లు విన్నవించారు.

ఉద్యోగుల తొలగింపును ఖండిస్తున్నా: భట్టి విక్రమార్క

ఆర్టీసీ ఉద్యోగుల తొలగింపును ఖండిస్తున్నాను. సమ్మె విషయంలో కేసీఆర్ చేసిన ప్రకటన ఆయన అహంకారానికి పరాకాష్ట. కార్మికులు వారి కోరికలు నెరవేర్చుకోవడం కోసం ఈ దేశంలో ఇచ్చిన కార్మిక చట్టాల ద్వారా సమ్మె చేయడం ఒక భాగం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు కార్మికులతో చర్చలు జరిపి సమస్యకు ఒక సానుకూల పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యత. సమ్మెకు దిగిన ఉద్యోగులతో చర్చలు జరపకుండా వారిని ఉద్యోగాల నుంచి తొలగించినట్లు ప్రకటించడం దారుణం. ఆర్టీసీ నష్టాలకు కార్మికులు కారణం కాదు. డీజిల్‌ప అధిక పన్నులు వేసి నష్టాలకు కారణమైంది.

చొరవ తీసుకోండి: రేవంత్

ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె విరమణకు సీఎం కేసీఆర్ చొరవ తీసుకోవాలి. ఒక లేఖను కూడా ఆయనకు రాశాను. కార్మికుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని కోరాను. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల పాత్ర అద్వితీయమైంది. ఆర్టీసీ కార్మికులు ప్రధానంగా 15 డిమాండ్లతో సమ్మెకు దిగారు. గడిచిన ఐదున్నరేళ్లుగా టీఆర్ఎస్ పాలనలో న్యాయం జరుగుతుందని వారు ఎదురు చూశారు. ముఖ్యమంత్రిగా కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించాల్సిన బాధ్యత తమపై ఉందని లేఖలో పేర్కొన్నాను.

ఆర్టీసీకి టీడీపీ మద్దతు: ఎల్ రమణ

తెలంగాణ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణమద్దతు ఇస్తుంది. టీఎస్ ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులతో సమావేశం అయ్యాను. సోమవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో ఆర్టీసీ జేఏసీ చేపట్టే నిరాహారదీక్షకు మద్దతు ప్రకటించాలని వారు కోరారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులను సీఎం కేసీఆర్ చులకన భావంతో చూడటం తగదు. ఉద్యమ సమయంలో, ఎన్నికల ముందు కేసీఆర్ ఆర్టీసీ కార్మికుల గురించి మాట్లాడిన మాటలను ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలి.

ఏపీని చూసి నేర్చుకోండి: కోమటిరెడ్డి

నల్గొండ (టౌన్), ప్రభన్యూస్ : ఆర్‌టీసీ కార్మికులను రెచ్చగొట్టి సమ్మెను ఉధృతం చేయవద్దనడం తగదు. కార్మికులను ఆరుగంటల్లోపు పీకేస్తామని కేసీఆర్ బెదిరింపులకు పాల్పడితే సీఎం పదవిని ప్రజలు పీకేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మె ఆదివారం రెండవరోజుకు చేరుకుంది. సమ్మె చేసిన కార్మికులకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాను. రూ.70వేల కోట్ల ఆస్తి ఉన్న ఆర్‌టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలి. తెలంగాణ ప్రజలకు అత్యంత ముఖ్యమైన దసరా పండుగరోజు ప్రజలు, ఆర్‌టీసీ కార్మికులు ఇబ్బందులు పడుతుంటే కేసీఆర్ మొండిగా వ్యవహరించడం సరికాదు. పక్క రాష్ట్రంలోలో బడ్జెట్ ఉన్నప్పటికీ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నారు. పక్కరాష్ట్రాన్ని చూసి కేసీఆర్ నేర్చుకోవాలి. కార్మికులు, ఉద్యోగులతో పెట్టుకుంటే గతంలో ఎన్‌టీఆరేనే మట్టిలో కరిపించారు. నిన్ను కూడా అదే చేస్తారు.

విలీనం చేయాలి: విమలక్క

ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు న్యాయం చేయాలి. కార్మికులు చేస్తున్న సమ్మె సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలియజేస్తున్నాను. కేసీఆర్ ఆర్‌టీసీ కార్మికులపట్ల నియంతృత్వ ధోరణి వీడాలి. వారికి న్యాయమైన 26 డిమాండ్లను ఎన్నికల ముందు ఇచ్చిన హామీలే. వాటిని వెంటనే పరిష్కరించాలి.

ఆర్టీసీ నిర్వీర్యానికి కుట్ర

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వంలో విలీనం సహా తమ 26 డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించేవరకు సమ్మె విరమించబోమని ఆర్టీసీ కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ట్రేడ్ యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆర్టీసీని మూసివేసే కుట్రకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి ఆరోపించారు. ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు నరసింహన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు అంతర్జాతీయ కార్మికసంఘాలు కూడా మద్దతు తెలిపాయన్నారు. టీఎన్‌టీయూసీ నేత బోను మాట్లాడుతూ... కేంద్ర కార్మికశాఖా మంత్రిగా పనిచేసిన కేసీఆర్‌కు అసలు కార్మికుల హక్కులు, కార్మిక చట్టాలు తెలియవని విమర్శించారు. త్రిసభ్య కమిటీని ఎందుకు వేసినట్లు, ఎందుకు రద్దు చేసినట్లు అని ప్రశ్నించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ... ఎస్మా, డిస్మిస్ బెదిరింపులకు లొంగకుండా కార్మికుల సత్తా ఏమిటో ప్రభుత్వానికి ఆర్టీసీ సమ్మె చూపిందన్నారు. ఉద్యమాలు నిర్వహించి సంఘాలు స్థాపించిన సీఎం కేసీఆర్, అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ కార్మికులకు సమ్మె చేసే హక్కులేదనటం నిరంకుశత్వానికి నిదర్శనమని సీఐటీయూ నేత భాస్కర్ విమర్శించారు. కార్మికుల సమ్మెపై అనైతిక చర్యలు తీసుకున్న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితను గద్దె దించినట్లే... కార్మికులంతా ఐక్యమై కేసీఆర్‌ను గద్దె దించుతారని హెచ్చరించారు. సమ్మె కార్మికుల జన్మ హక్కు అని సుప్రీం కోర్టు చెప్పిందని సీఎం కేసీఆర్‌కు గుర్తు చేశారు.సోమవారం ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వాప్తంగా జిల్లా, మండల, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిరసనలకు దిగాలని ట్రేడ్ యూనియన్లకు పిలుపునిచ్చారు.

అదే పట్టు.. అవే పాట్లు..!

రెండవ రోజూ తిరగని బస్సులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్టీసీ సమ్మె రెండవ రోజు కూడా కొనసాగింది. ఆదివారంనాడు కూడా డిపోలు దాటి బస్సులు రాలేదు. దీంతో ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. ప్రభుత్వం నిన్నటికన్నా ఎక్కువగా సర్వీసులు నడిపామని ప్రకటించినప్పటికీ, ప్రయాణీకులు బస్సులే కనిపించలేదన్నారు. సమ్మె విషయంలో ఇటు ప్రభుత్వం ఆటు కార్మిక సంఘాలు ఏ మాత్రం పట్టు వీడకపోవడం పండుగవేళ సొంత ఊళ్లకు వెళ్లాలనుకున్నవారికి చుక్కలు కనపడుతున్నాయి. సమ్మె ప్రభావం ఏ మాత్రం లేకుండా ఉండేందుకు వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసేందుకు స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, రవాణా శాఖ, ఆర్టీసీ ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. సంస్థ బస్సులతో పాటు అద్దె బస్సులను కొన్నింటిని రోడ్లపై తిప్పినా ప్రయాణికులకు సరిపోయంత స్థాయిలో లేకపోవడంతో చాలా చోట్ల ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. బస్సులు లేకపోవడంతో చాలా మంది రైళ్ళలో వెళ్ళేందుకు సన్నద్ధమై రైల్వే స్టేషన్‌లకు తరలి రావడంతో అక్కడ విపరీతమైన రద్దీ ఏర్పడింది. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకున్న రైల్వే అధికారులు దాదాపు 600 ప్రత్యేక రైళ్ళను ముందుగానే ప్రకటించి నడిపినప్పటికీ అవి ఏ మాత్రం సరిపోకపోవడంతో దాదాపు అన్ని రైల్వే స్టేషన్‌లలో రద్దీ తీవ్రంగా కనిపించింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణికుల తోపులాటలో పోలీ సులు చిక్కుకుపోయారు. కూకట్‌పల్లి బస్‌డిపో నుంచి బతుకమ్మ ఆడేందుకు వచ్చిన వారిని పోలీసులు అడ్డుక

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీ వాక్షం

బతుకమ్మను సాగనంపే పాట

తంగేడు పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ...
గునుగు పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ...
బంతి పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ...
పట్టుకుచ్చు పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ...
చంద్రకాంత పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ...
గుమ్మడి పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ...
మందార పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ...
గన్నేరు పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ...
చామంతి పూవుల్ల చందమామ
మల్లెన్నడొస్తావు చందమామ...
మాతల్లి బతుకమ్మ చందమామ
నీళ్లల్ల పోతుంది చందమామ..
మమ్ము చల్లంగా దీవించు చందమామ
వచ్చెడికి కలుద్దాం చందమామ...
పోతే పోతివి గాని చందమామ
మలెన్నడొస్తావు చందమామ...
మాయమ్మ లక్ష్మిదేవి చందమామ
పోయి రావే తల్లి చందమామ...

మియాపురం శ్రీనివాస్
9493264620

ఈ తరానికి ఆ తరం కవిత

నారుమడిగా సమాజాన్ని కలగంటున్న జూకంటి

ఆరుద్ర కవిగా ప్రయోగశీలి, ఆయన అభ్యుదయ కవిత్వాన్ని మరో కవి సృజించని విధంగా, సవ్వంగా రాసి తన ప్రత్యేకతను నిలుపుకున్నారు. 1948 ప్రాంతంలో తెలంగాణ విమోచన పోరాటం ఉధృతంగా సాగుతున్న రోజుల్లో ప్రాంతాలకతీతంగా ఉద్యమాన్ని సమర్థిస్తూ, నిజాం పాలనలోని నిరంకుశత్వాన్ని, రజాకార్ల అరాచకాలను కవులు తమ కవిత్వం ద్వారా తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ధైర్యంగా నిలబడ్డారు. అలాంటి కవుల్లో ఆరుద్ర కూడా ఒకరు. నిజాం సంస్థానంపై సైనిక చర్య జరగక ముందు ఆరుద్ర ''త్వమేదాహం'' వెలువడింది. ఇది తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో వచ్చినది. దీన్ని 1948లో ఆవంత్య సోమసుందర్ తమ కళాకేళి ద్వారా ప్రచురించారు. అయితే ''త్వమేవాహం''లోని కవితలు అంతర్లీనంగా తెలంగాణ పోరాటం ప్రవహిస్తుంటుంది కాని ప్రత్యేకంగా అది కనిపించనట్టుగా ఉంటుంది.

''1948 జూలై పదవ తారీఖు కృష్ణా పత్రికలో ''నాకా సిగ్గు నా స్త్రీత్వం ఎప్పుడో పోయింది'' అనే పతాకతో ఒక ''రజాకార్లచే చెరచబడ్డ స్త్రీ కథనం'' పడ్డది. అది చదివిన ఆరుద్ర చలించిపోయి ''త్వమేవాహం'' రచనకు శ్రీకారం చూట్టారు. ఈ రచనపై ఆరుద్ర శ్రీశ్రీని ఏమిటి నీ అభిప్రాయం అని అడిగితే ''ఇక నేను పద్యాలు రాయకపోయినా పర్వాలే''దన్నాడు. ఆరుద్ర రచల్లో గొప్ప రచనల్లో ఒకటైన ''త్వమేవాహం'' నుండి ''స్టాప్‌వాచీ'' అనే కవిత ఈ వారం సాహితీ గవాక్షం పాఠకుల కోసం.

స్టాప్ వాచీ

ఉరు
మేధకు
నిరు
పేదలు
ఈ
రోజున
రా
రాజులు
ఈ
కాంతను
చెరపట్టగ
రా
కాసులు
తలపెట్టిరి
ఆ
మెన్
ఆమెన్
వారిని
పడగొట్టన్
నీ
గన్
నా
పెన్
ఆపెన్
కాపాడును
నీ
విన్
నీవిన్
భావిన్
కాపాడును

- ఆరుద్ర

సమాజంపై బాధ్యత గల కవికి ఎప్పుడూ విశ్రాంతి ఉండదు. నూతన సమాజ నిర్మాణంలో ఈ కవి పాత్ర అమూల్యం. తాను కలలు గన్న లోకం కోసం పలు విధాలుగా పలువరిస్తుంటాడు. ఈ పలవరింత సారమంతా ఒకొనొక సమయంలో అక్షరాకృతి దాల్చి అద్భుత కవితా ఖండికగా రూపుదిద్దుకొంటూ ఇటువంటి బాధ్యత గల కవి, సమాజం పట్ల మమకారమున్న కవి. నిత్యం సగటు మనిషి గురించి కలవరించే కవి మన జూకంటి జగన్నాథం.

జూకంటి జగన్నాథం గత 40 యేళ్ళ నుంచి కవిత్వం రాస్తున్నాడు. ప్రజా జీవితాన్ని కవితలుగా కూరుస్తున్నాడు. ఇతని కవితా యానంలో ఈ ''ఊరు ఒక నారుమడి పద మూడవ కవితా సంపుటి. ఒక కథా సంపుటి కూడా వెలువరించాడు.

కవిగా జూకంటి విస్తరించిన క్రమం. గత నాల్గు దశాబ్దాలుగా దేశం, రాష్ట్రం సమాజంలో వస్తున్న వికృత మార్పులు ఇవన్ని ఇతని 13 పుస్తకాలలో చూడవచ్చు. ప్రస్తుతం ఈ సంపుటిలో జగన్నాథంగారు మరింత విశాలమైన, లోతైన అభివ్యక్తితో ప్రపంచ పోకడలను మనముందుంచాడు. మొదటి కవితలోనే కవి ప్రపంచీకరణను ఎట్లా అక్షరీకరించాడో ఇక్కడ... హైవే కవితలో... ''డివైడర్ మధ్య కాగితం పూల మొక్కలతో / తనను తాను ప్రమోట్ చేసుకుంటుంది / దుమ్ము పేరుకుపోయిన అద్దంలా / దారి పక్కన మసకబారిన పల్లె తల్లులు / ప్రతి వాహనం తోలు ఒలుస్తున్న టోల్‌గేట్లు''. అంటూ హైవే ఎవరి కోసమో ఎవరి ప్రయోజనాల కోసమో చెప్తాడు. అంతేగాకుండా పల్లెల అస్తిత్వం ఎంతో ఘోరంగా దెబ్బతింటున్నదో గుర్తు చేస్తాడు. హైవే అంటే దేశ దేశాల ప్రజల్ని కలపాలి. మనుషులను ఒకటి చేయాలి. పల్లెల్ని పట్టణాలను పరిపుష్టం చేయాలి. కానీ ''హైవే మేకప్‌తో హోయలు పోయేది'' ఎగుమతికి నిర్బంధిస్తుంది / దిగుమతికి అనుమతిస్తుంది.'' అని హైవే రహస్య కుట్రను భయటపెడతాడు.

జూకంటి జగన్నాథం గారు కరువు నేలల్లో పుట్టిన వాడు. బరువెక్కిన గుండెల బాధలను నిశ్శబ్దంగా విన్నవాడు. అందుకే ఇతని కవిత్వంలో సమాజం గురించి అంతర్మథనం కనబడుతుంది. ఈ సంపుటిలోనూ కవి పడుతున్న సంఘర్షణ వినబడుతుంది. ''ముందు మనుసులు / ఇరుకయ్యా యో / లేక రోడ్లు ముందు / వెడల్పు అయ్యాయో / తెలుస్త లేదు'' అంటూ కవిత మొదలై ''ముందు అభివృద్ధి / జరుగుతున్నదో / లేక విధ్వంసం ముందు / జరుగుతున్నదో / అస్సలుకు అర్థం కావడం లేదు / '' కండ్ల ముందు జరుగుతనున్నది అభివృద్ధి లాగా కనబడినట్లే విలువల విధ్వంసం లోలోన జరుగుతున్నదని ఈ దేశాన్ని పట్టుకున్న ప్రపంచీకరణ విషసర్పం అసలు రహస్యాన్ని విప్పి చెబుతాడు.

'ప్రపంచీకరణ' 'రాజకీయం', ఊరు ఈ మూడింటి వస్తువులే అర్థమైన కవితలుగా చిత్రించబడ్డాయి.

జగన్నాథం ఉద్యమాల గడ్డలో మొలకెత్తినవాడు. తాను స్పృహకొచ్చినప్పటి నుంచి జరిగిన జరుగుతున్న ఉద్యమాలను గమనించిన వాడు. ప్రజా ఉద్యమాలను, రాజ్యం కుట్రలను, ప్రభుత్వాల అమానుషాలను సున్నితపు త్రాచులో చూస్తున్నాడు. ప్రభుత్వాలు మారిన విధానాలందరివీ, దాదాపు అన్ని జెండాలవి ఒకటేనని గ్రహించినవాడు. అందుకే కులం, వర్గం, రైతుల దుస్థితి, నిరంతరం మండుతున్న కుంపట్లని ఎరుకజేసుకున్నాడు. కాలము, సందర్భంతో పాటు వాటి రూపాలు మారడాన్ని జాగ్రత్తగా పసిగట్టాడు. అందుకే అతని కవితా సంపుటాల్లో రైతు, దళిత బహుజనుడు, ప్రపంచీకరణ, ఊరు, వివిధ రూపాల్లో కవితలుగా దర్శనమిస్తాయి. ఈ సంపుటిలో కూడా నేడు మనిషిని తనకు తానే చంపుకునే స్థితికి రాజ్యమెట్లాతెస్తుందో అతని మరణం కవితలో స్పష్టంగా చూడొచ్చు. ''ఎవరూ అతన్ని / చనిపోమ్మన లేదు / తనకు తానే స్వచ్ఛందగా / అస్త్రశస్త్రాలను జారవిడుచుకొని / దిగులుగా మారడానికి లొంగిపోయాడు.'' ఈ కవిత మొదటి నుంచి చివర దాకా చదివితే మార్కెట్ ప్రపంచం రైతును తనకు తానే ఎట్లా అంతం చేయించే పరిస్థితి తీసుకొస్తుందో తెలుస్తుంది.

నూతన సాంకేతిక అభివృద్ధి వలన అభివృద్ధి చెందుతున్న దేశాలు ఏ విధంగా ధ్వంసమైపోతున్నాయో టి.వి., సెల్‌ఫోన్, కంపూటర్, లాప్‌టాప్‌ల వల్ల యువత ఎంత నిర్వీర్యమైపోతున్నదో ''థర్డ్ డిగ్రీ'' కవితలో ''బుల్లితెర సెల్‌ఫోన్ / వాట్సప్ / ఫేస్‌బుక్ / ఏదో ఒక వ్యసనంకు బానిసను చేసి / రాజ్యం గమ్మత్తు చూస్తున్నది'' అంటూనే ఈ వ్యసనాన్ని రాజకీయ నాయకులు ఎట్లా వాడుకుంటున్నారో'' ఓటు కోసం మాటు వేయడం / పాము కాటుకన్నా ప్రమాదకరం / అనస్తీషియా అక్కర లేదు / చర్మం మొద్దు బారిపోతుంది అని వాస్తవాన్ని హృద్యంగా చిత్రించాడు. ఇవన్నీ గతంలోనూ ఇప్పుడూ జరుగుతున్నాయని మనది అనుకున్న పాలన ఏదీ కాకుండా పోయిందని'' పటం మారింది గానీ / పాలకుల మటం అంతా ఒకటే'' జరుగుతున్నది ఇదే కదా!

జూకంటి గారు ప్రపంచ మానవుని స్వేచ్ఛ, సుఖం కోసం తపించేవాడు. ఎక్కడ ఏ అఘాయిత్యం జరిగినా విలవిల్లాడి పోతాడు. ప్రస్తుతం దేశంలో భీతిగొల్పుతున్న అణచివేత ఎంత వికృత రూపం దాల్చిందో ''వెయిల ఏండ్ల నుంచి / భుజాలు అరిగే వరకు / మోసిన అగ్రవర్ణాన్ని /బరువైదించేందుకు తల్లిడిల్లుతుంటే / మతాన్ని దేవున్ని ప్రతిభను / వెంట తీసుకువచ్చారు'' కొత్త కొత్త రూపాయలుగా మారుతున్న దౌర్జన్యాన్ని కవిత్వీకరించి చెప్తాడు.

నడుసున్న భారతీయ చరిత్రను, కొత్త రాష్ట్ర పాలనలోని డొల్లతనాన్ని ధైర్యంగా నిలదీస్తున్నాడు. ఈ కవి నిజాయితీగా, నిబద్ధతగా కవిత్వమే జీవితమైపోయిన జూకంటి గారు నిజమైన ప్రజాకవి ప్రజల కవి అంటే ఇట్లుండాలనే విధంగా కనబడతాడు. ఊరు ఒక నారు మడిలో తెలంగాణ బతుకు చిత్రాన్ని కవిత్వంగా మలిచాడు. దీనిలోని దాదాపు కవితలన్నీ మనిషి ఏదో ఒక పెనుగులాటని, తండ్లాటని, చూపెడతాయి. ఊరు ఒక నారుమడి జూకంటి గారి ప్రాపంచిన దృష్టికి, ప్రతిభావంతమైన అభివ్యక్తికి మూలకేంద్రం అని చెప్పవచ్చు.

- డా॥ ఉదారి నారాయణ
9441413666

లలితా సహస్రనామం

ఒక సుబోధినీ వ్యాఖ్య

లలితా సహస్రనామాలు మహిమాన్వితమైనవని అందరికీ తెలుసు. కొంతకాలంగా అవగాహన పెరగడం వల్ల ఎక్కువ మంది దీని గొప్పతనం తెలుసుకుని పారాయణ మొదలుపెట్టారు. అయితే అదే సమయంలో దానిలోని పదాలను సరిగా పలకకపోవడం, ఎక్కడ పదచ్ఛేదం చేయాలో తెలియకపోవడం కూడా పెరిగింది. ఇది గుర్తించిన కొందరు మహనీయులు, ప్రవచన కర్తలు తమకు సాధ్యమైన రీతిలో వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. దశిక కృష్ణమోహన్ గారు కూడా అందుకు పూనుకోవడం ముదావహం. పదచ్ఛేదం చేయవలసిన చోట చేయకపోవడం, కలపాల్సిన చోట కలపక పోవడం వల్ల అర్థం మారిపోతుంది, తప్పుడు అర్థం వస్తుంది. మామూలు రచనల్లోనే అక్షరం తప్పులు లేకుండా జాగ్రత్తపడుతుంటాం. అలాంటిది మహిమాన్వితమైన, మంత్ర సమానమైన సహస్రనామాల్లో అటువంటివి ఉండకుండా చూసుకోవడం ఎంతైనా అవసరం.

అది అలా ఉంచితే ఏ స్తోత్రమైనా అర్థం తెలిసి చదవాలంటారు పెద్దలు. అర్థం తెలిసి చదవడం వల్ల తప్పులు కూడా సరిదిద్దుకోవచ్చు. అంతేకాదు అందువల్ల ఆ మూర్తిపై ధ్యానం కుదురుతుంది. మనసు అక్కడ నిలుస్తుంది. లేకుంటే నోటి వెంట స్తోత్రం వచ్చేస్తుంటుంది, ఆలోచనలు మరో చోటికి వెళ్లిపోతాయి. అంతేకాక అర్థం తెలిసి చదివితే ఫలితం ఎక్కువగా ఉంటుందనేది కూడా పెద్దలు చెప్పే మాటే. అందువల్ల అర్థం తెలుసుకుని చదవడం ముఖ్యం. ఇక లలితా సహస్రంపై ఎందరో మహానుభావులు వ్యాఖ్యానాలు రాశారు. పైపై అర్థాలు వివరించినవారు ఉన్నారు. లోతుల్లోకి వెళ్ళి విశ్లేషించినవారు ఉన్నారు. ఏది ఏమైనా అందరూ వర్ణించినది ఆ మహాశక్తినే. అసలు అమ్మ తత్త్వమే అంత. ఏక రూపమైన ఆమె ఎన్నో రూపాలు ధరించింది. అదేవిధంగా ఒకే సహస్రనామావళికి ఎన్నో వ్యాఖ్యానాలు వెలువడ్డాయి, వెలువడుతున్నాయి. దీనితో పాటు అమ్మవారికి సంబంధించిన ఖడ్గమాల వంటివి ఎన్నో ఏర్చికూర్చి ఒక విలువైన గ్రంథాన్ని మనకు అందించారు రచయిత. వారు ఈ విషయంగా ఎంతో కృషిచేశారని తెలుస్తోంది. వారాహీ దేవి సంహరించిన విషంగ, విశుక్రుల సంహార విషయంలో మత భేదాలున్నాయని ప్రస్తావించడం ఆయన రకరకాల వ్యాఖ్యానాలను అధ్యయనం చేశారనడానికి తార్కాణం. సహస్ర నామాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి రచయిత తనదైన శైలిలో, సులభంగా అర్థమయ్యేలా వ్యాఖ్యానం రాశారు. అందుకు ఆయన అభినందనీయులు. లలితాసహస్రంపై ఇది ఎంతో ఉపయుక్తమైన రచన.

- జి.పార్వతీశం

చెదరిన దసరాప్రభ

మ॥ పలు విల్లంబులు, కోతిబొమ్మలొలయన్
పంతుళ్ళు రా-వెంట-ప
ల్లెలలో ఇంటికి ఇంటికిన్ తిరిగి
పెలెల్ వేసి పద్యాలు, ప
ప్పులు బెల్లంబులు మెక్కు బాల్యదశలో
మోదంపు కేరింత విం
తలు పల్కంగ తరంబె? ఆ దసర
సర్దాలన్ మరెవ్వారికిన్ ॥

మ॥ పలకా బలప్పము వారు పాడు దసరా
పద్యాలు, విల్లంబులున్
పులివేషంబుల ఆట పాటలుకు
ఇంపుల్ మీఱ పార్వేట లీ
లల చూడగను పోవు వారి సరదాలా
నేడు లేవాయె; కొ
ల్ల లెపో! యాంత్రిక రోగ జీవికలు;
పల్కన్ శక్యమే? తద్వ్యథల్ ॥

- రామడుగు వేంకటేశ్వర శర్మ
98669 44287

నిబద్ధత ఛాయలో...



తెలుగు జర్నలిస్టులలో తొలి, మలితరం జర్నలిస్టుల నిబద్ధత, నిజాయితీ కలిగిన, మూడోతరం జర్నలిస్టులు అతికొద్ది మందిలో జి. వల్లీశ్వర్ ఒకరు.

మూడున్నర దశాబ్దాల పాత్రికేయ వృత్తిలో తెలుగు, ఇంగ్లీషు జర్నలిజంలో చేయి తిరిగిన వల్లీశ్వర్, ఇప్పటికే పలువురు ప్రముఖులు రచించిన ఆంగ్ల రచనలను తెలుగులో అనువదించి ('నిప్పులాంటి నిజం' నరసింహుడు', 'రిజర్వు బ్యాంకు రాతిగోడల వెనకాల) తెలుగు పాఠకులకు అందించారు.

ఆధునికి రాజకీయ చరిత్రలో, అత్యంత ప్రజాదరణ పొందిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి వద్ద చీఫ్ పి.ఆర్.ఓగా, 'ఆంధ్రప్రదేశ్' మాస పత్రిక ప్రధాన సంపాదకులుగా, మీడియా సలహాదారునిగా అయిదేళ్లపాటు బాధ్యతలు నిర్వహించారు.

ఆ అనుభవాలను, అనుభూతిని, జ్ఞాపకాలను, ''వైయస్సార్ ఛాయలో...'' పేరిట శ్రీ వల్లీశ్వర్ రాసిన పుస్తకం ఇటీవల ఆవిష్కరణ జరిగింది.

పాత్రికేయునిగా తాను రాసిన వార్తలు పాఠకుడు ఆసక్తిగా చదవగలిగేలా చేయడంలో సిద్ధహస్తులైన శ్రీ వల్లీశ్వర్ రాసిన ఈ పుస్తకం, ఆసాంతం ఎంతో ఉత్కంఠతో చదివిస్తుంది. అందులోనూ రాజకీయ, పరిపాలనాపరమైన అంశాలతో పరిచయం, ప్రమేయం వున్న పాఠకులకైతే మరీనూ...

శక్తిమంతుడయిన డా॥ వైయస్సార్ సాధించిన అనేక విజయాల వెనుక, అనేక కీలక సంఘటనలు, నిర్ణయాలతో డా॥ వైయస్ చూపించిన వివేకం, చొరవ, సమయజ్ఞత వెనుక, తన పాత్ర ఉందని చెప్పకుండానే చెప్పడం ఒక చాతుర్యం. అది ఈ పుస్తకంలో ప్రతి సంఘటనలోనూ కనిపిస్తుంది.

కానీ, వృత్తి నిర్వహణలో కేవలం అంకితభావం, ఇతరుల ప్రేమాదరణలు తప్ప, వేరే ఏ ప్రత్యేక ఆసక్తి, ప్రయోజనాలు ఆశించని అరుదైన నడవడిక, జీవన విధానానికి ప్రతీక అయిన వల్లీశ్వర్ వంటి వారు మాత్రమే ఆయా సందర్భాలలో, తన పాత్ర ప్రమేయం గురించి నిజాయితీగా అక్షరీకరించగలరు.

అందుకు అతనికి నైతిక మద్దతు పుష్కలంగా లభించిన సంగతి, ఈ పుస్తకం ప్రారంభంలో, ఆయనతో పాటు డా॥ వైయస్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే కీలకపాత్ర షోషించిన సమర్థులైన ఐ.ఏ.ఎస్ అధికారులు డా॥ కె.వి. రమణాచారి, శ్రీ కె. ప్రభాకరరెడ్డి వంటి వారు రాసిన అభిప్రాయాలు తెలియజేస్తాయి.

ఇంకా ముఖ్యమైన అంశం, డా॥ వైయస్సార్‌కు ఆత్మవంటి డా॥ కె.వి.పి. రామచంద్రరావు వంటి సీనియర్ రాజకీయవేత్త వల్లీశ్వర్ నిర్వహించిన పాత్రను శ్లాఘించడం.

ఇక డా॥ వైయస్సార్, తనను చీఫ్ పి.ఆర్.ఓగా ఎంపిక చేసుకోవడంలో, తన పాత్రికేయ మిత్రులు మోతడక సుధాకర్ చొరవను ప్రస్తావించడం శ్రీ వల్లీశ్వర్ ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. అలాగే విధి నిర్వహణలో, తను చేసిన కొన్ని తప్పుల్ని కూడా ప్రస్తావించడం రచయిత నిజాయితీకి అద్దం పడుతుంది.

తాను ఎన్నో కీలక, క్లిష్ట సందర్భాలలో డా॥ వైయస్‌కు అనేక అమూల్యమైన సూచనలివ్వడం ద్వారా, తనను నమ్మిన నేత ప్రతిష్ట ప్రజా ప్రయోజనాలు కాపాడడంలో, ఆనాటి సీనియర్ అధికారుల సహకారం, చిత్తశుద్ధిని కూడా వల్లీశ్వర్ ప్రసావించడం ఆయన సంస్కారాన్ని తెలియజేస్తుంది. చివరికి కొన్ని అత్యవసర సమయాలలో తన సిబ్బంది అందించిన సహకారం కూడా ప్రస్తావించడం, వారిని ఎంతో ఆనందానుభూతికి లోను చేస్తుందనడం అతిశయోక్తి కాదు.

నిజానికి ఇది తన అనుభవాల సమాహారంగా శ్రీ వల్లీశ్వర్ రచించినా, ఆయా సందర్భాలలో భాగస్వాములైన కె.కె. బిర్లా, జార్జ్‌బుష్, పొత్తూరి వెంకటేశ్వరరావు, కరణ్ థాపర్ ఇంకా డా॥ ఎం.వి. భాను, డా॥ మోహన్‌కందా, ఐ.వి. సుబ్బారావు వంటి ఐ.ఏ.ఎస్ అధికారులు, సౌందర్‌రాజన్ వంటి ఆధ్యాత్మిక పరిరక్షణ ఉద్యమకారుల గురించి అనేక విషయాలు తెలుసుకొనేందుకు వీలు కల్పిస్తుందీ పుస్తకం.

ఇక ఈ పుస్తకం రచించడంలో వల్లీశ్వర్‌గారు తనను తాను బాగా నియంత్రించుకున్నారనే చెప్పాలి. లేకపోతే రచన ఇంకా పరిధి పెరిగి మరిన్ని ముఖ్యమైన అంశాలు తెలిసేవి.

అయితే పేర్కొన్న కొన్ని ముఖ్యమైన సంఘటనలలో, వల్లీశ్వర్ అవగాహన డా॥ వైయస్సార్ రాజకీయ విజ్ఞత, పరిణితి ప్రస్ఫుటమవుతాయి.

ముఖ్యంగా 'నంది నాటకోత్సవాల నిర్వహణ', 'బిట్స్ పిలాని బ్రాంచి ఏర్పాటు', 'చంద్రబాబుకు పరామర్శ', 'శ్రీమతి ఇందిరా గాంధీకి బదులు దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ పేరు సూచన', 'జార్జ్‌బుష్‌తో సమావేశం', 'అర్చక చట్టం సవరణ', 'ఏలూరు సంస్కృతి పాఠశాల పరిరక్షణ' వంటి అంశాలలో వల్లీశ్వర్ పాత్ర ఎంతో కీలకమైనది. అలాగే ఎదుటివారి విలువైన సలహాలు, సూచనలు స్వీకరించడంలో ఓ ముఖ్య ప్రజాప్రతినిధి ఎంతో స్పృహతో, లౌక్యంతో వ్యవహరించాలో, వర్తమాన ప్రజాప్రతినిధులు, అధికారంలో ఉన్నవారికి తేటతెల్లం చేస్తుంది రచన.

సమర్థుడయిన పాత్రికేయ రచయిత సృజించిన ఈ రచనను, ఎలాంటి శషభిషలకు తావివ్వకుండా ముద్రించి, పాఠకులకు అందించడంలో తన అవగాహన, సామర్థ్యం ప్రదర్శించిన ఎమెస్కో అధినేత డి. విజయకుమార్‌గారిని అభినందించి తీరవలసిందే!

ప్రజా పరిపాలకులుగా ఎదగాలనుకునే రాజకీయ నేతలకు, ప్రజా, పాత్రికేయ సంబంధాల రంగంలో రాణించాలనుకునే యువతరానికి కరదీపిక... ఈ 'వైయస్సార్ ఛాయలో...'

అన్ని వర్గాల పాఠకుల ఆదరాభిమానాలకు నోచుకుంటుందనడంలో సందేహం లేదు.

- బి.వి. అప్పారావు
విశాఖపట్నం.

చీకటి

చెట్ల గుబురులో చిక్కుకున్న చీకటి...
రాత్రి జ్ఞాపకాన్ని ప్రశ్నించింది
ఊరి చివరి గుడిసెలో...
దీపం వెలుగులో ఒక విద్యార్థి ఎందుకు
ఏడుస్తున్నాడని?
నది వంపులో దాగిన చీకటి...
మలయ మారుతాన్ని ప్రశించింది!
కొండల వెనుక కోకిల స్వరానికి ఎవరూ
బదులెందుకివ్వడం లేదని?!
రైతు కష్టానికి స్పందన లేని,
నగర నిశ్శబ్దంలో కలిసిన చీకటి...
శూన్యంలో నక్షత్రాలను లెక్కిస్తున్న...
ఎందరో శ్రామికుల, వలస కార్మికుల, సంచార
జీవుల... వేదననూ...
ఇంకా - ఒంటరితనంతో గుండెలు బరువెక్కిన
ముసలి తల్లితండ్రుల ఆవేదనను ప్రశ్నించింది!
ఒక చీకటిది అస్తిత్వ వేదన!
ఇంకొక చీకటిది భవిష్యత్ భరోసాపై ఆందోళన,
మరొక చీకటిది నిర్లక్షపు బిడ్డల నిర్లిప్తత పై నిట్టూర్పు
! నిర్వేదం!
చర్చ- సంభాషణ- సంవాదం,
సరిగ్గా అప్పుడే...
గుడి గోపురంలో అదృశ్యం ఐన చీకటి...
ధ్వజ స్తంభంపై వాలిన పావురాన్ని ప్రశ్నించింది -
అసమానతల తూకం, ప్రారబ్ధం కథలు
ఇంకెన్నాళ్ళు అని!
పక్కనున్న మసీదు, దూరంగా విన్పిస్తున్న చర్చి
గంటలు ఈ మాటలు ఆలకించాయి!
''తమ సోమా జోతిర్గమయా''
శతాబ్దాల చరిత్ర...
వెలుగు సమాధానం చెబుతుంది,
చీకటి ''సిగ్గు'' పడి తీరుతుంది.

- శ్రీనివాస రాజు పెన్మెత్స

సాహితీ వార్తలు

కవి సమ్మేళనం

ప్రపంచశాంతికి పై కవి సమ్మేళనం 12వ తేదిన బందురు రోడ్డులో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు జరుగుతుంది. ఈ సందర్భంగా నాగపూర్‌కు చెందిన భారతశాంతి స్థాపన- పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో దక్షిణ భారత ప్రాంతీయ సదస్సు జరుగుతుంది. వివరాలకు : 2946415150, 8332903156 నెంబర్లలో సంప్రదించగలరు.

-కలిమిశ్రీ, అధ్యక్షులు
మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ

ప్రకాశం జిల్లా రచయితల మహాసభలు

సర్వోత్సవ సంస్థ ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 9వ రాష్ట్రస్థాయి మహాసభలు ఒంగోలులోని అంజయ్య రోడ్డులో గల ఆంధ్రకేశరి విద్యాకేంద్రం ఎ.కె.వి.కె. జూనియర్ కళాశాల ఆవరణలో 2020 జనవరి 17,18,19 తేదిల్లో నిర్వహిస్తున్నారు. ఈ సభల్లో కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. దేశంలోని తెలుగు కవులు, రచయితలు ఎవరైనా ప్రతినిధులుగా పాల్గొనవచ్చు. ప్రతినిధులుగా పాల్గొన్న అందరికీ కవి సమ్మేళనంలో పాల్గొనే అవకాశం కల్పించటమేగాక ముగింపు సభలో జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కారముంటుంది. ప్రతినిధులుగా పాల్గొనే కవులు, రచయితకు భోజనం, సాధారణ వసతి సౌకర్యం కల్పించడుతుంది. ప్రతినిధి రుసుము రూ. 100/- చెల్లించి పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం, ఇం.నెం: 33-1-5, తిరువెంగళం పిళ్ళైవారి వీధి, ఒంగోలు - 523001, ప్రకాశం జిల్లా. సెల్: 9440432939 ని సంప్రదించగలరు.

- బి. హనుమారెడ్డి, అధ్యక్షుడు

'నవలా స్రవంతి'

తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'నవలా స్రవంతి'లో భాగంగా 11వ తేది సాయంత్రం 6గం॥లకు రవీంద్ర భారతి కాన్ఫరెన్సు హాలులో ఆచార్య బిరుదురాజు రామరాజు ''తెలుగు వీరుడు''పై డా॥ సాగి కమలా కరశర్మ ప్రసంగం ఉంటుంది. సభకు డా॥ నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు.

డా॥ ఏనుగు నరసింహారెడ్డి
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి

epaper.prabhanews.com

బదిలీలు చేస్తేనే బతుకుతాం

- పనిభారంతో ప్రశాంతత తగ్గుతోంది
- రెవెన్యూ జేఏసీ ఆందోళన

హైదరాబాద్ ఆంధ్రప్రభ : రెవెన్యూ శాఖలో ఉద్యోగులపై రోజురోజుకు పెరుగుతున్న పనిభారం, ఒత్తిడి కారణంగా విశ్రాంతి, ప్రశాంతత తగ్గుతోందని రెవెన్యూ ఉద్యోగ జేఏసీ ఆందోళన వెలిబుచ్చింది. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని జేఏసీ సమావేశంలో తీర్మానించింది. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ఆర్డర్ టూ సర్వ్ పేరుతో తాత్కాలికపద్ధతిలో వివిధ జిల్లాలకు బదలీ చేసిన ఉద్యోగులందరినీ తిరిగి వారివారి సొంత జిల్లాలకు బదలీ చేయాలని తీర్మానించి ఈ మేరకు ప్రభుత్వాన్ని జేఏసీ డిమాండ్ చేసింది. ఆదివారం రెవెన్యూ ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశమైంది. నిజామాబాద్ రూరల్ తహశీల్దార్ ఆత్మహత్య నేపథ్యంలో ఈ శాఖలో నిర్వేదం అలుముకుంది. ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లో మృతిచెందిన రెవెన్యూ ఉద్యోగులను స్మరించుకుని, వారి కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఉద్యోగుల సమస్యలను, తాజాగా మృతిచెందిన ఉద్యోగులకు సంస్మరణ సభ ఏర్పాటు వంటి విషయాలను చర్చించారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి లచ్చిరెడ్డి, తెలంగాణ తహశీల్దార్ల సంఘం అధ్యక్షుడు ఎస్ రాములు, టీవీఆర్వోడబ్ల్యూ అధ్యక్షుడు గరికె ఉపేందర్ రావు, టీవీఆర్వోఏ అధ్యక్షుడు ఎన్ లక్ష్మీనారాయాణ, ప్రధాన కార్యదర్శి బి సుదర్శన్, టీజీటీఏ ముఖ్య సలహాదారు ఎండీ సలీముద్దీన్, టీవీఆర్ఏ ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు, టీఆర్ఎస్ఏ ప్రధాన కార్యదర్శి సంతోష్‌లు పాల్గొని ప్రసంగించారు. పలు అంశాలపై విపులంగా సమావేశం చర్చించింది. ఈ సందర్భంగా చేసిన తీర్మానాలను ఆమోదించారు.

ప్రతి పాఠశాలకు హెచ్ఎం

- ప్రధానోపాధ్యాయుల సంఘం డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని తెలంగాణ ప్రైమరీ స్కూల్స్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అలాగే ప్రాథమిక విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులుగా అడ్లగట్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా ఎం పద్మారావు ఎన్నికయినట్టు తెలిపారు. ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేసే మండల విద్యాధికారి (ఎంఈవో) పోస్టులో సీనియర్ అయిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని నియమించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లను ప్రాథమిక పాఠశాలలోనే జరిగేలా చూస్తూ ఆ మీటింగ్ బాధ్యత ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునికే అప్పగించాలని సమావేశం తీర్మానించినట్టు రాష్ట్ర అధ్యక్షులు గంగాధర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించాలని తీర్మానించినట్టు తెలిపారు.

అనాథ విద్యార్థిని శిరీషకు న్యాయం చేయండి

- అధికారులకు మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అనాథ ఆశ్రమంలో ఉండి చదివిన గిరిజన విద్యార్థిని ఇస్లావత్ శిరీషకు న్యాయం చేయాలని అధికారులను గిరిజన, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆదేశించారు. ఇస్లావత్ శిరీష తండ్రి చనిపోయి, తల్లికి దూరంగా అనాథ ఆశ్రమంలో ఉండి చదువుతూ ఇంటర్మీడియేట్‌ను పూర్తి చేసింది. బిఎస్సీ నర్సింగ్ సీటు కోసం దరఖాస్తు చేస్తే ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు తిరస్కరించారు. అనాథ ఆశ్రమంలో ఉండి చదివిన వారిని ఎస్టీగా పరిగణించబోమని, బీసీ- ఎ సర్టిఫికెట్ తెస్తేనే కోర్సులో ప్రవేశం కల్పిస్తామని తేల్చిచెప్పారు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో మంత్రి సత్యవతి రాథోడ్ స్పందించారు. ఇస్లావత్ శిరీషకు తక్షణమే సీటు ఇవ్వాలని, ఏమైనా సమస్యలు ఉంటే తాను చూసుకుంటానని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో స్పందించిన అధికారులు శిరీషకు సీటు ఇచ్చారు. శిరీష కుల ధృవీకరణ పత్రం జారీకి సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి న్యాయం చేస్తానని ఈ సందర్భంగా మంత్రి సత్యవతి హామీ ఇచ్చారు.

'ఏపీలో అసమర్థ ప్రభుత్వం'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏపీలో అసమర్థ ప్రభుత్వం రాజ్యమేలుతోందని ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు అన్నారు. దేశ చరిత్రలో అతితక్కువ కాలంలో ప్రజా నమ్మకాన్ని కోల్పోయిన ప్రభుత్వంగా వైకాపా చరిత్రకెక్కితే, చేతగాని మంత్రిగా అవంతి శ్రీనివాస్ రికార్డు కెక్కారన్నారు. చేతగాని ప్రభుత్వంలో ఉన్న మంత్రులు తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు రోజుకో కొత్త డ్రామాకు తెర తీస్తున్నారన్నారు. బోటు ప్రమాదంలో 50మందికి పైగా జలసమాధి అయితే రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. బోటు వెలికితీతలో ఇంకా నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారన్నారు. ఆటోలకు జగన్ ఫోటోలు ఉంటే ఆర్టీఏ అధికారులు ఇబ్బంది పెట్టరని చెప్పడం ద్వారా మంత్రి అవంతి ఏ సందేశం ఇవ్వదలిచారో చెప్పాలన్నారు.

48 గంటల్లో మూసీ ప్రాజెక్టు గేటు అమరుస్తాం

- మంత్రి జగదీష్‌రెడ్డి హామీ

కేతేపల్లి/హైదరాబాద్, ప్రభ న్యూస్ : మూసీ ప్రాజెక్టుకు తొలగిన గేటును 48 గంటల్లో తిరిగి అమరుస్తామని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ విషయం సీఎం కేసీఆర్ దృష్టికి వెళ్లడంతో పరిశీలన నిమిత్తం ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి స్మితాసబర్వాల్ ఆదివారం మూసీ ప్రాజెక్టు పరిశీలనకు వచ్చారు. ఆమెతో పాటు వచ్చిన మంత్రి జగదీష్‌రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లా కలెక్టర్‌లు గౌరవ్ ఉప్పల్, అమయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్, నల్లగొండ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు గేటు విరిగిన విషయాన్ని సంబంధిత అధికారులతో అధ్యయనం చేశారు. అనంతరం అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి 48 గంటల్లో గేటును అమరుస్తామని రైతాంగానికి హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి నిరాశకు గురికావద్దని, ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నెల 9 నాటికి మూసీ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టు గేటు తొలగిన విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా సీఎం వ్యక్తిగత కార్యదర్శి స్మితా సబర్వాల్‌తో పాటు నీటిపారుదల ఇంజనీరింగ్ శాఖ నుంచి మురళీధర్‌రావును పంపినట్లు తెలిపారు. 1991లో మూసీ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా ఐదు గేట్లు తయారు చేయించగా అదే సమయంలో తిరుపతిలో కల్యాణి డ్యామ్ నిర్మిస్తుండగా ఆ ప్రాంతానికి తరలించడం జరిగిందని, వాటిలో రెండు గేట్లను మాత్రమే వినియోగించారని, మిగతా మూడు అలాగే ఉన్నాయని ప్రాజెక్టు అధికారులు, నీటిపారుదల శాఖ నిపుణులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సీఎం ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు అక్కడి నుంచి గేట్లను వెంటనే తెప్పించి మూసీకి ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ హమీద్‌ఖాన్, ఈఈలు నర్సింహ్మ, భద్రూ నాయక్, డీఈ నవీకాంత్, ఏఈలు రమేష్, మమత, స్వప్న తదితరులు ఉన్నారు.

ప్రాజెక్టును పరిశీలించిన స్మితాసబర్వాల్...

నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో మూసీ ప్రాజెక్టు 5వ నెంబరు రెగ్యులేటరీ గేటు తొలగిపోవడంతో వృధాగా దిగువకు నీరు పోతున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వ్యక్తిగత కార్యదర్శి స్మితాసబర్వాల్ ఆదివారం మూసీ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ప్రాజెక్టు అధికారులు, జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించి వివరాలు సేకరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం, ఆయకట్టుకింద సాగు, ప్రాజెక్టు నిర్మాణం నుండి ఇప్పటి వరకు జరిగిన పలు ప్రమాద సంఘటనల వివరాలను, గేటు తొలగిన విషయాలను సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేటు తొలగిపోవడం వల్ల ఆదివారం సాయంత్రం వరకు ఒక టీఎంసీ నీరు వృధాగా పోయిందని, 645 అడుగులు ఉన్న నీటిమట్టం 638 అడుగులకు పడిపోయిందని తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆమె చెప్పారు. ఆమె వెంట జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, నల్లగొండ, సూర్యాపేట జిల్లా కలెక్టర్లు గౌరవ్ ఉప్పల్, అమయ్‌కుమార్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారి మురళీధర్‌రావు, సంబంధిత అధికారులు ఉన్నారు.

మూసీపై ఇంత ఉదాసీనతా?

- గేటు ప్రమాదంపై సీఎం కేసీఆర్ సీరియస్
- పరిస్థితిపై సమీక్ష... రేపటికల్లా సమస్య పరిష్కారం

దశాబ్దాల చరిత్ర కలిగిన మూసీప్రాజెక్టు గేట్లు ఊడి వేల క్యూసెక్కుల నీరు వృధాగా పోతుండడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం సీరియస్‌గా స్పందించారు. సీఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్, నీటిపారుదల శాఖ ఈఎన్‌సి మురళీధర్‌లను వెంటనే మూసీ ప్రాజెక్టు సందర్శించాలని ఆదేశించారు. అత్యవసరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి అక్కడిక క్కడే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా పరిస్థితిని చక్కదిద్దాలని ఆదేశించారు. అంతకుముందు మూసీ గేటు ఊడి వరదంతా ప్రాజెక్టు నుండి వృధాగా పోతుండడంతో మంత్రి జగదీష్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు పరి స్థితిని ఫోన్‌ద్వారా వివరించారు. దీంతో 48గంటల్లో నీటివృధాను అరికట్టేలా చర్యలు తీసు కోవాలని సీఎం ఆదేశించారు. అప్పటికపుడు అధికారులను ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మూసీ ప్రాజెక్టు వద్దకు పంపారు. మూసీ 6వ గేట్ శనివారం ఊడిపోగా, ఆయకట్టు రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. ఆదివారం 6వేల క్యూసెక్కులకు పైగా నీరు వృధాగా పోయింది.

తిరుపతి నుండి ప్రత్యేక గేట్

తిరుపతి సమీపంలోని కల్యాణి డ్యామ్‌కు అప్పట్లో మూసీ నదికోసం తయారుచేసిన అదనపుగేట్లను పంపారని, ఇందులో మూడు ఇప్పటికీ మిగిలి ఉన్నాయని నిపుణులు మంత్రి జగదీష్‌రెడ్డికి సమీక్షసందర్భంగా వివరించారు. ఉన్నతాధికారులతో సూచనతో ఆ గేట్లను తెప్పించి 48గంటల్లో అమరుస్తామని మంత్రి ప్రకటించారు. సిఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్, ఈఎన్‌సి మురళీధర్‌లతో సమీక్షించిన మంత్రి త్వరగా ఆ గేట్లు తెప్పించే ఏర్పాటుచేయాలని కోరారు. ఈనెల 9నాటికి డ్యామ్ మరమ్మత్తులు పూర్తిచేసి వృధాగా పోతున్న నీటిని నిలువరిస్తామన్నారు. మూసీ ఆయకట్టు రైతాంగం ఆందోళనకు గురికావొద్దని పిలుపునిచ్చారు.

కూలిన శిక్షణ విమానం

- ఇద్దరు పైలెట్ల దుర్మరణం
- గుల్బర్గాకు వెళుతుండగా ప్రమాదం

వికారాబాద్, ప్రభ న్యూస్ : హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి కర్నాటకలోని గుల్బార్గాకు వెడుతున్న శిక్షణ విమానం వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం సుల్తాన్‌పూర్ పత్తి పొలాల్లో ఆదివారం మధ్యాహ్నం కూలిపోయింది. ఈ ప్రమాదంలో శిక్షణ పైలట్‌తో పాటు సేఫ్టీ పైలట్ మరణించారు. వీరిని పంజాబ్‌లోని ఖరార్‌కు చెందిన ప్రతీకౌర్, ఢిల్లీకి చెందిన ప్రకాశ్ విశాల్‌గా గుర్తించారు. బేగంపేట నుంచి బయలు దేరేటప్పుడు వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ, వికారాబాద్ ప్రాంతానికి వచ్చేసరికి భారీవర్షం, ఉరుములు, మెరుపులతో బీభత్సంగా మారిపోయింది. అదే సమయంలో ఏటీసీతో సంబంధాలు తెగిపోయాయి. ఈ పరిస్థితుల్లో పైలట్లు విమానాన్ని కిందకు దించేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. చివర్లో కిందకు దూకేందుకు చేసిన ప్రయత్నాలూ విఫలమైనాయి. దీంతో ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయిన విమానం సుల్తాన్‌పూర్‌లోని పత్తిచేలల్లో కూలిపోయింది. పెద్దశబ్దం, దట్టంగా పొగలు రేగడంతో చుట్టుపక్కల ఉన్న రైతులు భయాందోళనలకు గురైనారు. ప్రమాదస్థలానికి వెళ్లి చూసేసరికి విమాన శిథిలాల్లో పైలట్ల మృతదేహాలు ఛిద్రమై కన్పించాయి. చుట్టుపక్కల ప్రాంతాలకు వారి శరీరభాగాలు చెల్లాచెదురుగా పడ్డాయి.

ప్రమాదం విషయం తెలిసిన వెంటనే బేగంపేటవిమానాశ్రయం నుంచి అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మరోవైపు జిల్లా ఎస్పీ నారాయణ సైతం సుల్తాన్‌పూర్‌కు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదంలో చనిపోయిన ఇద్దరు పైలెట్ల శరీరాలను పత్తి పొలాల నుంచి సేకరించారు. శిక్షణ విమా నం కూలిపోయిన ఘటన జిల్లాలో కలకలం రేపింది. విమానం గ్రామంలో కూలకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది. ప్రతికూల వాతావరణం వల్ల లేక సాంకేతిక సమస్య లతో ఈ ప్రమాదం జరిగిందా అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. కాగా ఈ శిక్షణ విమానం ఓ ప్రైవేటు సంస్థకు చెందినది.

నవంబర్‌లో రెండో విడత పల్లె ప్రగతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామీణ తెలంగాణపై ముఖ్యమంత్రి కేసీఆర్ పెట్టుకున్న ఆశయాలు ఫలించాయి. స్థానిక స్వపరిపాలనలో ప్రజలను మమేకం చేసి గ్రామాల్లో నెలకున్న సమస్యలను పారదోలి అభివృద్ధికి బాటలు వేయాలన్న లక్ష్యంతో టీఆర్ఎస్ సర్కారు పల్లెప్రగతి పేరుతో చేపట్టిన 30 రోజుల ప్రణాళికను కొనసాగించాలని నిర్ణయించింది. నవంబర్‌లో రెండో విడత పల్లె ప్రగతిని ప్రారంభించనుంది. తొలి విడతలో 30 రోజులపాటు అమలు చేసిన ప్రణాళిక ద్వారా సాధించిన ఫలితాలపై ఈ నెల 10న ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. సంబంధిత శాఖల మంత్రులు, అధికారులతో జరిగే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల స్థితిగతులను సమగ్రంగా చర్చించనున్నారు. తొలివిడత ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, జంగిల్ క్లియరెన్స్, శ్మశాన వాటికల ఏర్పాటు, స్థల సేకరణ, డంపింగ్ యార్డుల ఏర్పాటు తదితర అంశాలను సీఎం సమీక్షించనున్నారు. పల్లెప్రగతి అమలులో లోపాలు, అందుకుగల కారణాలను కూడా సమీక్షించి వాటిని సరిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించనున్నారు. పల్లె ప్రగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలను, సర్పంచులను ప్రోత్సహించే అంశంపై కూడా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. జిల్లా స్థాయిలో కూడా ర్యాకింగ్‌లు ప్రకటించి కలెక్టర్లను అభినందించనున్నట్టు అధికారులు వివరించారు. రాష్ట్రంలో గత నెల 6నుంచి ఈ నెల 5 వరకూ నిర్వహించిన 30 రోజుల ప్రణాళిక అమలు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రెండో విడత పల్లె ప్రగతిని మరింత మెరుగైన రీతిలో చేపట్టేందుకు సీఎం అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. నవంబర్‌లో రెండో విడత పల్లె ప్రగతి అమలుపై ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

తొలివిడతలో వెల్లివిరిసిన చైతన్యం

రాష్ట్రంలో తొలివిడత కింద నిర్వహించిన 30 రోజుల ప్రణాళిక ద్వారా గ్రామీణ ప్రజల్లో శ్రమదాన చైతన్యం వెల్లివిరిసింది. తమ వీధిని, తమ గ్రామాన్ని తామే బాగుచేసుకుంటామని ప్రజలు చేయిచేయి కలిపి ముందుకు కదిలారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు దాతలు పెద్ద ఎత్తున విరాళాల వర్షం కురిపించారు. రాష్ట్రమంతటా 12వేలమందికి పైగా దాతలు రూ.28 కోట్ల రూపాయలు విరాళాలకింద అందచేశారు. కొందరు దాతలు తమ పొలాలు, స్థలాలు గ్రామాభివృద్ధి పనులకు విరాళంగా అందచేశారు. మొత్తం 14 ఎకరాల మేరకు భూములు, స్థలాలను దాతలు స్వచ్ఛందంగా పంచాయతీలకు అప్పగించినట్టు అధికారులు వెల్లడించారు. 30 రోజుల ప్రణాళిక అమలులో 79108 ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర ప్రాంతాల్లో ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 60301 ప్రాంతాల్లో గుంతలను చదును చేశారు. 55943 ప్రాంతాల్లో రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చివేశారు. 121866 ప్రాంతాల్లో మురుగుకాల్వల్లో పూడికను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. 93136 ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించారు. 15548 ప్రమాదకర బావులను, పాడుబడిన బావులను పూడ్చేశారు. నిరుపయోగంగా ఉన్న 9337 బోర్లను మూసివేశారు. నీరు నిలువ ఉండే 60 301 లోతట్టు ప్రాంతాలను చదును చేశారు. 100819 చోట్ల పాడుబడిన, శిథిలస్థితిలో ఉన్న భవనాలు, వాటి వ్యర్థాలను తొలగించారు.

10544 శ్మశాన వాటికలు

రాష్ట్రంలో 30 రోజుల ప్రణాళిక ద్వారా దాతలు అందచేసిన విరాళాలు, ప్రభుత్వ ప్రోత్సాహంతో 10544 గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేసుకున్నారు. వీటిలో 3769 పనులు ఇప్పటికే పూర్తికాగా మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 10875 గ్రామాల్లో చెత్తను నిల్వ చేసేందుకు డంపింగ్ యార్డుల నిర్మాణం చేపట్టారు. ఇందులో ఇప్పటికే 4350 పనులు పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

12748 పంచాయతీల్లో ప్రణాళికలు

గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు సంబంధించిన వార్షిక ప్రణాళికలు కూడా గ్రామ సభల్లో చర్చకు పెట్టి ప్రణాళికలు రూపొందించుకున్నారు. మొత్తం 12748 పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి వాటి నివేదికలు ఉన్నతాధికారులకు పంపారు. వార్షిక ప్రణాళికల ద్వారా నిధుల లభ్యతను బట్టి ఏడాది పొడుగునా పనులు చేపట్టనున్నారు. రాష్ట్రంలో పచ్చదనం పెంచి పర్యావరణాన్ని కాపాడేందుకు 12658 గ్రామాల్లో హరిత ప్రణాళికలను రూపొందించారు. పొలాల గట్లపైన, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు 4.06కోట్ల మొక్కలను 336138 మంది రైతులకు పంపిణీ చేశారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచేందుకు 3.66 కోట్ల మొక్కలు పంపిణీ చేశారు.157088 ప్రాంతాల్లో సామూహిక మొక్కల పెంపకం కింద 3.34 కోట్ల మొక్కలు నాటారు. మరో 71వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్ల వెంట మొక్కలు నాటాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

పిడుగుల మోత.. కుండపోత

ఆస్పత్రిలో వ్యక్తి వివరాలు తెలుసుకుంటున్న ఆర్థిక మంత్రి హరీష్‌రావు

(మొదటిపేజీ తరువాయి)

పోటెత్తింది. వాహనాలు ఆ నీటిలో చిక్కుకుపోయాయి. ఆదివారం మధ్యాహ్నం 1.30 సమయంలో నగరం అంతటా కరిమబ్బులు విస్తరించి చిమ్మచీకట్లు అలుముకున్నాయి. ఆ తరువాత మొదలైన చినుకులు ఉధృతమై గంటపాటు ఏకధాటిగా కుండపోత కురిసింది. అదే సమయంలో ఉరుములు ఊదరగొట్టాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్క గంటలో 7 సెం.మీ వర్షం కురవగా పొద్దుటి నుంచి సాయంత్రం వరకు మొత్తం 9 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ఇక జిల్లాల్లో పెద్ద ఎత్తున పంటనష్టం సంభవించింది.

వారం రోజులుగా వదలని వానలు

రాష్ట్రంలో వారం, పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అతివృష్టి బీభత్సం నెలకొంటోంది. ఉన్నట్లుండి ఆకాశం కారుమబ్బులు కమ్ముకుని అతిభారీ వర్షాలు పడుతున్నాయి. అనేక ప్రాంతాల్లో 12 నుంచి 20 సెంటిమీటర్ల మధ్య రికార్డుస్థాయి వర్షపాతం నమోదవుతోంది. అక్కడక్కడ అంతకు మించిన వర్షపాతం నమోదై జనజీవనం స్తంభించిపోతోంది. ఉరుములు, పిడుగులతో భయానక వాతావరణం ఆందోళన కలిగిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గడిచిన 48 గంటలుగా అతిభారీ వర్షాలు ప్రాణ, పంట నష్టాన్ని కలిగిస్తున్నాయి.

ప్రాణం తీసిన పిడుగులు

రాష్ట్రంలో ఆదివారం పలుచోట్ల పిడుగులు పడ్డాయి. ఆదివారం ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా ఐదుగురు మృత్యువాత పడ్డారు. పిడుగుపాట్ల కారణంగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సిద్ధిపేట జిల్లా చింతల్ చెరువుకట్టపై పిడుగుపడి ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులు హనుమాన్‌నగర్‌కు చెందిన పస్తం శ్రీనివాస్, బాలరాజులుగా గుర్తించారు. ఇదే ఘటనలో తీవ్ర గాయాల పాలైన చెన్నూరు సారయ్యను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అలాగే వికారాబాద్ జిల్లా యాలాల మండలం రాస్నం గ్రామంలో పిడుగుపాటుకు ఓ రైతు మృతిచెందగా, మరో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతిచెందిన వ్యక్తి ఎన్కెపల్లి మల్లేశం ముదిరాజ్‌గా గుర్తించారు. పొలంలో పనిచేస్తుండగా ఒక్కసారిగా భారీ వర్షం రావడంతో పక్కనే ఉన్న మర్రి చెట్టు కింద నిలబడ్డారు. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో పల్లేశం అక్కడికక్కడే మరణించారు. అతని పెద్దకుమారుడు, మరో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి.

వరుస తుపానుల కారణంగా దేశవ్యాప్తంగా పద్దెనిమిది రాష్ట్రాల్లో అతిభారీ వర్షాల తీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ భారీ నుంచి అతిభారీ వర్షాలు కొనసాగుతున్నాయి. శని, ఆది వారాల్లో హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో మూడు నుంచి ఐదు గంటల పాటు ఎడతెరిపి లేని కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షం తీవ్రత రాత్రిపూట కూడా కొనసాగింది. రహదారులు ధ్వంసమయ్యాయి. నాలాలు పొంగిపొర్లాయి. అనేకచోట్ల జనజీవనం స్తంభించింది. రోడ్లపై మోకాలులోతు నీళ్ళు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. పలుచోట్ల పురాతన కట్టడాలు కుప్పకూలాయి. రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయ పునరావాస చర్యలు కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపిన సమాచారం మేరకు గడిచిన 24 గంటల్లో కొత్త గూడెం జిల్లా ఆశ్వరావుపేట, మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట, కొమురంభీమ్ జిల్లా సిర్పూరు, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, రంగారెడ్డి జిల్లా యాచారం, కరీంనగర్ జిల్లా గంగాధర తదితర ప్రాంతాల్లో అత్యధికంగా 12 నుంచి 15 సెంమీ వరకు రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. అనేక ప్రాంతాల్లో 5 నుంచి 10 సెం.మీ. మధ్య వర్షం కురిసింది. హైదరాబాద్‌లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు 12 సెంమీ వర్షపాతం నమోదైంది.

పిడుగుపాటుకు గురైన వ్యక్తులు

రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం

భారత వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తుపాను కారణంగా సంభవించే నష్టాన్ని నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి జిల్లా కలెక్టర్లకు తగిన మార్గదర్శకాలు ఇచ్చారు. నదీతీర ప్రాంతాల్లో వరదల ఉధృతి కొనసాగుతున్నందున చేపల వేట వెళ్ళవద్దని అధికారులు మత్స్యకారులను హెచ్చరించారు. అటు రాయలసీమ, కోస్తాంధ్ర, ఇటు తెలంగాణ వ్యాప్తంగా మరో రెండు రోజులపాటు అతిభారీ వర్షాల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. వాతావరణశాఖ చెబుతున్న ప్రకారం మరో రెండు రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు ప్రభావం చూపితే గనుక భారీ పంటనష్టం జరిగే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే అవసరానికి మించిన వర్షాలు కురిసినందున కొన్ని జిల్లాల్లో అతివృష్టి కొనసాగుతోంది. ఆయకట్టు పొలాలు వరదనీటి ముంపునకు గురై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరిన్ని రోజులపాటు తుపాను తీవ్రత కొనసాగితే మత్స్యకార కుటుంబాలకు నిత్

14 నుంచి బడ్జెట్ కసరత్తు ప్రారంభం

న్యూఢిల్లీ: 2020-21 ఆర్థికసంవత్సరం బడ్జెట్ కసరత్తును ఈ నెల 14 నుంచి ఆర్థికమంత్రిత్వశాఖ ప్రారంభించనుంది. ఈ సమావేశంలో కీలకమైన అంశాలపై ఫోకస్ పెడతారు. ముఖ్యంగా వృద్ధిరేటు క్షీణించడంతో పాటు తగ్గుముఖం పడుతున్న రెవెన్యూ వసూళ్లపై దృష్టి పెడతారు. కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వానికి ఇది రెండవ బడ్జెట్ అని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ముందస్తుబడ్జెట్/ సవరించిన అంచనా సమావేశాలు అక్టోబర్ 14 నుంచి మొదలవుతాయి. ఆర్థిక సలహాదారులు అందరూ ఈ సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరు కావాలని బడ్జెట్ సర్క్యులర్ 2020-21 ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం విడుదల చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను ఎక్స్‌పెండిచర్ సెక్రటరీ (వ్యయ కార్యదర్శులతో పాటు ఇతర కార్యదర్శులు, ఆర్థిక సలహాదారులు చర్చలు జరిపిన తర్వాత బడ్జెట్ ముందుస్తు సమావేశాలు అక్టోబర్ 14 నుంచి నవంబర్ మొదటివారం వరకు కొనసాగుతాయి. కాగా కొత్త ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెడతారు. బడ్జెట్ తర్వాత నిధులను ఆయా మంత్రిత్వశాఖలకు కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌నుంచి కేటాయింపులు మొదలుపెడతారు. దీని వల్ల ప్రభుత్వంలోని వివిధ తమకు తమ కేటాయించిన నిధులను పెద్దమొత్తంలో వ్యయంచేసుకొనే వెసలుబాటు కలుగుతుంది కంపెనీలు కూడా తమ వ్యాపార విస్తరణతో పాటు పన్నులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవడానికి వీలవుతుంది.

ఉద్యోగుల్లో అసంతృప్తి

వినియోగదారుల్లో సడలుతున్న విశ్వాసం

- సెప్టెంబర్2012 తర్వాత మళ్లీ సీన్ రిపీట్
- తగ్గుతున్న ఆదాయం.. పెరుగుతున్న గృహ వ్యయం
- రిజర్వు బ్యాంకు సర్వేల్లో వెల్లడి

ముంబై : దేశంలోని 50 శాతం మంది ఉద్యోగుల్లో ఒక రకమైన అసంతృప్తి నెలకొంది. ఉద్యోగులతో పాటు గృహస్తుల్లో కూడా ప్రస్తుతం నిరాశావాదం నెలకొంది. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా తాజాగా నిర్వహించిన నెలవారి వినియోగదారులపై సర్వేలో వారి వారి అభిప్రాయాలను తెలుసుకోంది. సెప్టెంబర్ 2012 తర్వాత మళ్లీ ప్రజల్లో ఈ స్థాయిలో నిరాశావాదం నెలకొంది. సర్వేలో పాల్గొన్న 52.5 శాతం మంది ఉద్యోగుల్లో పూర్తి స్థాయి అసంతృప్తి నెలకొందని తేల్చి సర్వేలో పాల్గొన్న వారు చెప్పారు. రాబోయే సంవత్సరం పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంటుందని 33.4 శాతం మంది ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. జనాభాలోని మెజారిటీ ప్రజలు మాత్రం ప్రస్తుతం దేశంలో నెలకొన్ని వర్తమాన పరిస్థితులపై తమ అసంతృప్తిని వెళ్లగక్కారు.

ఆదాయం గురించి...

ఆర్‌బీఐ సర్వేలో పాల్గొన్న వారిలో 26.7 శాతం మంది తమ ఆదాయం బాగా తగ్గిపోయిందని వెల్లడించగా.. చివరగా నవంబర్ 2017లో తమ ఆదాయం పెరిగిందని తెలిపారు. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో అత్యధికంగా 28 శాతం మంది మాత్రం తమ ఆదాయం గణనీయంగా తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మెజారిటీ ప్రజలు 53 శాతం మంది ఈ ఏడాది ఆదాయం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేయగా.. కేవలం 9.5 శాతం మంది మాత్రం ఆదాయం మరింత తగ్గుతుందని చెప్పారు.

ఆర్థిక వ్యవస్థ గురించి..

మొత్తానికి దేశ ఆర్థిక వ్యవస్థ గురించి సుమారు సగం మంది అంటే 47.9 శాతం మంది గృహస్తు పరిస్థితులు మాత్రం బాగా లేవని కుండబద్దలు కొట్టారు. ఇలాంటి అభిప్రాయాలే చివరగా డిసెంబర్ 2013లో వ్యక్తం చేశారు. 54 శాతం మంది మాత్రం ఆర్థిక వ్యవస్థ మరింత దగజారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 31.8 శాతం మంది ప్రజలు రాబోయే సంవత్సరంలో పరిస్థితి మరింత దిగజారతుందని సర్వేలో అభిప్రాయం వ్యక్తం చేయగా... చివరగా ఇదే స్థాయిలో అంటే అప్పుడు 38.6 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సమీప భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థ మరింత దారుణంగా ఉంటుందని తేల్చి చెప్పారు. వచ్చే ఏడాది కూడా పరిస్థితుల్లో గొప్ప మార్పు ఉండదని తేల్చి చెప్పారు.

ఆర్థిక వ్యవస్థ గురించి ఆందోళనే వ్యక్తం చేయగా.. అదే ద్రవ్యోల్బణం గురించి వచ్చే సరికి ద్రవ్యోల్బణం గురించి మిశ్రమంగా స్పందించారు. ప్రస్తుతం నెలకొన్ని ఆర్థిక వ్యవస్థను బట్టి ప్రజలు తమ ఖర్చు లను ప్రాధాన్యాతా రంగాలపై ఎక్కువ వ్యయం చేస్తున్నారు. అత్యసరం కానీ వస్తువులపై ఖర్చులను తగ్గించుకుంటున్నారు. చివరగా సెప్టెంబర్ 2015 నాటికి స్థాయిలో ప్రజలు తమ ఖర్చులను ప్రాధాన్యత అవసరాలను బట్టి వ్యయం చేస్తున్నారు.

ఈ సర్వేలో పాల్గొన్న వారికిలో 26 శాతం మంది వచ్చే ఏడాది కూడా అవసరంలేని వస్తువు లిపై ఖర్చును తగ్గించుకుంటామని తేల్చి చెప్పారు. ప్రజలు అవసరం కానీ వస్తువులపై వ్యయం తగ్గించుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా బలపడుతుంది. ఇప్పటికే దేశ ఆర్థిక వ్యవస్థ లేదా జడీపీ బాగా తగ్గిపోయింది. డిమాండ్ అంటే వినియోగం తగ్గి ఈ ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు ఆరేళ్ల కనిష్ఠానికి 5 శాతానికి పడిపోయింది. వృద్ధిరేటు పెంచు కోవడానికి ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. ఆర్‌బీఐ రెపో రేటును ఈ ఏడాది మొత్తానికి 135 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు దేశంలోని 400 జిల్లాల్లో గత గురు వారం నుంచి రుణ మేళాను ప్రారంభించింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి అక్కడికక్కడే రుణాలు ఇవ్వాలని ఈ రుణ మేళాను బ్యాంకులు ప్రారంభించాయి. ప్రస్తుతం వినియోగదారుల సెంటిమెంట్ చూస్తే సమీప భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థ పుంజుకొనే అవకాశాలు కనిపించడం లేదు.

ఇక్కడ ఆసక్తి కలిగించే అంశం ఏమిటంటే ఇప్పటికే నిత్యావసర వస్తువులపై ప్రజలు పెద్దమొత్తంలో వ్యయం చేస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో ఇది మరింత పెరిగే అవకాశాలున్నాయి. ప్రభుత్వం ద్రవ్యోల్బణం బాగా తగ్గిందని.. చెప్పుకొస్తోంది. వాస్తవానికి ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ విధించిన పరిధి నాలుగు శాతం లోపే తచ్చాడుతోంది. దీనికి ప్రధాన కారణం ప్రజలు కొనుగోళ్లు తగ్గించారని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. ప్రజలు తమకు కావాల్సిన నిత్యావసర వస్తువు లపై మాత్రమే వ్యయం చేసి తమకు అవసరం లేని వస్తువుల కొనుగోలు జోలికిపోవడం లేదని తాజా సర్వేను చూస్తే తెలిసిపోతోంది.

రాబోయే రోజుల్లో పరిస్థితు లు ఇలానే ఉంటాయి.. ద్రవ్యోల్బణం కూడా ఇదే స్థాయిలో తచ్చాడుతుందని సర్వేలో పాల్గొన్న వారు స్పష్టంచేశారు. కాగా రిజర్వుబ్యాంకు మొత్తం 13 అతి పెద్ద నగరాల్లో సర్వే నిర్వహించింది. వాటిలో ఎనిమిది అతి పెద్ద మెట్రోనగరాలు.. అవి ఢిల్లీ, ముంబై, కోలకతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, మరో ఏడు రాష్ట్ర రాజధానులు భోపాల్, గువాహతి, జైపూర్, లక్నో, పాట్నా, తిరునంతపురం. మొత్తం 5,192 మంది గృహస్తులు సర్వేలో పాల్గొన్నారు.

పరిమిత స్థాయిలో ట్రేడింగ్

టీసీఎస్, ఇన్ఫోసిస్ ఫలితాలే కీలకం

ముంబై : ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లు పరిమిత స్థాయిలోనే ట్రేడింగ్ జరగవచ్చునని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వారంలోనే దసరా సందర్భంగా మంగళవారం నాడు స్టాక్ మార్కెట్లకు సెలవు. అలాగే సెప్టెంబర్‌తో ముగిసిన రెండవ త్రైమాసికం ఫలితాలు టీసీఎస్, ఇన్ఫోసిస్‌తో మొదలవుతుంది. మార్కెట్లకు దిశానిర్దేశం చేసే అంశానికి వస్తే టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్‌లు కీలకం కానున్నాయి, కొన్ని రంగాల్లో షేర్లలో ఒడిదుడుకులకు అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. ఇక క్యూ2 ఫలితాల విషయానికి వస్తే టీసీఎస్ గురువారం, ఇన్ఫోసిస్ శుక్రవారం నాడు ఫలితాలు వెల్లడించనుంది. దీంతో పాటు అమెరికా-చైనాల మధ్య వాణిజ్య చర్చలు గ్లోబల్ మార్కెట్లకు కీలకం కానున్నాయి. శుక్రవారం నాడు పారిశ్రామికోత్పత్తి గణాంకాలు మార్కెట్ ముగిసిన తర్వాత వెల్లడి అవుతాయి. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఇన్వెస్టర్లు ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటి (ఎఫ్ఓఎంసీ) మినిట్స్ బుధవారం నాడు విడుదల అవుతాయి. దీని ప్రభావం గ్లోబల్ మార్కెట్లపై కనిపిస్తుంది. అలాగే అమెరికాలో జాబ్ రిపోర్టు నివేదిక ఆధారంగా ఫెడ్ తదుపరి రేట్లపై నిర్ణయం తీసుకుంటుంది. మార్కెట్లను శాసించే అంశాలను చూస్తే డాలర్ మారకంతో రూపాయి, చమురు ధరలు, విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు తదితతర అంశాలు కీలకపాత్ర వహిస్తాయి. గత వారం సెన్సెక్స్ 1,149.26 పాయింట్లు నష్టపోగా.. శుక్రవారం ఏకంగా 433.56 పాయింట్లు క్షీణించి 37,673.31 పాయింట్లకు దిగివచ్చింది. గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరతి సమీక్షలో రిజర్వుబ్యాంకు 0.25 శాతం రెపోరేటును తగ్గించి 5.15 శాతానికి సవరించింది. దీంతో పాటు రిజర్వుబ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటును 6.9 శాతానికి కుదించింది. వృద్ధిరేటు పుంజుకొనే వరకు వడ్డీరేట్లు తగ్గించుకుంటూపోతామని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ అన్నారు.

లక్ష కోట్ల మార్కెట్ క్యాప్ ఆవిరి

- గత వారం స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ల సొమ్ము

న్యూఢిల్లీ : బీఎస్ఈలోని టాప్ పది కంపెనీల్లో గత వారం ఏడు కంపెనీల మార్కెట్ క్యాప్ మొత్తం రూ.1,00,000 కోట్లు ఆవిరయ్యింది. మార్కెట్ విలువ ప్రకారం చూస్తే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు అత్యధికంగా రూ.30 వేల కోట్లు కోల్పోయింది. దీంతో పాటు మార్కెట్ క్యాప్ కోల్పోయిన కంపెనీల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, హిందుస్తాన్ యూనీలీవర్, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ మహీంద్రాబ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, బజాజ్ ఫైనాన్స్‌లున్నాయి. వీటికి వ్యతిరేకంగా టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, ఐటీసీలు మార్కెట్ విలువ పెంచుకున్నాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రకారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రూ.30,198.62 కోట్లు కోల్పోయి రూ.6.50,446.45 కోట్లకు దిగిరాగా.. ఐసీఐసీఐ మార్కెట్ విలువ రూ.22,866.93 కోట్లు తగ్గి రూ.2,67,265.32 కోట్లకు, కొటక్ మహీంద్రాబ్యాంకు రూ.15,624.6 కోట్లు క్షీణించి రూ.2,98, 413.27 కోట్లకు... హెచ్‌యూఎల్ మార్కెట్ విలువ రూ.14,287.76 కోట్లు తగ్గి రూ.4,20,774.52 కోట్లకు... హెచ్‌డీఎఫ్‌సీ రూ.10,178.84 కోట్ల తగ్గి రూ.3,41 ,349.33 కోట్లకు, బజాజ్ ఫైనాన్స్ రూ.9,437.91 కోట్లు తగ్గి రూ.2,26, 309.37కోట్లకు దిగిరాగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.824.08 కోట్లు తగ్గి రూ.8,28,808.67 కోట్లకు దిగివచ్చింది. దీనికి వ్యతిరేకంగా టీసీఎస్ మార్కెట్ క్యాప్ రూ.8,236.49 కోట్లు పెరిగి రూ.7,79,989.45 కోట్లకు, ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.4,681.89 కోట్లు పెరిగి రూ.3,40,704.24 కోట్లకు, ఐటీసీ మార్కెట్ విలువ రూ.5,344.62 కోట్లు పెరిగి రూ.3,16,069.96 కోట్లకు ఎగబాకింది. బీఎస్ఈలో టాప్ పది కంపెనీలు ఇలాఉన్నాయి. రిలయన్స్ తిరిగి అగ్రస్థానానికి చేరగా, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, హెచ్‌యూఎల్, హెచ్ డిఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, ఐటీసీ, కొటక్ మహీంద్రా బ్యాంకు, ఐసీఐసీఐబ్యాంకు, బజాజ్ ఫైనాన్స్‌లు ఆక్రమించాయి. టాప్ 10 నుంచి స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా తప్పుకుంది.

జనవరి నుంచి వృద్ధిరేటుకు ఊపు

ఆదిత్యపూరి

ముంబై: ఆర్థిక వ్యవస్థ జనవరి నుంచి ఊపందుకుంటుదని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎండీ ఆదిత్యపూరి అన్నారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల సంక్షోభం సమసిపోయిందని, కొన్ని కంపెనీలు ఇంకా సంక్షోభంలో ఉండవచ్చునని... ఈ కంపెనీలు రియల్టీరంగానికి రుణాలు ఇచ్చి ఉంటాయి. కాబట్టి భవిష్యత్తులో కూడా వీటికి ఇబ్బందులు తప్పవన్నారు. ఆర్‌బీఐ శుక్రవారం నాడు పరపతి సమీక్షలో జీడీపీ వృద్ధిరేటు అంచనాను 6.9 శాతం నుంచి 6.1 శాతానికి సవరించిన తర్వాత పూరి తాజా వ్యాఖ్యాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రభుత్వం పెద్దమొత్తంలో వ్యయం చేయడంతో పాటు మౌలికరంగంపై పెట్టుబడులు పెట్టడంతో పాటు నిర్మలా సీతారామన్ ఆర్థిక వ్యవస్థలో పెద్దమొత్తంలో నగదు చలమణిలోకి తేవడం, రుణాలు పవనాలు అనుకూలంగా ఉండటంతో వృద్ధిరేటు పుంజుకోవడానికి అవకాశాలు మెరుగుపడ్డాయని పూరి పేర్కొన్నారు.

ప్రపంచ కుబేరుల్లో

ముఖేష్ @17

న్యూఢిల్లీ : ప్రపంచంలోని అత్యంత సంపన్నుల్లో ముఖేష్ అంబానీ 17వ స్థానాన్ని ఆక్రమించారు. ఏప్రిల్ 2017లో ఆయన ప్రపంచంలోని సంపన్నుల్లో 20వ స్థానంలో ఉన్నారు. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌ను సెప్టెంబర్ 2016న ప్రారంభించిన ఎనిమిది నెలల తర్వాత నుంచి ఆయన సంపద మరింత పెరిగింది. కుబేరుల్లో జాబితాలో మరింత ముందుకు జరిగారు. ముఖేష్ అత్యధిక లాభాలను సమకూర్చి పెట్టే కంపెనీ మాత్రం రిలయన్స్ ఇండస్ట్రీస్.బ్లూమ్‌బర్గ్ అంచనా ప్రకారం ముఖేష్ అంబానీ ప్రస్తుతం ప్రపంచకుబేరులజాబితాలో 17వ స్థానంలో ఉన్నారు. ఆయన నికర సంపద 5.1 బిలియన్ డాలర్లుగా తేల్చి చెప్పింది. అయితే దీనికి వ్యతిరేకంగా ఫోర్బ్స్ మాత్రం అంబానీకి 13వ ర్యాంకు ఇచ్చింది. ఆయన సంపద 51.1 బిలియన్ డాలర్లుగా అక్టోబర్ 6,2019న లెక్కగట్టింది. కాగా అక్టోబర్ 6, 2019న బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం ముఖేష్ అంబానీ నికర సంపద 51.2 బిలియన్ డాలర్లు పేర్కొంది. సెప్టెంబర్ 19, 2019 వరకు ముఖేష్ అంబానీ బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ సూచిలో 18వ స్థానంలో ఉన్నారు. గత రెండు వారాల నుంచి రిలయన్స్ షేర్లలో పెద్దమొత్తంలో ర్యాలీ ఏర్పడ్డంతో ముఖేష్ సంపద కూడా పెరిగిపోతూ వస్తోంది. అక్టోబర్ 4, 2019న రిల్ షేరు ఏకంగా 11 శాతం పెరిగి రూ.1,307.75కు చేరింది. అంతకు ముందు సెప్టెంబర్ 19, 2019న రూ.1,179. 05 వద్ద ట్రేడ్ అయ్యింది. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి తగ్గించి 25.17 శాతానికి తగ్గించడంతో సెప్టెంబర్ 19 నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు అమాంతం పెరిగిపోయింది. దీంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ.8,28, 808.67 కోట్లకు చేరింది. బీఎస్ఈలో లిస్టు అవుతున్న కంపెనీల్లో మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రకారం చూస్తే అత్యంత విలువైన షేర్లలో రిలయన్స్ అగ్రస్థానంలో నిలిచింది.

ఎలక్ట్రిక్ వాహనాలు కొనేవారేరీ?

- భారత్‌లో అరుదుగా కార్ల అమ్మకాలు
- ఆరేళ్లలో కేవలం 8వేల యూనిట్ల అమ్మకం
- ఈ ఆగస్టులో కేవలం 130 కార్లు మాత్రమే విక్రయం
- ప్రభుత్వ ప్రోత్సాహమున్నా ఆదరణ కరువు
- చార్జింగ్ పాయింట్లు లేకపోవడమూ ఓ కారణం
- చైనాలో ఇందుకు పూర్తి భిన్నం.. భారీగా విక్రయాలు

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద ఆటో మార్కెట్ అయిన భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దగా ఆదరణ దక్కడం లేదు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి ప్రోత్సాహక రూపంలో కేంద్ర ప్రభుత్వం మద్దతిస్తున్నప్పటికీ ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చేసేవారు కనపడడం లేదు. దేశంలో మొత్తం కోటి యాభై లక్షల మంది డ్రైవర్లు ఉంటే ఆగస్టు నెల్లో హ్యాందాయ్ కొనా ఎస్‌యూవీ ఎలక్ట్రిక్ కార్లు 130 మాత్రమే అమ్ముడుపోయాయి. బ్లూంబర్గ్ రిపోర్ట్ ప్రకారం.. భారత్‌లో గత ఆరేళ్లలో మొత్తం 8,000 ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే అమ్ముడయ్యాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. ఈ వాహనాలను చైనా మార్కెట్లో కేవలం రెండు రోజుల్లోనే అమ్ముడవుతాయని బ్లూంబర్గ్ఎన్ఈఎఫ్ అంచనా వేసింది. ఎలక్ట్రిక్ వాహనాలను భారీగా విక్రయించడమే లక్ష్యంగా హుందాయ్ మోటార్ కంపెనీ ఈ ఆగస్టులో భారత్‌లో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాన్ని ప్రారంభించింది. హూందాయ్ కార్ల అమ్మకాలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా భారత్‌లో ఎలక్ట్రిక్ కార్లను తీసుకొచ్చేందుకు అనేక కంపెనీలు జంకుతున్నాయి. రోడ్లపై అక్కడక్కడా అరుదుగా హూందాయ్ కొనా కార్లు మాత్రమే కనిపించడానికి కారణం ఇదే. కొనా కార్ల ధరలు తక్కువే అయినప్పటికీ చార్జింగ్ మౌలిక సదుపాయాలు లేకపోవడం, ఫైనాన్సింగ్ చేసేందుకు బ్యాంకులు పెద్దగా ఆసక్తిచూపకపోవడం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి ప్రభుత్వం ఆదేశించినప్పటికీ ప్రభుత్వ విభాగాల్లో ఆసక్తికొరవడడంతో కార్లకు ఆదరణ లభించకపోవడానికి గల కారణాలని విశ్లేషకులు చెబుతున్నారు.

ఇతర కంపెనీలకు మార్కెట్లు చోటు

ఇదే అంశంపై మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ చైర్మన్ ఆర్‌సీ భార్గవా స్పందించారు. రానున్న రెండు లేదా మూడేళ్లలో భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పెరుగుతాయని ప్రభుత్వం లేదా కార్ల కంపెనీలు అంచనావేస్తున్నాయని తాను భావించడం లేదన్నారు. అయితే భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలేదని కొట్టిపారేయడం సాధ్యంకాదు. ఎందుకంటే ప్రతి వెయ్యి భారతీయుల వద్ద 27 ఎలక్ట్రిక్ కార్లు ఉన్నాయి. అయితే జర్మనీలో వెయ్యికి 570గా ఉంది. మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలు ఎక్కువగా లేకపోవడంతో అంతర్జాతీయ సంస్థలకు అవకాశాలున్నాయనే విషయం మాత్రం స్పష్టమవుతోందన్నారు.

మార్కెట్‌పై పలు కంపెనీల చూపు

మారుతీ సుజుకీ వచ్చే ఏడాది వరకూ భారత్ మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టే అవకాశం లేదు. టాటా మోటార్స్ లిమిటెడ్, మహింద్రా అండ్ మహింద్రా లిమిటెడ్ చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేస్తున్నాయి. వీటిని కూడా ప్రభుత్వ వినియోగం దృష్ట్యా తయారు చేస్తుండడం గమనార్హం. అయితే భారత్‌లో తొలి ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టిన హ్యూందాయ్‌కు కార్ల విక్రయ అవకాశాల శాతం ఎక్కువగా ఉంది. 2040 నాటికి భారత్‌లో ఉండే ఎలక్ట్రిక్ వాహనాల్లో 40 శాతం హ్యూందాయ్‌కి చెందినవే అయ్యే అవకాశాలున్నాయి. అయితే భారత్ మార్కెట్‌పై బ్రిటన్‌లో ప్రముఖ కారుతయారీ సంస్థ ఎంజీ మోటార్, జపాన్‌కు చెందిన నిస్సాన్ మోటార్ కంపెనీలు కూడా భారత్‌లో ఎలక్ట్రానిక్ వాహనాల అమ్మకంపై కన్నేశాయి. ఈ అంశంపై ఎంజీ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ చాబా స్పందించారు. భారత్‌లో ఎవరో ఒకరు నాయకత్వం వహించాలి. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకం జరపాలని ఆయన ఆకాంక్షించారు. దేశంలో ఏదోఒక చోట వాహనాల అమ్మకం ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఇదిలావుండగా ఎంజీ మోటార్స్ ఈ ఏడాది డిసెంబర్‌లో భారత్‌లో తొలి ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది.

ఐపీవో ఇన్వెస్టర్లు హ్యాపీ!

- ఇష్యూ ధరపై ఆకర్షణీయమైన రాబడి
- సెకండరీ మార్కెట్ అంతా ఒడిదొడుకులమయం
- 11స్టాక్స్‌లో 8పై మంచి రిటర్న్స్

న్యూఢిల్లీ : ఈ ఏడాది ఇన్వెస్టర్లకు ప్రైమరీ మార్కెట్ బాగా కలిసివచ్చింది. సెకండరీ మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులకు గురైంది. స్టాక్ మార్కెట్లో లిస్టు అయిన ఐపీవో షేర్లలో ఇష్యూ ధర కంటే 70 శాతం ఎక్కువ మొత్తంలో ట్రేడ్ అవుతున్నాయి. వాటాదారులకు 95 శాతం వరకు ఆదాయం సమకూర్చి పెట్టాయి. స్టాక్ మార్కెట్లు నష్టపోవడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. వాటిలో అమెరికా - చైనాల మధ్య వాణిజ్య యుద్ధం, దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడం, ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనంగా ఉండటంతో పాటు విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్ల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్లు ఒడిదుడుకులకు గురైనా.. ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)కు మంచి డిమాండ్ ఉంటోంది. ఈ ఏడాది 11 కంపెనీలు స్టాక్ మార్కెట్లో లిస్టు అయితే ఎనిమిది షేర్లపై ఇన్వెస్టర్లకు 7 నుంచి 95 శాతం వరకు ఆదాయం లభించింది. మిగిలిన మూడు కంపెనీలు ఇష్యూ ధర కంటే చాలా తక్కువకు కోట్ అయ్యాయి. ఈ నెల 4వ తేదీ వరకు కొత్తగా లిస్టు అయిన కంపెనీల ప్రదర్శన బట్టి

తెలుస్తోంది. ఇండియా మార్ట్ ఇంటర్ మెష్ ఈ ఏడాది జులైలో స్టాక్ మార్కెట్లో లిస్టు అయ్యాయి. బీఎస్ఈలో ఐపీవో ధర కంటే 95 శాతం షేరు ధర పెరిగింది. దీంతో పాటు నియోజెన్ కెమికల్స్ షేరు ధర 76 శాతం వరకు పెరిగింది. దీంతో పాటు అఫెల్ ఇండియా లిమిటెడ్, మెట్రోపోలిస్ హెల్త్‌కేర్ కూడా ఇన్వెస్టర్లకు వరుసగా 49, 40 శాతం రాబడి తెచ్చిపెట్టాయి. పోలీక్యాబ్ ఇండియా, రైల్ వికాస్ నిగం లిమిటెడ్, చాలెట్ హోటల్స్, స్పందనా స్ఫూర్తి ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు వరుసగా 24 శాతం, 21 శాతం, 12 శాతం, 7 శాతం వరకు ఇష్యూ ధర కంటే లాభాలను సమకూర్చి పెట్టాయి. దీనికి వ్యతరేకంగా ఇన్వెస్టర్ల సొమ్ముకు గండి కొట్టిన షేర్లలో ఎంఎస్‌టీసీ, స్టెర్లింగ్ అండ్ విల్‌సన్ సోలార్, గ్జిల్సమోసీ ఇష్యూ ధర కంటే తక్కువకు బీఎస్ఈలో లిస్టు అయ్యాయి. ఎంఎస్‌టీసీ షేరు స్టాక్ మార్కెట్లో మార్చిలో లిస్టు అయ్యింది. ఇష్యూ ధర కంటే 24 శాతం తక్కువ కోట్ అయ్యింది. స్టెర్లింగ్ అండ్ విల్సన్ సోలార్ ఆగస్టులో కోట్ అయ్యింది. 23 శాతం క్షీణించింది. గ్జిల్సమోసీ 4.5 శాతం వరకు నష్టపోయింది.గత ఏడాది నుంచి మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు గురవుతున్నాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనంగా ఉండటంతో ఐపీవోలకు ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించింది. మార్కెట్లు పుంజుకున్నప్పుడు ఐపీవోలో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లకు మంచి ఆదాయం లభించిందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. షేర్లకు మంచి స్పందన లభించడానికి ప్రధాన కారణం ఐపీవోకు వచ్చిన కంపెనీలు మంచి లాభాలతో ఉన్న కంపెనీలు కాబట్టి ఇన్వెస్టర్లను బాగా ఆకర్షించాయి. దీంతో పాటు నాణ్యమైన కంపెనీలకు ఇన్వెస్టర్ల నుంచి ఎప్పుడూ మంచి డిమాండ్ ఉంటుందని చెబుతున్నారు. ఈ ఏడాది మొత్తానికి సెన్సెక్స్ నాలుగు శాతం లాభపడింది. మొత్తం 13 కంపెనీలు ఐపీవో వచ్చి గరిష్ఠంగా రూ.11వేల కోట్లు సేకరించాయి. క్రితం ఏడాది 24 ఐపీవోలు రూ.30,959 కోట్లు సేకరించాయి వీటితో పోల్చుకుంటే ఈ ఏడాది తక్కువ ఐపీవోలు వచ్చినట

ని'బంధనాల్లో' లబ్ధిదారులు

విధివిధానాలతోనే అసలు తంటా

- జగన్ సర్కార్ చరిత్రాత్మక పథకాలు
- 'వాహనమిత్ర'లో వెల్లడైన వైనం
- ఆశించిన స్థాయిలో రాని దరఖాస్తులు
- ఆధార్‌తో అనుసంధానమే కీలకం
- దీంతో లబ్ధిదారుల వెనుకంజ
- తెల్లకార్డు, ఆరోగ్యశ్రీలకు సంబంధం లేదని ప్రకటించాలి
- గ్రామ సచివాలయ పోస్టుల్లోనూ అస్పష్టత
- ప్రభుత్వాధికారులు స్పష్టతనివ్వాలి

(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రచరిత్రలో గతంలో ఎప్పుడూ అమలు కానన్ని పథకాలు ఇప్పుడు జగన్ ప్రభుత్వం అంకురార్పణ చేసింది. దాదాపు ప్రతి వర్గానికి ఏదొక పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. అయితే వీటిని అందిపుచ్చు కునేందుకు అర్హులు మాత్రం సంశయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్దేశిత పథకాలకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు కూడా రావడం లేదు. ఈ పథకాల వల్ల పొందే ప్రయోజనాల కంటే పరోక్షంగా కలిగే నష్టాలే అధికమన్న భయం ఇప్పుడు అర్హుల్లో నెలకొనడమే ఇందుకార్కారణం. ఏ సంక్షేమ పథకానికి చెందిన నిబంధనల్లోనూ స్పష్టతలేదు. ఇచ్చేందుకు యంత్రాంగం ప్రయత్నించడం లేదు.

పాదయాత్ర సందర్భంగా ఆటో డ్రైవర్ల కష్టాల్ని స్వయంగా చూసిన జగన్ వారిని ఆదుకుం టామంటూ ప్రకటించారు. అధికారంలోకొచ్చిన నాలుగు మాసాల్లోగానే వారి కోసం వాహనమిత్ర పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ పథకానికి బడ్జెట్‌లో నాలుగొందల కోట్లు కేటాయించారు. రవాణా శాఖ అంచనాల మేరకు రాష్ట్రంలో ఆటోలు, ప్రైవేటు టాక్సీలు, క్యాబ్‌ల ఓనర్ కమ్ డ్రైవర్లు మొత్తం నాలుగు లక్షలకు పైగా ఉంటారని భావించారు. ఒక్కొక్కరికి పదివేల చొప్పున ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకనుగుణంగా బడ్జెట్‌లో నాలుగొందల కోట్లు కేటాయించింది. ఈ పథకానికి ఆరు లక్షలకు పైగా దరఖాస్తులొస్తాయని ఆశించారు. అందులో నిబంధనలకు అనుగుణంగా నాలుగు లక్షల మంది అర్హుల్ని ఎంపిక చేయాలని భావించారు. అయితే ఈ పథకానికి 1.76 లక్షల దరఖాస్తులే వచ్చాయి. 2,500 దరఖాస్తుల్ని అనర్హమైనవిగా తేల్చారు. 1.73 లక్షల మందికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక ప్రయోజనాన్ని కల్పించారు.

ఇలా బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు తగినన్ని దరఖాస్తులు రాకపోవడం కూడా ఆశ్చర్యకమే. రాష్ట్రంలోనే కాదు.. దేశంలోనే ఎక్కడా ఇటువంటి పరిస్థితుండదు. ప్రభుత్వ కేటాయింపులకు మించి మూడ్నాలుగు రెట్లకు పైగా దరఖాస్తులు రావడం సహజం. వాటి నుంచి అర్హుల ఎంపిక ఓ ప్రహసనంగా జరుగుతుంది. అలాంటిది ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యానికి సగం మంది కూడా ఈ పథకం క్రింద దరఖాస్తు చేసుకోలేదు. అమెరికా, యూరోప్ దేశాల్లో అప్పుడప్పుడు కొన్ని పథకా లకు కేటాయించిన నిధులు మురిగిపోతుంటాయి. వాటిని సద్వినియోగం చేసు కోండంటూ అక్కడి ప్రభు త్వాలు ప్రకటనలిస్తాయి. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నిస్తాయి. ఇటీవల బ్రిటన్ ప్రభుత్వం విద్యార్థులకు కేటాయించిన ఉపకార వేతనాల్లో కొంతమొత్తం మిగిలిపోవడంతో అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలంటూ గడువును పొడిగించింది. సరిగ్గా ఇలాంటి పరిస్థితి ఇప్పుడు వాహనమిత్ర విషయంలో కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడింది. కేటాయించిన నిధులు మిగిలి పోవడంతో గడువును పెంచి తిరిగి దరఖాస్తుల్ని స్వయంగా ముఖ్యమంత్రే ఆహ్వానించారు.

ఈ పథకానికి దరఖాస్తులు తగినన్ని రాకపోవడం వెనుకగల కారణాలపై ప్రభుత్వం అధ్యయనం జరపాలి. ఇదొక్కటే కాదు.. ఈ నెల నుండి వరుసగా పలు పథకాలు అమల్లో కొస్తున్నాయి. రైతు భరోసా, అమ్మఒడి పథకాలు అత్యంత కీలకం. వాహనమిత్రలో నెలకొన్న లోపాల్ని సవరించి రానున్న పథకాల అమలుకు మరింత పకడ్బందీగా విధివిధానాల్ని రూపొందించాలి.

వాహనమిత్ర అమలును ఆధార్‌తో అనుసంధానం చేశారు. దీంతో ఈ పథకం క్రింద పదివేలు పొందితే ఇతర సంక్షేమ పథకాలకు అర్హత ఉండదన్న భయం అర్హుల్లో నెలకొంది. దీనిపై ప్రభుత్వం స్పష్టతివ్వాలి. ఈ పథకానికి, తెల్లరేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించాలి. అప్పుడే అర్హులంతా ఈ ఆర్థిక ప్రయోజనం పొందేందుకు ముందుకొస్తారు.

ఇటీవలె నియామకం జరిగిన గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శుల వ్యవహారంలో కూడా అస్పష్టత నెల కొంది. వీరికి ప్రభుత్వం చెల్లించేది నెలవారీ 15 వేల రూపాయలు. దీన్నే ప్రభుత్వోద్యోగంగా వారు పరిగణిస్తున్నారు. ఈ ఉద్యోగాలకు ఎంటెక్, బిటెక్, ఎంబిఎ వంటి విద్యార్హతలు కలిగిన వారు కూడా పోటీలు పడి ఎంపికయ్యారు. వీరంతా ఖచ్చితంగా మూడేళ్ళ బాండ్ రాయాల్సి వస్తోంది. మూడేళ్ళ లో లోగా వీరు ఈ కొలువుల నుంచి బయటపడేందుకు వీల్లేదు. ఒకవేళ మరింత మెరుగైన ఉద్యోగాలొస్తే అంతవరకు ప్రభు త్వం నుంచి పొందిన జీతభత్యాల్ని అణాపైసలతోసహా తిరిగి ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో వారిని ఉద్యోగాల నుంచి రిలీవయ్యేందుకు అధికారులు అంగీకరిం చరంటూ పెద్దెత్తున ప్రచారం జరుగుతోంది. అయితే మొత్తం జీతాన్ని కాదు.. కొన్ని నెలల జీతాన్ని మాత్రమే తిరిగివ్వాల్సి ఉంటుందంటూ మరికొందరు పేర్కొంటున్నారు. దీనిపై అటు ప్రభుత్వం.. ఇటు అధికార్లు ఎవరూ స్పష్టత ఇవ్వడంలేదు. కనీసం ఆ దిశగా ప్రయత్నం కూడా చేయడంలేదు. ఈ నిబం ధన కారణంగా ఎంపికైన అభ్యర్థులు సచివాలయ కార్యదర్శుల పోస్టుల్లో చేరేందుకు ఆసక్తి చూపడంలేదు. అసలే ఆశించిన సంఖ్యలో 60 నుంచి 70 శాతం మందే రాతపరీక్ష, ఇంట ర్వ్యూల్లో అర్హత సాధించారు. వీరిలోనూ అత్యధికులు నిబంధ నల్లో అస్పష్టత కారణంగా ఉద్యోగాల్లో చేరేందుకు సంశయి స్తున్నారు. ఇలాంటివన్నీ సరిదిద్ది లోపాల్లేకుండా నిబంధనల్ని రూపొందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది.

వర్సిటీల్లో యోగా పాఠాలు

- పీఈటీ, డిగ్రీ, ప్రత్యేక కోర్సుల్లో చేర్చే యోచన
- ఎన్ఎస్ఎస్‌కు ప్రాధాన్యం.. వచ్చే ఏడాది నుంచి అమలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డిగ్రీ కోర్సులతో పాటు పీఈటీ వంటి మరికొన్ని ప్రత్యేక కోర్సుల్లో యోగాను చేర్చాలని వర్శిటీలు భావిస్తున్నాయి. ఆ మేరకు ప్రాథమిక కసరత్తు ప్రారంభించాయి. వచ్చే విద్యాసంవత్సరంనుంచి యోగా కోర్సులను ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ నెల 9న వీసీలతో జరిగిన సమావేశంలో యోగాను పాఠ్యాంశంగా చేర్చాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూచించిన నేపథ్యంలో వర్శిటీలు కసరత్తు ప్రారంభించాయి. యోగావల్ల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత వస్తుందని, ఒత్తిడి నుంచి బయ టపడతారని ఆమె ఈ సందర్భంగా చెప్పిన విషయం తెలిసిందే. దసరా సెలవు లు ముగిసిన అనంతరం మరోసారి యూనివర్సిటీ వీసీలు, రిజిస్ట్రార్లతో తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనుంది. ఈ భేటీలో యోగాపై విస్తృతంగా చర్చిస్తారు. గతంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కూడా యోగాను పాఠ్యాంశంగా చేర్చాలని వర్సిటీలకు లేఖలు రాసింది.

యోగాకు రెండు క్రెడిట్స్

యూనివర్సిటీల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ పేరుతో ఇప్పటికే క్లాసులు తీసుకుంటున్నారు. వాటిలో యోగాను చేర్చాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే సాంప్రదాయక డిగ్రీ కోర్సులను అందిస్తున్న యూనివర్సిటీల్లో స్పెషల్ కోర్సులు ఆఫర్ చేసే అవకాశం ఉంటుందని, అందులో యోగాను చేర్చాలని భావిస్తున్నారు. పాఠ్యాంశంగా చేర్చడంతోపాటు యోగాకు రెండు క్రెడిట్స్‌ను కేటాయించాలనే ఆలోచన కూడా చేస్తున్నట్టు సమాచారం. అయితే ఈ మొత్తం ప్రక్రియను వీసీలు, రిజిస్ట్రార్లతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకొని వచ్చే ఏడాది నుంచి అమలు చేసే అవకాశం ఉంది.

ఎన్ఎస్ఎస్‌కు ప్రాధాన్యం

డిగ్రీ కాలేజీలతోపాటు, యూనివర్సిటీల్లోనూ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా వీసీల సమావేశంలో గవర్నర్ సూచించారు. గ్రామాలను దత్తత తీసుకొని ఎన్ఎస్ఎస్ ద్వారా చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఎన్ఎస్ఎస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తే కేంద్రం నుంచి కూడా నిధులు వస్తాయని వాటిని ఉపయోగించి గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని కూడా చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 యూనివర్సిటీల్లో ఎన్ఎస్ఎస్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటితోపాటు బిట్స్ పిలానీ, ఎన్ఐటీ, ఐఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లలో కూడా ఎన్ఎస్ఎస్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. మొత్తం 31 జిల్లాల్లోనూ విస్తరించి ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం 1398 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయి. 21 మంది ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు, 1398 మంది ప్రోగ్రామ్ ఆఫీసర్లు కొనసాగుతుండగా 1,39,800 మంది విద్యార్థి వాలంటీర్లు కమ్యూనిటీ సర్వీసులో అనుసంధానమై పనిచేస్తున్నారు. వీరి సేవలను గుర్తించి కేంద్రం సేవా పతకాలను కూడా వీరికి అందజేస్తోంది.

సదర్‌మాట్‌లో పడి ఇద్దరి గల్లంతు

ఖానాపూర్, ప్రభ న్యూస్ : నిర్మల్ జిల్లా, సదర్‌మాట్ కాలువలో సరదాగా చేపలు పట్టే క్రమంలో కాలు జారి ఇద్దరు కాలువలో పడి మృతిచెందిన ఘటన ఖానాపూర్ పట్టణంలో ఆదివారం జరిగింది. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఎడ్ల మహేశ్ (8), ఆయన స్నేహితుడు సాయినిఖిల్‌గౌడ్(10)లు అంబేద్కర్ నగర్ వద్ద సదర్‌మాట్ కాలువలోపలి భాగంలో ఉన్న మెట్లపై ఆదివారం సాయంత్రం ఒక గుడ్డ సాయంతో సరదాగా చేపలు వేటాడే ప్రయత్నం చేశారు. మెట్ల కొంత జారుడు ఉండడంతో చేపలను పట్టే క్రమంలో ఇద్దరు జారిపోయి కాలువలో పడిపోయారు. నీటిలో కొట్టుకుపోతున్న బాలుడిని పంబాల దినేశ్, చింటు, సురేశ్, చిన్ను, చందు, గుమ్ముల సురేశ్‌లు కాలువలో దూకి కాపాడారు. కానీ అప్పటికే మహేశ్ ఊపిరాడక నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా వారు చేసిన రోధనలు మిన్నంటాయి. మృతుని తండ్రి శ్రీధర్ బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాల్లో ఉంటున్నడు. కొడుకు మరణవార్త తెలియడంతో దుబాయి నుండి ఆయన స్వదేశానికి పయమైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కారు ఢీకొని దంపతుల దుర్మరణం

విషమ పరిస్థితుల్లో కుమార్తె - మైనర్ల రాష్ డ్రైవింగ్‌తో ముప్పు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హిమాయత్‌సాగర్ సర్వీస్ రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో దంపతులు దుర్మరణం పాలవ్వగా.. వారి కుమార్తె తీవ్రగాయాలతో నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నాగరాజు తన భార్య, కుమార్తెతో కలిసి ద్విచక్రవాహనంపై హిమాయత్‌సాగర్ నుంచి రాజేంద్రనగర్ వైపు వెళ్తున్నాడు. హిమాయత్ సాగర్ సర్వీసు రోడ్డు దగ్గరకు రాగానే అతి వేగంతో వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం గాల్లోకి ఎగిరి పల్టీలు కొట్టింది. ద్విచక్ర వాహనంపై ఎగిరిపడ్డ దంపతులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. నాగరాజు కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. కాగా, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకెళ్లింది. దీంతో కారులోని నలుగురు మైనర్లలో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో వారిని ఆసుపత్రిలో చేర్పించారు. నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజు కూతురు పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. మైనర్ బాలుడు మితిమీరిన వేగంతో కారు నడపడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులకు స్థానికులు వివరించారు.

ఈఎస్ఐ స్కాంలో ఫార్మాసిస్ట్ నాగలక్ష్మి అరెస్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈఎస్ఐ స్కాంలో ఏసీబీ మరింత దూకుడు పెంచింది. తాజాగా ఫార్మాసిస్ట్ నాగలక్ష్మిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఎనిమిది కోట్లకుపైగా మందుల కొనుగోళ్లలో నాగలక్ష్మి ప్రధాన పాత్ర పోషించినట్లు అధికారులు గుర్తించారు. నాగలక్ష్మితో పాటు చెన్నైకి చెందిన అరవిందర్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అరవిందర్‌రెడ్డి మందుల సరఫరాదారుగా పనిచేస్తున్నట్లు గుర్తించిన ఏసీబీ, బాలానగర్‌లోని అరవిందర్‌రెడ్డి కంపెనీలో సోదాలు నిర్వహించింది. పద్మ అనే అధికారితో కలిసి అరవిందర్‌రెడ్డి అక్రమాలకు పాల్పడినట్లు అధారాలు సేకరించింది. ఇప్పటివరకూ ఈ స్కాంకు సంబంధించి పది మందిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఈఎస్ఐ మందుల కొనుగోళ్లలో దాదాపు రూ.300 కోట్ల మేర స్కాం జరిగిందని గుర్తించారు.



పటేల్ విగ్రహం వద్ద దేవేగౌడ.. సంతోషంతో మోడీ ట్వీట్

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ గుజరాత్‌లోని పటేల్ భారీ విగ్రహాన్ని సందర్శించారు. 182 మీటర్ల ఎత్తయిన ఐక్యతా విగ్రహం వద్ద పటేల్‌కు నివాళి అర్పించారు. దేవెగౌడ గుజరాత్ పర్యటనను మోడీ స్వాగతించారు. పటేల్ విగ్రహం వద్ద మాజీ ప్రధానిని చూడటం చాలా సంతోషంగా ఉందంటూ ట్వీట్‌చేశారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ భారీ విగ్రహ నిర్మాణంపై ప్రకటన చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో దేశవ్యాప్తంగా ఉన్న 562 సంస్థానాలను భారత సమాఖ్యలో విలీనం చేయడంలో ఆయన కృషికి తగిన గుర్తింపు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తామని అప్పట్లో చెప్పారు. అనుకున్నట్లే ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గతేడాది అక్టోబర్‌లో సర్దార్ పటేల్ 143వ జయంతిని పురస్కరించుకుని కేవాడియాలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన విగ్రహాన్ని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. గతనెల 17న పటేల్ జయంతి నాడు ప్రధాని ఈ స్టాట్యూని సందర్శించి, నివాళి అర్పించారు. ఇప్పటి వరకు ఈ విగ్రహాన్ని 23లక్షల మంది సందర్శించినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి.

ఘనత చాటింపెయ్యాలి

అప్పుడే భారతీయ వర్సిటీలకు గ్లోబల్ ర్యాంకులు: క్యూఎస్

న్యూఢిల్లీ: భారతీయ యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలు అంతర్జాతీయ సూచీల్లో అగ్రశ్రేణి ర్యాం కులను దక్కించుకునే దిశగా కృషి చేయాలని, ఈ మేర కు తమ ఘనత గురించి సొంతంగానే బాకా ఊదుకోవ డం మొదలుపెట్టాలని క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్ సంస్థ సూచించింది. విద్యా ఫ లితాలు, పరిశోధన అంశాలప రంగా భారత్‌లో అద్భుతమైన యూనివర్సిటీలు, సంస్థలు ఉన్నాయి. కానీ ఎంతమంది అంతర్జాతీయ విద్యార్థులకు ఈ విషయాలు తెలుసు?. ఉత్తమమైన ర్యాంకుల్లో నిలిస్తే యూనివర్సిటీల గురించి అంతర్జాతీ య విద్యార్థులు తెలుసుకుంటారు. అంతేకాకుండా ఏ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు ఏయే కోర్సులను అందిస్తున్నాయనే విషయాలను విద్యార్థులు గుర్తించేం దుకు వీలుంటుందని క్యూఎస్ ర్యాంకింగ్ సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ అశ్విన్ ఫెర్నాండేస్ సూచించారు. ప్రచారం లేకపోవడం కారణంగానే భారత్ ర్యాంకులు సాధించలేకపోతుం దన్నారు. అంతర్జాతీయంగా అగ్రస్థానంలో నిలిచే సత్తా భారత్‌కు ఉంది. అయితే ఏడాది ఏడాదికీ భారతీ య వర్సిటీల ర్యాంకులు పడిపోవడం నిరుత్సాహం కలిగిస్తోంది. ఈ ప్రక్రియలో కొన్ని వర్సిటీల పేర్లు మా త్రమే నమోదవుతున్నాయని ఫెర్నాండేస్ వివరిం చారు. భారత్‌లోని ప్రఖ్యాతిగాం చిన వర్సిటీలు అంతర్జాతీయ స్థాయి ర్యాంకుల్లో స్థానాల్లో ర్యాంకులు దక్కించుకోకపోవడంపై క్యూఎస్‌కు చెందిన అధికారులతో మానవవనరుల మంత్రిత్వశాఖ సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది.

పీవోకేలో భూకంపం.. ఒకరి మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లోని మీర్పూర్‌లో ఆదివారం ఉదయం భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేలుపై 3.8గా నమోదైన భూకంపం కారణంగా ఇల్లు కూలిపోవడంతో ఒకరు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరు గాయపడ్డారు. మీర్పూర్ మరియు పరిసర ప్రాంతాలు ఆదివారం 10.28 గంటలకు రెండు మూడు సెకన్లు ప్రకపంనలు వచ్చాయని పాకిస్థాన్ వాతావరణ శాఖ తెలిపింది. భూకంపం వల్ల ఇల్లు కూలిపోయి ముగ్గురు శిథిలాలు కింది చిక్కుకుపోయారని రెస్క్యూ వర్గాలు తెలిపాయి. వారిలో ఒకరు ప్రాణాలు కోల్పోగా గాయపడిన ఇద్దరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు. ఇస్లామాబాద్, రావల్పిండి, ముర్రీ, జీలం, చార్సద్దా, స్వాత్, ఖైబర్, అబోటాబాద్, బజౌర్, నౌషెరా, మన్సెరా, బటగ్రామ్, తోర్ఘర్, కొహిస్థాన్‌లో కూడా ప్రకంపనలు సంభవించాయని వాతావరణశాఖ వెల్లడించింది.

ఆస్కార్‌కు నామినేట్ అయిన ఉత్తరాఖండ్ రైతు డాక్యుమెంటరీ

న్యూఢిల్లీ: ఢిల్లీకి చెందిన దర్శకుడు నిర్మల్ చందర్ ఉత్తరాఖండ్‌లోని ఓ కుగ్రామం సంగౌరాకు చెందిన రైతుపై తీసిన డాక్యుమెంటరీ మోతీబాగ్ ఆస్కార్‌కు నామినేట్ అయింది. 83ఏళ్ల విద్యుదత్ శర్మ అనే రైతు జీవితాన్ని కథాంశంగా ఆయన మేనల్లుడు నిర్మాత, దర్శకుడు నిర్మల్ చందర్ డాక్యుమెంటరీ తీశారు. శర్మ జీవితాన్ని, స్వభావాన్ని కవితల రూపంలో వివరించిన డాక్యుమెంటరీ ఇటీవల పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టింగ్ ట్రస్ట్(పీఎస్బీటీ) ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. ఈ ఏడాది జూన్‌లో కేరళలో జరిగిన ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ అండ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డును గెలుచుకున్న చిత్రాలులో మోతీ బాగ్ ఒకటికాగా రెండోది పంకజ్ రిషికుమార్ తీసిన జనని జూలియట్. 2020లో జరిగే 92వ అకాడమీ అవార్డులకు ఈ రెండు డాక్యుమెంటరీలకు డైరెక్ట్ ఎంట్రీ లభించిందని నిర్వాహకులు తెలిపారు. మోతీ బాగ్ వ్యక్తిగత, సామాజిక కథ. గ్రామీణ ఉత్తరాఖండ్‌ను పీడిస్తున్న అనేక సమస్యలతోపాటు ప్రధానంగా పీడిస్తున్న సామూహిక వలసను ఇతివృత్తంగా తీసుకుని మోతీ బాగ్ డాక్యుమెంటరీ చిత్రీకరించారు.

రాఫెల్ వచ్చేస్తోంది

- రేపు భారత్‌కు తొలి రాఫెల్ జెట్ ఫైటర్
- పారిస్‌లో ఆయుధ పూజ చేయనున్న రాజ్‌నాథ్
- ఫ్రాన్స్‌తో ఒప్పందం ప్రకారం భారత్‌కు 36 ఫైటర్ జెట్లు
- రాఫెల్ కోసం రూ.58వేల కోట్లు వెచ్చిస్తున్న భారత్

పారిస్ : భారత్ అమ్ముల పొదిలోకి మరో అత్యాధునిక అస్త్రం వచ్చి చేరబోతోంది. శత్రు దేశాల వెన్నులో వణుకు పుట్టించేలా రూపుదిద్దుకున్న రాఫెల్ ఫైటర్ జెట్‌ను పారిస్‌లో రేపు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అందుకోబోతున్నారు. అంతకు ముందే రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఫ్రాన్స్‌లోనే రాఫెల్‌కు ఆయుధ పూజ చేస్తారు. హోంశాఖ మంత్రిగా ఉన్నప్పటి నుంచీ ప్రతీ ఏడాది దసరాకు ఆయుధ పూజ చేస్తున్న రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తుతం రక్షణ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఫ్రాన్స్ నుంచి అందుకునే తొలి రాఫెల్ యుద్ధ విమానానికి అక్కడే రాజ్‌నాథ్ ఆయుధ పూజ చేస్తారు. మూడు రోజుల పారిస్ పర్యటనకు బయలుదేరి వెళ్లిన రాజ్‌నాథ్ సింగ్.. భారత్ - ఫ్రాన్స్ ఒప్పందం ప్రకారం తొలి విడతగా ఫ్రాన్స్ అందించనున్న రాఫెల్ యుద్ధ విమానాన్ని మంగళవారం స్వీకరిస్తారు. రాఫెల్ జెట్‌ను స్వీకరించిన తర్వాత రాజ్‌నాథ్ సింగ్ ఆ విమానంలోనే పారిస్‌లోని ఫ్రెంచ్ ఎయిర్‌బేస్ నుంచి ప్రయాణించి రాఫెల్‌లో తొలి అనుభవాన్ని గడిస్తారు. వచ్చే ఏడాది మే నాటికి నాలుగు రాఫెల్ యుద్ధవిమానాలను అందించనున్నట్లు ఫ్రాన్స్ తెలిపింది. రాఫెల్ యుద్ధవిమానాన్ని భారత్‌కు అప్పగించే కార్యక్రమంలో ఫ్రాన్స్ టాప్ మిలిటరీ అధికారులు, రాఫెల్ తయారు చేసిన దసాల్ట్ ఏవియేషన్ కంపెనీ ఉన్నతాధికారులు కూడా హాజరౌతారు. భారత వాయుసేన ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరై రాఫెల్ ఫైటర్ జెట్‌ను పరిశీలిస్తారు. ఈనెల 9న రాజ్‌నాథ్ సింగ్ ఫ్రాన్స్ రక్షణ శాఖ మంత్రితో భద్రత, రక్షణ ఒప్పందాలకు సంబం ధించిన అంశాలపై చర్చలు జరుపుతారు. వాయుసేన ను మరింతగా బలోపేతం చేసేందుకు భారత ప్రభుత్వం 2016లో ఫ్రెంచ్ కంపెనీ దసాల్ట్ ఏవియేషన్ తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం ఫ్రాన్స్ నుంచి భారత్ 36 యుద్ధ విమానాలను రూ.58 వేల కోట్లకు కొనుగోలు చేస్తోంది. రాఫెల్ యుద్ధ విమానం సమర్థవంతమైన ఆయుధాలను, క్షిపణుల ను మోసుకెళ్లి..నిర్దేశించిన లక్ష్యాలను చేధించగలదు. రాఫెల్ యుద్ధ విమానాన్ని నడిపే పైలెట్లకు అవసరమైన శిక్షణను కూడా ఇప్పిం చారు. ఫైటర్ జెట్ భారత్‌లో తొలి అడుగు హర్యానాలోని అంబాలా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో పెట్టనుంది. భారత్ - పాకిస్థాన్ సరిహద్దుకు 220 కి.మీ దూరంలో ఉన్న ఈ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వ్యూహాత్మక దాడులకు అత్యంత అనువైనది. రాఫెల్ రెండో యుద్ధవిమానాన్ని పశ్చిమ బెంగాల్‌లోని హస్మరా ఎయిర్ బేస్‌లో ఉంచుతారు.

మునుపెన్నడూ లేని సామర్థ్య యుద్ధవిమానం

ఇజ్రాయెల్ హెల్మెట్ మౌంటెడ్ డిస్ప్లే, రాడార్ వార్నింగ్ రిసీవర్లు, తక్కువ బ్యాండ్ వద్ద కూడా పనిచేసే జామర్లు, 10 గంటల పాటు డేటాను నిక్షిప్తం చేసుకునే సామర్థ్యం, ఇన్ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాకింగ్ సిస్టమ్స్ వంటి ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంది. భారత దేశం మునుపెన్నడూ లెనివిధంగా యుద్ధ సామర్థ్యాన్ని సాధించబోతోందని ఎంబీడీఏ ఇండియా చీఫ్ లోయిక్ పీడెవష్ అన్నారు. స్కల్ప్, మిటియెర్ క్షిపణులు ఆట తీరును సమూలంగా మార్చే సాధనాలు అవుతాయని చెప్పారు. ఈ విమానాలకు అత్యాధునిక, అత్యంత మేలైన ఆయుధాలను అమర్చుతున్నట్లు తెలిపారు.

అమెరికాలో కాల్పులు.. నలుగురు మృతి

వాషింగ్టన్: అమెరి కాలో మరోసారి కాల్పు ల కలకలం రేగింది. ఓ అగం తకుడు తుపాకీ గురిపెట్టి విచక్షణా రహితంగా కాల్పు లకు తెగబడ్డాడు. ఈ సంఘ టన కాన్సాస్ నగరంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6.30 గంటలకు ఈ దుర్ఘటన జరిగింది. సిటీలోని టెక్విలా కేసీ బార్‌లోకి ప్రవేశించిన దుండగుడు తుపాకీతో రెచ్చిపోయాడు. వెంటవెంటనే తొమ్మిది మందిపై కాల్పులు జరిపాడు. వీరిలో నలుగురు మరణించారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలకు గురయ్యారు. కాల్పుల అనంతరం దుండగుడు అక్కడి నుంచి పరారయ్యాడని కాన్సాస్ పోలీసు అధికారులు వెల్లడించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు కారణం ఏమిటన్నది తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి హ్యాండ్ గన్ బుల్లెట్ కవచాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో ఒక్కరే పాల్గొన్నారా? మరికొందరు ఉండివుంటారా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు

పోలీసులు తెలిపారు. బార్‌లోని సీసీ ఫుటేజీలతోపాటు, పరిసర ప్రాంతాల్లోని నిఘా ఫుటేజీలను పరిశీలిస్తున్నామని దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కాంగ్రెస్‌కు దారేదీ?

- మహారాష్ట

బ్యాంకాక్‌కు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బ్యాంకాక్ వెళ్లడం చర్చనీయాంశం అయ్యింది. రాహుల్ పర్యటనపై బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. 'అటు బంగాళ దుంపలు వేస్తే.. ఇటు బంగారం బయటికి వస్తుంది', 'మోబైల్స్ మేడ్ ఇన్ ఔరంగాబాద్' వంటి ప్రకటనలు ఎవరు చేస్తారంటూ ఎద్దేవా చేసింది. ముంబైలో పార్టీ ఘోరంగా ఓడిపోతుందని, డిపాజిట్లు కూడా గల్లంతు అవుతాయని, పార్టీ ఇలాగే వ్యవహరిస్తే కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని ముంబై మాజీ చీఫ్ సంజయ్ నిరుపమ్ హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా రాహుల్ బ్యాంకాక్ టూర్‌కు వెళ్లడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బీఎస్ఎఫ్ వింగ్ కమాండర్ రాజీనామా

న్యూఢిల్లీ: తన పైఅధికారిలా నటించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయాణించిన విమానాన్ని నడిపి క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) పైలెట్ వింగ్ కమాండర్ జేఎస్ సంగ్వాన్ తన సర్వీస్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు సెప్టెంబర్ 2న తన రాజీనామా లేఖను పంపించారు. ఆమోదించే విషయం ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. సంగ్వాన్‌పై డిపార్ట్‌మెంటల్ విచారణ జరుగుతోంది. ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని బీఎస్ఎఫ్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. అయితే అక్టోబర్ 31 నుంచి వీఆర్ఎస్ కావాలంటూ సంగ్వాన్ కోరారని బీఎస్ఎఫ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు సెప్టెంబర్ 2, 16 తేదీల్లో 2 సార్లు పిటిషన్లు పంపించారని చెబుతున్నారు. బీఎస్ ఎఫ్‌కు చెందిన వీఐపీలు ప్రయాణించే విమానాన్ని ఇంజనీరింగ్ దిగ్గజం ఎల్ అండ్ టీ సమకూర్చుతోంది. కాబట్టి వీఐపీ ప్రయాణించేటప్పుడు పైలెట్ అనుభవాన్ని చెప్పాల్సింది కూడా ఎల్ అండ్ టీ సంస్థనే.

నిషేధాజ్ఞలేవీ!

ప్లాస్టిక్ నిషేధంపై కేంద్రం వెనకడుగు

- మాంద్యం వేళ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్‌తో పెను ప్రభావం
- లక్షలాది ఉద్యోగాలు ఊడే ప్రమాదం
- ఆందోళనల నేపథ్యంలో పున: సమీక్ష
- 2022 నాటికి ప్లాస్టిక్ అంతమే లక్ష్యమని గాంధీ జయంతి నాడు ప్రధాని మోడీ ఉద్ఘాటన

న్యూఢిల్లీ: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై సమరశంఖం పూరించి.. ప్లాస్టిక్ వ్యర్థరహిత భారతే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఒకేసారి నిషేధం విధిస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ ప్రభుత్వం మనసు మార్చుకుంది. మహాత్మగాంధీ 150వ జయంతోత్సవాల ముగింపు సందర్భంగా అక్టోబర్ 2 నుంచి నిషేధం అమల్లోకి వస్తుందని భావించినారాలేదు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కొత్తగా నిషేధాజ్ఞలు ఏవీ జారీ కాలేదని, పాత ఆంక్షలే కొనసాగుతున్నాయని పర్యావరణం విభాగం సెక్రటరీ చంద్రకిశోర్ మిశ్రా వెల్లడించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డ్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి కూడా ఇదే విషయాన్ని వివరించారు. దశల వారీగా 2022 నాటికి భారత్‌ను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితదేశంగా రూపాంతరం చెందిస్తామని ప్రధాని మోడీ గుజరాత్ వేదికగా గాంధీ జయంతి నాడు ప్రతిన చేశారు. ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాలు, జీ-7, ఇతర అంతర్జాతీయ వేదికలపై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై మాట్లాడిన ప్రధాని మోడీ వెనక్కి తగ్గడానికి ప్లాస్టిక్ పరిశ్రమను నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనలే కారణం. చాకోలెట్లు, బిస్కెట్లు, చిప్స్, గుట్కా, పాలు, షాంపూ... ఇలా ఒకటేమిటి ప్లాస్టిక్ వినియోగంలేని ఉత్పత్తుల నుదాదాపుగా ఊహించలేని రోజులివి. ఇలాంటి పరిస్థితుల్లో తగిన ప్రత్యామ్నాయం లేకుండా దేశవ్యాప్తంగా ఒకేసారి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తే ఆర్థికరంగం పలు సమస్యలు ఎదుర్కోవాల్సివుంటుందని ప్లాస్టిక్ పారిశ్రామికరంగం నుంచి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ ప్రతిపాదనలతో ఉద్యోగాలు ఊడి పోతాయోమోననే భయాందోళనల పెరిగాయి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నిర్వచనం ఏంటో తెలపకుండా నిషేధం విధించాలన్న నిర్ణయాన్ని ప్లాస్టిక్ పారిశ్రామికవర్గం తప్పుబట్టింది. దీంతో ఒకవైపు ఆశయం, మరోవైపు పర్యావరణహితం కోరుకున్నా నిస్సహాయస్థితిలో ప్రభుత్వం వెనుకడుగువేస్తోంది. దీంతో ఒకేసారి నిషేధం విధించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పునఃసమీక్షించుకుంది.

ఉద్యోగాలు ఊడుతాయనే ఆందోళన

తగిన ప్రత్యామ్నాయం లేకుండా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై దేశవ్యాప్తంగా ఒకేసారి నిషేధం విధిస్తే ప్లాస్టిక్ పరిశ్రమలో ఉద్యోగాలు ఊడుతాయని ఆ రంగానికి చెందిన నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మొత్తం 50 వేలకు పైగా ప్లాస్టిక్ తయారీ పరిశ్రయ యూనిట్ల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. 40-50 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని ఆల్ ఇండియా మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు హితెన్ భేదా ఆందోళన వ్యక్తం చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై దేశవ్యాప్తంగా ఒకేసారి నిషేధం విధిస్తే దాదాపు 10 వేలకు పైగా పరిశ్రమ యూనిట్లు మూతపడతాయి. 5 లక్షల మందికిపైగా ఉద్యోగాలు కోల్పోతారని అంచనా వేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై దేశ వ్యాప్తంగా ఒకేసారి నిషేధం అంశంలో స్పష్టమైన విధానంలేదని ప్రభుత్వం గ్రహించిందని ఆయన అన్నారు. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అంటే ఏంటో కూడా ప్రభుత్వం వివరించలేదని ఆయన పేర్కొన్నారు.

స్పష్టమైన విధానం ఉండాలి

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించాలనుకుంటున్న ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని ప్లాస్టిక్ పరిశ్రమకు చెందిన వర్గాల సూచిస్తున్నాయి. ఇప్పటికే ఆయా వర్గాలు పలుదఫాలుగా ప్రభుత్వ పెద్దలతో సమావేశమైన తమ ఆందోళనలను వినిపించాయి. ప్లాస్టిక్ నష్టాలు తమకూ తెలుసునని, అయితే విధానంలో స్పష్టంగా లేకుండా అడుగులు వేస్తే నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుందని ఆయా వర్గాలు వాపోతున్నాయి. ఈ మేరకు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డ్‌తో సమావేశమయ్యామని చెబుతున్నారు. స్పష్టమైన విధానంతో దశల వారీగా నిషేధాన్ని అమలుపరచేవిధంగా ముందుకురావాలని కోరుతున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్వచించలేదు

దేశవ్యాప్తంగా నిషేధాన్ని అమలు చేయాలనుకున్నా ప్రభుత్వం ఇంతవరకు అసలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అంటే ఏంటో నిర్వచించలేదు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి, నిషేధం అమలుకు క్షేత్రస్థాయిలో ఎలాంటి కసరత్తులు చేయలేదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్‌కు చెందిన స్వాతి సింగ్ సమ్యాల్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడానికి సంబంధించిన మార్గదర్శకాలు మా వద్ద లేవు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు నిర్మాణాత్మకమైన ప్రణాళికలు లేవు. నిషేధానికి సంబంధించి క్షేత్రస్థాయిలో సరైన కసరత్తు జరగలేదు. ప్లాస్టిక్ నిషేధించాలంటే మూడు ప్రాథమికమైన చర్యలు ఉన్నాయి. మొదటిగా రిసైకిల్ చేయలేని వస్తువుల జాబితా సిద్ధం చేయాలి. వాటికి ప్రత్యామ్నాయం ఏంటో ఆలోచించారు. ప్రత్యామ్నాయం ఉంటే నిషేధాన్ని అమలు చేయవచ్చు. లేదంటే ప్లాస్టిక్ పరిశ్రమ తీవ్రంగా దెబ్బతింటుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తం 15-16 లక్షల మందికి ఈ పరిశ్రమతో సంబంధం ఉంది. వ్యవసీర్ధృత తరంగంలో 3,500 పరిశ్రమ యూనిట్లు, అవ్యవసీర్ధృతరంగంలో మరో 4000 పరిశ్రమ యూనిట్లు ఉంటాయని ఆమె అంచనావేశారు. లేదంటే విపరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, ప్రభుత్వం తమను అర్థం చేసుకుని ముందుకు రావాలని వారు కోరుతున్నారు.

ఎఫ్ఐసీసీఐ సమాచారం ప్రకారం..

ఆర్థిక వ్యవస్థలో రంగాల వారీగా వినియోగం

ప్యాకేజింగ్	35 శాతం
భవనాలు, నిర్మాణరంగం	23 శాతం
రవాణా	8 శాతం
ఎలక్ట్రానిక్స్	8 శాతం
వ్యవసాయరంగం	7 శాతం
ఇతర రంగాలు	19 శాతం

ఆగస్టు 15 తర్వాత పలు చోట్ల నిషేధాలు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రధాని నరేంద్రమోడీ ఆగస్టు 15న ప్రకటించిన తర్వాత పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విభాగాలు స్వచ్ఛందగానే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించాయి. ఒడిశాలోఈ అక్టోబర్ 2 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం అమల్లోకి వచ్చింది. ఈ మేరకు సెప్టెంబర్ 29, 2018నే ఒడిశా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒడిశాతోపాటు మహారాష్ట్ర, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడుల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం కొనసాగుతోంది.

ఫిక్కీ ఆందోళన

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై దేశవ్యాప్తంగా ఒకేసారి నిషేధం విధిస్తే ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసీసీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర విధానాలను అనుసరించాల్సిన అవసరం ఉంటుంది. రూ. 5 కంటే తక్కువ ధరకే లభించే షాంపూ, డిటర్జెంట్, బిస్కెట్లు, ఇతర ఉత్పత్తులు కనిపించవని ఫిక్కీ అధ్యయనం పేర్కొంది. గ్రామీణ ప్రాంతంలో ఈ మార్కెట్ అధికమని పేర్కొంది. రూ.53 వేల కోట్లకు పైగా ప్లాస్టిక్ తయారీ వ్యాపారం దెబ్బతింటుంది. తద్వారా ఉద్యోగాలు ఊడుతాయని ఫిక్కీ ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తం 10 వేల సంస్థల్లో 13 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోతారని అంచనా వేసింది. ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ ఆదాయం రూ.90 వేల కోట్లు పడిపోతుందని వివరించింది.

అభినందన్ స్క్వాడ్రాన్‌కు 'యూనిట్ సైటేషన్'

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చివేయడంలో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించిన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ బృందానికి అరుదైన గౌరవం లభించింది. ఆయన బృందం మొత్తానికి 51వ స్క్వాడ్రన్‌కు 'యూనిట్ సైటేషన్' అవార్డు దక్కింది. బాలాకోట్ ఉగ్రవాద శిబిరాలపై భారత్ సైన్యం దాడి చేసిన తరువాత ప్రతీకార ధోరణిలో పాకిస్తాన్ ఫిబ్రవరి 27న భారత్‌పై వాయుదాడులకు ప్రయత్నించినప్పుడు ఆ దేశానికి చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాన్ని వింగ్ కమాండర్ అభినందన్ కుప్పకూల్చాడు. ఈ నేపథ్యంలో ఎయిర్ ఫోర్స్ డే వేడుకల్లో 51వ స్క్వాడ్రాన్ తరపున గ్రూప్ కెప్టెన్ సతీష్ పవార్ 'యూనిట్ సైటేషన్' అవార్డు అందుకోనున్నారు. ఎయిర్ చీఫ్ మార్షల్ రాకేష్ కుమార్ సింగ్ బదౌరియా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

కోల్‌కతాలో 'బాలాకోట్' మండపం

పశ్చిమ బెంగాల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు దేశ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. భారీ మండపాలను సైతం నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కోల్‌కతాలోని ఓ మండపం అందరినీ ఆలోచింపజేస్తోంది. బాలాకోట్ వైమానిక దాడులకు సంబంధించిన సెట్టింగ్.. ఏర్పాటు చేసిన వారికి భారత్‌పై ఉన్న ప్రేమను చాటి తెలియజేస్తోంది. దుర్గాదేవితో పాటు అభినందన్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు. యంగ్ బాయ్స్ క్లబ్ సార్వజనిక్ దుర్గ పూజా కమిటీ మధ్య కోల్‌కతాలో బాలాకోట్ దాడులకు సంబంధించిన మండపాన్ని ఏర్పాటు చేసింది. కమిటీ 50వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ మండపంలో జైషే మహ్మద్ క్యాంపును కూడా ఏర్పాటు చేశారు.

హసీనా ఆత్మవిశ్వాసమే నాకు ప్రేరణ

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనాను కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ప్రశంసలతో ముంచెత్తారు. హసీనా ధైర్య సాహసాలే తనకు ప్రేరణ అని వ్యాఖ్యానించారు. భారత్‌లో పర్యటించిన బంగ్లాదేశ్ ప్రధాని ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీలతో ప్రత్యేకంగా భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. హసీనాను చూడగానే ప్రియాంక గాంధీ గట్టిగా హత్తుకున్నారు. తమ భేటీకి సంబంధించిన వివరాలను ట్విట్టర్ వేదికగా పంచుకున్న ప్రియాంకా గాంధీ.. తాను హసీనాను కలవడం ఇది రెండోసారి అని.. ఈ భేటీ ఎప్పుడో జరగాల్సిందని వ్యాఖ్యానించారు.షేక్ హసీనా తన కుటుంబ సభ్యులను కోల్పోయిన తర్వాత ధైర్యం, ఆత్మవిశ్వాసంతో అనేక కష్టాలను అధిగమించి పట్టుదలతో బంగ్లా ప్రధానిగా ఎన్నికయ్యారని కితాబిచ్చారు.

కుమార్తెను కొట్టిచంపిన నర్సు

కొల్లం: తినేందుకు నిరాకరించిన నాలుగేళ్ల బాలికను ఆమె తల్లి తీవ్రంగా కొట్టడంతో బాలిక ఆదివారం మరణించిందని కేరళలోని కొల్లం జిల్లా పోలీసులు తెలిపారు. తల్లి చేతిలో తీవ్రంగా గాయపడిన బాలికను ఆసుపత్రికి తరలించగా అక్కడ తుదిశ్వాస విడిచిందన్నారు. నర్సుగా పనిచేస్తున్న ఆమె తల్లిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు పోలీసులు మీడియాకు తెలిపారు. చిన్నారి శరీరంపై గాయాల గుర్తులు ఉన్నాయని దర్యాప్తు కొనసాగుతందన్నారు. బాలిక తండ్రిని కూడా విచారిస్తున్నట్టు కొల్లం పోలీసులు తెలిపారు.

14 ఏళ్లలో 6హత్యలు

కోజికోడ్: కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఓ క్యాథలిక్ కుటుంబంలో 2002 నుంచి 2016 మధ్య జరిగిన సీరియల్ మరణాల కేసును కేరళ క్రైమ్‌బ్రాంచ్ పోలీసులు పరిష్కరించారు. దర్యాప్తులో భాగంగా ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు అనుమానాస్పదంగా మరణించడంతో పోలీసులు అక్టోబర్ 4న వారి సమాధులను తెరిచారు. 14సంవత్సరాల్లో పొన్నమట్టం కుటుంబానికి చెందిన ఒకరి తరువాత ఒకరు ఆరుగురు మృతిచెందారు. హత్యలు చేయడానికి సైనైడ్‌ను సరఫరాచేసిన మృతుల కుటుంబానికి చెందిన కుమార్తె జాలీ,ఆమె రెండవభర్త షాజు, మరో దూరపు బంధువును పోలీసులు అరెస్టు చేశారు. రిటైర్డ్ టీచర్ అన్నమ్మ థామస్ (57) 2002లో మరణించారు. కుటుంబం సహజ మరణంగా భావించింది. ఆరుసంవత్సరాలు తరువాత ఆమె భర్త టామ్ థామస్ (66) గుండె వైఫల్యంతో మరణించారు. 2011లో వారి కుమారుడు రాయ్ థామస్ (40) కూడా అదేవిధంగా మరణించడంతో శవపరీక్ష నివేదికలో విషప్రయోగం బయటపడింది.

స్పేస్ టెక్నాలజీలో స్టార్టప్‌ల దూకుడు

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా అంతరిక్షప్రయోగాలు వేగవంతమైన నేపథ్యంలో, చిన్న ఉపగ్రహాలు, తక్కువ ఖర్చుతో కూడిన ఉపగ్రహాలకు మంచి డిమాండ్ ఏర్పడింది. తేలికపాటి ఉపగ్రహాల తయారీ దిశగా అడుగేస్తున్న అంకుర సంస్థలకు ఇబ్బడిముబ్బడిగా అవకాశాలు లభిస్తున్నాయి. స్పేస్ టెక్నాలజీలో ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు కొన్ని గుర్తింపుపొందిన ప్రైవేటు సంస్థలకు ప్రముఖ స్థానం లభిస్తోంది. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం స్పేస్ టెక్నాలజీలో 15-20 అంకుర సంస్థలు అమోఘమైన సేవలు అందిస్తున్నాయి. పేలోడ్స్, ఉపగ్రహ వాహకనౌక తయారీని మరింత చౌకగా మార్చేందుకు ఈ సంస్థలు వినూత్న పరిష్కారాలు అన్వేషిస్తున్నాయి. ఇందులో కొన్ని సంస్థలు అడ్వాన్స్‌డ్ ప్రొపల్సన్ వ్యవస్థ పూర్తిస్థాయి టెక్ ప్లాట్‌ఫారమ్‌లు నెలకొల్పడంలో విశేష గుర్తింపు పొందాయి. ఇతర అంకుర సంస్థల కంటే స్పేస్‌టెక్నాలజీ కంపెనీల్లోకి గతమూడేళ్లలో పెట్టుబడులు మూడింతలు పెరిగాయి. ఈ యేడాదిలోనే సుమారు 4 మిలియన్ డాలర్ల విలువైన ఐదు ఒప్పందాలు కుదిరాయంటే వీటి సామర్థ్యమేంటో తెలిసిపోతుంది.

నైజీరియాలో 344ఏళ్ల తాబేలు మృతి

లాగోస్: నైరుతీ నైజీరియాలోని సంప్రదాయ రాజ్యాధినేత ఒగ్బోమోషో ప్యాలెస్‌లో 344సంవత్సరాల వయసున్న తాబేలు అలగ్బా మృతిచెందినట్టు అధికార ప్రతినిధి శనివారం తెలిపారు. జంతుశాస్త్ర నిపుణులు తాబేలు వయసుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేసినప్పటికీ రాజప్రతినిధులు మాత్రం అలగ్బా అంటే ఎల్డర్ అని అర్థమని తాబేలు ప్యాలెస్‌లో శతాబ్దాలుగా నివసిస్తుందని తెలిపారు. అలగ్బా గురువారం స్వల అనారోగ్యానికి గురై అనంతరం మృతిచెందిందని కింగ్ జిమో ఓయువున్మి వ్యక్తిగత సహాయకుడు తోయిన్ అజాము మీడియాకు తెలిపారు.

నిజాం నిధులకు 120 వారసులు

120 మంది

- మరోన్యాయపోరాటానికి సిద్ధమైన మనవళ్లు
- పాక్‌వాటా లేదని తేలడంతో కొత్త వివాదం

న్యూఢిల్లీ: నిజం నిధుల వివాదం మరో మలుపు తిరిగింది. హైదరాబాద్ చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 70 ఏళ్ల క్రితం బ్రిటన్‌లోని వెస్ట్ మినిస్టర్ బ్యాంక్‌లో జమ చేసిన రూ.280 కోట్ల భారత్‌లోని ఆయన మనవళ్లకే సంక్రమిస్తుందని ఇటీవల బ్రిటన్ హైకోర్టు తీర్పునివ్వడంతో 120 మంది తామే నిజాం మనవళ్లమంటూ తెరపైకి వచ్చారు. నిజాం ఆస్తుల్లో తమకు వాటా కావాల్సిందేనని అవసరమైతే.. న్యాయపోరాటానికి దిగుతామని స్పష్టంచేశారు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ బ్యాంక్‌లో దాచిన నిధులు ఆయన తర్వాత నామమాత్రపు నిజాంగా ఉన్న ముకర్రం ఝూ బహదూర్‌కు చెందుతాయని కొన్ని పత్రాల్లో ఉండటంతో నిజాం మనవళ్లు తామే నిజమైన వారసులమని అంటున్నారు. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ మనువళ్లలో ఒకరైన నవాబ్ నజఫ్ అలీ ఖఆన్ మీడియాతో మాట్లాడుతూ వెస్ట్ మినిస్టర్ బ్యాంక్‌లో ఉండిపోయిన నిజాం డబ్బు, ఆభరణాలను వెనక్కి తీసుకోవాలంటే అందుకు అవసరమైన పత్రాలు చూపించాల్సి ఉందని.. బ్యాంకు రికార్డులను పరిశీలించి.. చర్చలు జరిపిన తర్వాత అసలు వారసులెవరనేది తేలుతుందన్నారు. బ్యాంకు ద్వారా సమస్య పరిష్కారం కాకుంటే.. మళ్లీ కోర్టుకెక్కుతామని తెలిపారు. నిజాం మనవళ్లుగా చెప్పుకుంటున్న ఇద్దరు 2013 వరకు ఎక్కడున్నారు. నిజాం వారసుడిగా ఆయన నిధుల కోసం 2016 వరకు పోరాటం చేశా. అప్పటి వరకు నిజాం ఆస్తులపై పోరాటానికి న్యాయవాది కూడా ఉన్నారు. నిజాం ఎస్టేట్‌పై ఉమ్మడి పోరాటం చేస్తూ వచ్చారు. ఇప్పుడు వారసులమం టున్న 120 మందిలో చాలామంది నిజాం ఎస్టేట్, భారత ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందంలోని వారే. నిజాం పేరుతో ఉన్న బ్యాంకు నిధులు వారందరికీ పంపిణీ చేయనున్నట్లు గత ప్రభుత్వాలు హామీ ఇచ్చాయని పేర్కొన్నారు.

పాక్‌హై కమిషనర్‌కు నిధుల బదిలీతో వివాదం

1948లో పొందుపరిచిన విధంగానే యజమానే లబ్దిదారుగా ఉంటారని, 7వ నిజాంకే యాజమానత్వం దక్కుతుందని బ్రిటన్ హైకోర్టు ఈనెల 2న సంచలన తీర్పునిచ్చింది. 7వ నిజాం ప్రయోజనాల కోసమే ట్రస్టు, వారసుల పేరు మీదుగా నిర్వహించారని.. అప్పటి నుంచి నిధుల నిర్వహణ జరుగుతోందని కోర్టు స్పష్టం చేసింది. ఈ నిధులపై భారత్, నిజాం ఇద్దరు మనువళ్లకు హక్కులు ఉంటాయని కోర్ట్ స్పష్టంగా తీర్పునిచ్చింది. దాదాపు 70 ఏళ్ల క్రితం జరిగిన డాక్యు మెంటేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన యూకే హైకోర్టు .. హైదరాబాద్ నిజాం సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు ఆపరేషన్ పోలోకు ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 1948లో ప్రణాళికలు రచిస్తున్నసయమంలో అప్పటి నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ ఆర్థిక మంత్రి మోయిన్ నవాజ్ జంగ్ 10,07,940 పౌండ్లను యూకేలోని అప్పటి పాక్ హైకమిషనర్ రహీంతుల్లా ఖాతాలోకి ఈ నిధులను బదిలీ చేశారు.

జంతు ప్రేమికులకు ఆదర్శంగా కోచి దంపతులు

కొచ్చి: కేరళ కొచ్చిలోని మట్టంచెరిలో నివసిస్తున్న ఉష్మా షా ఆమె భర్త దినేష్ మూగజీవాలను సంరక్షిస్తూ జంతుప్రేమికులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరు సుమారు 35వీధి కుక్కలు, ఏడు ఆవులు, దూడలు, పావురాలు, మూడు పిల్లులు, కాకులు, గద్దలకు కూడా తమ నివాస ప్రాంతంలోనే చోటు కల్పించారు. చాలా జంతువులు గాయపడిన తరువాత ఆశ్రయానికి వస్తాయని, వీధికుక్కలు 90శాతానికి పైగా వాహనాలు ఢీకొట్టడం వల్ల గాయపడతాయని దినేష్ తెలిపారు. జంతువులు కదులుతున్న కార్లు, బైక్‌ల దూరాన్ని నిర్ధారించుకోవడంలో విఫలమవుతాయని అందుకే అవి ఎక్కువగా ప్రమాదాల బారిన పడతాయన్నారు. ప్రమాదాలతోపాటు కుక్కలకు కూడా చర్మవ్యాధులు, క్యాన్సర్లు, పక్షవాతం, నరాలు, మూత్రపిండాల సమస్యలతో బాధపడతాయని ఉష్మా తెలిపారు. మనుషులులాగే జంతువులు గాయపడిన సమయంలో నొప్పిని అనుభవిస్తాయని, మానసికంగా కలతచెందుతాయన్నారు.

హాంకాంగ్‌లో నో మాస్క్..!

హాంకాంగ్: హాంకాంగ్ మళ్లీ అట్టుడుకుతోంది. పోలీసులకు, నిరసనకారులకు మధ్య చెలరేగిన ఘర్షణలు, హింసాకాండతో పలువురు గాయపడ్డారు. శుక్రవారం రాత్రి పోలీసులు జరిపిన కాల్పులు, భాష్పవాయు ప్రయోగం సందర్భంగా 14 ఏళ్ల బాలుడు చనిపోవడంతో హాంకాంగ్‌లో మళ్లీ అల్లర్లతో దాదాపు అగ్నిగుండమైంది. నిరసనకారులు ముఖాలకు మాస్కులు ధరించి పెద్దఎత్తున వీధుల్లో ఆందోళనకు దిగారు. వారిపై పోలీసులు లాఠీచార్జి చేశారు. భాష్పవాయువు, వాటర్ కెనన్లు ప్రయోగించారు. అటు ఆందోళనకారులు కూడా పెట్రోలు బాంబులతో వారిపై తిరగబడటంతో పరిస్థితి అదుపు తప్పింది. విమానాశ్రయానికి వెళ్లే మార్గంతో సహా హాంకాంగ్‌లోని అన్నీ రైలు సర్వీసులు నిలిపివేసినట్టు అధికారులు తెలిపారు. పోలీసులు, నిరసన కారుల మధ్య హింసాత్మక ఘర్షణల సమయంలో సబ్ వే స్టేషన్లు ధ్వంసం అయ్యాయని సిటీ రైల్ ఆపరేటర్ తెలిపారు. దీంతో ఎయిర్ పోర్టు ఎక్స్‌ప్రెస్, లైట్ రైల్, ఎంటీఆర్ బస్సులతో పాటు హెవీ రైల్‌ను కవర్ చేసే అన్నీ ఎంటీఎస్ (మాస్ ట్రాన్సిస్ట్ ట్రైన్) సేవలను తిరిగి ప్రారంభించలేమని ఎంటీఆర్ కార్పొరేషన్ ఆదివారం ఉదయం తెలిపింది.

ఫరూఖ్ ఇంటికి ఎన్‌సీ నేతలు

శ్రీనగర్: ఫరూఖ్ అబ్దుల్లాను శ్రీనగర్‌లోని ఆయన ఇంట్లో ఉంచగా.. కుమారుడు ఒమర్‌ను హరి నివాస్ అతిథి గృహంలో ఉంచారు. తాజాగా ఆంక్షలను కొద్దిగా సడలించింది. నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఇద్దరు పార్టీ ముఖ్య నేతలు హస్నయిన మసూది, అక్బర్ లోనే ఆదివారం ఉదయం ఫరూఖ్ అబ్దుల్లా ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఫరూఖ్ అబ్దుల్లా వారిని సాదరంగా స్వాగతించారు. సుమారు గంటకు పైగా వారు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారి మధ్య ఎలాంటి అంశాలు చర్చకు వచ్చాయనేది తెలియాల్సి ఉంది. త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలు వారి మధ్య ప్రస్తావనకు వచ్చి ఉండొచ్చని తెలుస్తోంది. భేటీ అనంతరం హస్నయిన మసూది, అక్బర్ లోనే మాట్లాడుతూ.. తమ మధ్య ఎలాంటి రాజకీయ విషయాలు చర్చకు రాలేదని, ఒమర్ అబ్దుల్లా యోగ క్షేమాలను మాత్రమే తెలుసుక

గొప్ప నటిగా ఎదుగుతూ..

తమన్నా

సైరాలో లక్ష్మీ పాత్రలో మెప్పించి ప్రశంసలు అందుకుంటోంది మిల్క్ బ్యూటీ తమన్నా. నరసింహారెడ్డి కోసం జీవితాన్ని త్యాగం చేసి, ఉద్యమం కోసం కళాకారిణిగా కొనసాగిన ఉదాత్త పాత్రలో తమన్నా నటన అందరినీ ఆకట్టుకుంటోంది. మొదట్లో గ్లామర్ పాత్రలు చేస్తూ...ఆ తర్వాత ఒక్కో చిత్రంతో నట ప్రతిభ చూపిస్తూ వచ్చింది తమన్నా. బాహుబలి రెండు భాగాల్లో నటించి, దేశవ్యాప్త పేరు తెచ్చుకుంది. ఇక సైరా ఆమెకు తాజాగా దక్కిన బహుమానం అనుకోవాలి. ఇలా నటిగా మెప్పించడం వెనుక అనేక విమర్శలు ఉన్నాయని తెలిపింది తమన్నా. విమర్శల నుంచే మంచి నటిగా ఎదిగానన్నది ఆమె మాట. ఈ విషయంలో తమన్నా స్పందన చూస్తే...ఎవరూ విమర్శించకపోతే ఇంతలా ఎదిగేదాన్ని కాదు. విమర్శలు కొన్నిసార్లు బాధపెట్టినా...తనకు మంచే చేశాయి. విమర్శకులకు నేను కృతజ్ఞతలు చెప్పాలి. వాళ్లు అలా చెప్పకపోతే నన్ను నేను మార్చుకుంటూ ఎదగకపోయేదాన్ని. నాయికలకు ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో అద్భుత సమయం సాగుతోంది. సైరాలో లక్ష్మీ పాత్రే ఇందుకు కొత్త ఉదాహరణ. మాకు నిజంగా ఇదొక అద్భుత సమయం. నేను చేస్తున్న ప్రతి సినిమా నాయిక ప్రధానంగానే ఉంటడం అదృష్టం. అని అంది

ఎస్‌విఆరే స్ఫూర్తి

మెగాస్టార్ చిరంజీవి


ఎస్‌విఆర్ విగ్రహావిష్కరణ దృశ్యం

చిరంజీవి

తనకు దివంగత మహానటుడు ఎస్‌వి రంగారావే స్ఫూర్తి అని మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎస్‌విఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన 9అడుగుల 3అంగుళాల ఎస్‌విఆర్ కాంస్య విగ్రహాన్ని మెగాస్టార్ ఆదివారం ఆవిష్కరించారు. ఇందుకోసం ఆయన హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం వచ్చారు. అక్కడ్నుంచి అభిమానుల్తో కలసి ర్యాలీగా తాడేపల్లి గూడెం చేరుకున్నారు. ఆవిష్కరణ అనంతరం చిరంజీవి మాట్లాడుతూ ఎస్‌వి రంగారావును తన అభిమాన నటుడిగా పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితోనే తాను సినీరంగంలోకొచ్చానన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకునే ఈ రంగంలో రాణించానన్నారు. తన తండ్రికి ఎస్‌విఆర్‌తో కలసి నటించే అవకాశం దక్కిందన్నారు. తన తండ్రి తరచూ ఎస్‌విఆర్ నటనా కౌశలం గురించి చెబుతుండేవారన్నారు. ఎస్‌విఆర్ నటన, డైలాగ్ డెలవరీ అనితర సాధ్యంగా చెప్పారు. ఒక్క తెలుగులోనేకాదు.. భారతదేశం గర్వించదగ్గ నటుడు ఎస్‌విఆర్ అన్నారు. ఇండోనేషియాలోని జకర్తాలో జరిగిన అంతర్జాతీయ సినిమా ఉత్సవంలో నర్తనశాలను ప్రత్యేకంగా ప్రదర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. అందులో ఎస్‌విఆర్ నటనాకౌశలానికి విదేశీయులు ఆశ్చర్యపోయారన్నారు. జకార్త ఉత్సవంలో అవార్డు పొందిన ఘనత ఎస్‌విఆర్‌దేనన్నారు. ఆయన స్ఫూర్తితో మద్రాస్‌కెళ్ళిన తనకు ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం అదృష్టమన్నారు. వాస్తవానికి గత మాసంలోనే ఈ ఆవిష్కరణ జరగాల్సుందని చెప్పారు. సైరా నిర్మాణానంతర పనుల్లో బిజీగా ఉండడం వల్ల తనకారణంగానే కొంత ఆలస్యం జరిగిందన్నారు. తమ సొంత జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌విఆర్ విగ్రహ ఏర్పాటుపై తనకు విపరీతమైన కోరికుండేదన్నారు. అయితే అభిమానుల ద్వారా ఇన్నాళ్ళకు ఆ కోరిక నెరవేరిందన్నారు. అద్భుతమైన వాక్చాతుర్యం, అసాధారణ నటనావైభవంగల నటుడి నిలువెత్తు విగ్రహాన్ని ఇక్కడ పెట్టడం ఈ ప్రాంతవాసులకు కళాకారులపై ఉన్న అభిమానానికి నిదర్శన మన్నారు.

సైరా విజయానికి కృతజ్ఞతలు

సైరా చిత్రానికి ఇంతటి ఘన విజయం చేకూర్చిన అభిమానులందరికీ చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎండను సైతం లెక్కచేయకుండా తన కోసం ఎదురుచూసిన అభిమానులకు పేరు పేరున ధన్యవాదాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నర్సాపురం ఎమ్‌పి కనుమూరి రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రులు పైడికొండల మాణిక్యాలరావు, వట్టివసంతకుమార్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఆర్ సూర్యారావు, కాపు కార్పొరేషన్ వైర్మన్ జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి, తదితరులు వేదికనలంకరించారు.

సూరి, నైనా

రామ్‌గోపాల్‌వర్మ కొత్త సినిమా బ్యూటిఫుల్

సంచలన దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ కొత్త చిత్రం బ్యూటిఫుల్. దీనికి ట్రిబ్యూట్ టు రంగీలా అన్నది ఉపశీర్షిక. నైనా కథానాయికగా, సూరి కథానాయకుడిగా నటిస్తున్నారు. అగస్త్య మంజు దర్శకుడు. లోగడ లక్ష్మీస్‌ఎన్టీఆర్ సినిమాకు రామ్‌గోపాల్‌వర్మతో పాటు అగస్త్య మంజు సహ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. టైగర్ కంపెనీ ప్రొడక్షన్ పతాకంపై నిర్మాణమవుతున్న రామ్‌గోపాల్‌వర్మ చిత్రమిది. టి.అంజయ్య సమర్పణలో టి.నరేష్‌కుమార్, టి.శ్రీధర్ నిర్మిస్తున్నారు. వైవిధ్యభరిత అంశాలతో ఆకట్టుకోనున్న ఈ చిత్రం ట్రైలర్ ఈ నెల 9వ తేదీన ఉదయం 9 గంటలకు విడుదల కానుంది. ఈ చిత్రానికి పాటలను సిరాశ్రీ అందించగా...సంగీతాన్ని రవిశంకర్ సమకూరుస్తున్నారు. ఈ చిత్రానికి రచన, ఫోటోగ్రఫీ, దర్శకత్వం: అగస్త్య మంజు.

వదలడు ప్రీ రిలీజ్ వేడుక

సిద్ధార్థ్, కేథరిన్ జంటగా సాయిశేఖర్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న చిత్రం వదలడు. పారిజాత క్రియేషన్స్ పతాకంపై టి.అంజయ్య సమర్పణలో టి.నరేష్‌కుమార్, టి.శ్రీధర్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న ఈ చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజకీయవేత్త మన్నే గోవర్ధన్‌రెడ్డి ట్రైలర్‌ను ఆవిష్కరించారు. మరో ముఖ్యఅతిథిగా నిర్మాత నట్టికుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా మన్నే గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... అంజయ్యగారు ఈ ఏడాదిలో నాలుగు చిత్రాలు విడుదల చేశారు. తెలుగు ఇండస్ట్రీలో దిల్‌రాజు తర్వాత అంత పెద్ద నిర్మాతగా మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను అని అన్నారు. చిత్ర సమర్పకులు టి.అంజయ్య మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగంలో పేరు తెచ్చుకున్న తాము సినీరంగంలో వరుస సినిమాలను ప్రేక్షకులకు అందించబోతున్నాం. ఇది ఓ మంచి పాయింట్‌తో రూపుదిద్దుకుంది అని అన్నారు. నట్టికుమార్ మాట్లాడుతూ...ఇది ఒక విభిన్నమైన చిత్రం. ఇలాంటి చక్కటి చిత్రాలను తీయాలని ఓ మంచి అభిరుచితో ఈ నిర్మాతలు చిత్ర ఫరిశ్రమలోనికి అడుగుపెట్టారు. ఇప్పటికే వారు అందించిన సినిమాలు వారి అభిరుచిని చాటుతున్నాయి అని అన్నారు. నిర్మాతలు నరేష్‌కుమార్, శ్రీధర్‌లు మాట్లాడుతూ...కమర్షియల్ అంశాలతో సమ్మిళితమైన సందేశాత్మక చిత్రమిది. కల్తీ ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఎదురయ్యే అనర్థాలను చర్చించే సినిమా ఇది. సినిమాను 450 థియేటర్లలో భారీగా విడుదల చేస్తున్నాం అన్నారు. కేథరిన్ థెరిస్సా మాట్లాడుతూ, ఈ సినిమాలో నా పాత్ర పేరు జ్యోతి. ఈ కథలో పాయింట్ నచ్చి నటించాను. కల్తీ అన్నది మాఫియాగా తయారై ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న అంశాన్ని ఇందులో బాగా చూపించారు అని అన్నారు.

సగటు యువకుడి పాత్రలో...

యువ హీరో తేజస్ కంచర్ల నటిస్తున్న కొత్త సినిమా ఆర్‌డీఎక్స్ లవ్. సీకే సినిమాస్, హ్యాపీ మూవీస్ పతాకాలపై సి కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శంకర్ భాను దర్శకుడు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఆర్‌డీఎక్స్ లవ్ సినిమా విశేషాలను హీరో తేజస్ కంచర్ల తెలిపారు. ఆయన మాట్లాడుతూ...ఆర్‌డీఎక్స్ లవ్ సినిమా అంగీకరించేందుకు కథే కారణం. పెద్ద సంస్థ ప్రచారం బాగుంటుంది అనుకుని నటించాను. నాయిక ప్రధానంగా సినిమా ఉన్నా, నా పాత్ర కీలకంగా ఉంటుంది. పాయల్ పాత్ర చేసే ప్రతి పని నా సహాయంతో జరుగుతుంటుంది. అలా చివరి దాకా నా పాత్ర ప్రధానంగా సాగుతుంది. ఇందులో నేను మనం రోజూ చూసే సగటు అబ్బాయి పాత్రలో కనిపిస్తాను. ఏ పనీ చేయకుండా తిరుగుతుంటాడు. అలాంటి అబ్బాయికి, సామాజిక సేవ చేసే అమ్మాయి పరిచయం అవుతుంది. ఆమెకు తను ఎలా సహకరించాడు అనేది కథాంశం. ఆర్‌డీఎక్స్ టీజర్ చూసి అంతా ఆశ్చర్యపోయారు. కానీ సినిమాలో అలాంటివేం ఉండవు. మంచి సందేశాత్మక సినిమా. పాయల్ రాజ్‌పుత్‌కున్న ఇమేజ్ వల్ల టీజర్ అలా చేయాల్సివచ్చిందని నిర్మాత చెప్పారు. నేను దర్శకుడు తేజ గారి దగ్గర సహాయకుడిగా పనిచేశాను. ఆయన నాతో ఒక సినిమా చేస్తానని చెప్పారు. అయితే కొన్ని కారణాలతో ఆ సినిమా తెరకెక్కలేదు. ఆ తర్వాత ప్రకాష్ రాజ్ గారి దగ్గర నుంచి పిలుపొచ్చింది. ఆయన ఉలవచారు బిర్యానీ సినిమాలో నటించమని అవకాశమిచ్చారు. అలా నటుడిగా అరంగేట్రం చేశాను. ఆ తర్వాత కేటుగాడు అనే చిత్రంలో నటించాను. అది ప్రేక్షకులకు నచ్చలేదు. ఆ తర్వాత నేను ఎలాంటి సినిమాలు చేయాలో నిర్ణయించుకున్నాను. నాకు తెలిసిన రంగం సినిమా ఒక్కటే. అందుకే ఏం చేసినా పరిశ్రమలోనే ఉండాలను కుంటున్నాను. త్వరలో నిర్మాణ సంస్థను స్థాపిస్తా. దర్శకత్వ ఆలోచన లేదు. అన్నారు.

తేజస్

అందాల ప్రదర్శన అనివార్యమైతే...

దిగాంగన సూర్యవంశీ

ఒకే తేదీన రెండు సినిమాలు విడుదలవడం, అవి రెండూ తన తొలి చిత్రాలు కావడం నటీనటుల జీవితాల్లో జరిగే అత్యంత అరుదైన సందర్భం. అలా ఆశ్చర్యకరంగా బాలీవుడ్‌లో అరంగేట్రం చేసింది దిగాంగన సూర్యవంశీ. ఒకేసారి రెండు సినిమాలతో మెప్పించిన ఈ సుందరికి...అంతకుముందు బుల్లితెరపై నటించిన అనుభవం, గుర్తింపు ఉన్నాయి. హిప్పీ చిత్రంతో తెలుగు, తమిళ ప్రేక్షకులకు దగ్గరైంది. దిగాంగనలో చాలా కళలున్నాయి. ఆమె నటి మాత్రమే కాదు, గాయని, గీత రచయిత కూడా. చిన్నప్పటి నుంచే పలు ఆల్బమ్స్ సొంతంగా పాడి విడుదల చేసింది. ఈ సుందరి నటన విషయంలో మరికాస్త ప్రేమగా ఉంటానంటోంది. దిగాంగన మాట్లాడుతూ...నేను చేసే ఏ పనినైనా ప్రేమించే చేస్తాను. నాయిక అందంగా కనిపించాలని గ్లామర్ పాత్రలకు ఒప్పుకోను. త్వరగా పేరొస్తుందని ఏ పనీ చేయను. చేయాలి కాబట్టి చేయాలి అనుకోవడం నాకిష్టం ఉండదు. నాకిచ్చిన అవకాశాన్ని ఎప్పుడూ తేలిగ్గా తీసుకోను. కొన్ని కథలకు అందంగా కనిపించడం తప్పనిసరి. కథాగమనంలో మరే అంశాన్ని చేర్చినా సరిపోదు. అలాంటి చిత్రాలు నాయికలకు అనివార్యంగా గ్లామర్ అవసరాన్ని ఏర్పరుస్తాయి. పదిహేనేళ్ల వయసులో వేవ్స్ ఎండ్‌లెస్ ఎమోషన్స్ అనే పుస్తకాన్ని రచించాను. ఆ తర్వాత నిక్సీ అనే మరో పుస్తకం రాశాను. ఈ రెండు పుస్తకాల్లో నా స్పందనలు, అభిప్రాయాలు, నా దృక్కోణం ఉంటాయి. ఈ పుస్తకాలు తిరగేస్తుంటే నన్ను నేను అద్దంలో చూసుకుంటున్నట్లు ఉంటుంది. పుస్తక రచనతో పాటు పాటలు వినడం, పాడటం, రాయడంలో ఆసక్తి ఉంది. పదేళ్ల వయసు నుంచే భక్తి గీతాలు రచిస్తున్నాను. వాటిని నేనే పాడి ఆల్బమ్స్ తయారు చేస్తుంటాను. అని చెప్పింది. ఈ ఏడాది తమిళంలో తెరంగేట్రం చేస్తోంది సుందరి.

విజయ్

విజిల్ వేస్తున్న విజయ్

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన తమిళ కథానాయకుడు విజయ్ నటిస్తున్న తాజా చిత్రం విజిల్. ఆయనకు జోడీగా నయనతార నటిస్తోంది. అట్లీ దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్రం తెలుగు హక్కులను ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ సంస్థ అధినేత మహేష్ కోనేరు దక్కించుకున్నారు. సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం నిర్మాణంలో ఉంది. ఈ చిత్రంలోని విజయ్ ఫస్ట్‌లుక్‌ను ఆదివారం విడుదలచేశారు.

షమి ఇరగదీశాడు (10.5-2-35-5)

విశాఖ టెస్టులో షమి సఫారీ!

- టీమిండియా 203 పరుగుల తేడాతో సౌతాఫ్రికాపై ఘనవిజయం
- షమీకి అయిదు వికెట్లు
- రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీల వీరుడు రో'హిట్'కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్

విశాఖపట్నం: విశాఖ తీరంలో సౌతాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. చివరి రోజు 395 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సఫారీ జట్టును మహ్మద్ షమి (5/35), రవీంద్ర జడేజా (4/51) విధ్వంసక బౌలింగ్‌తో 191 పరుగులకే కుప్పకూల్చారు. దీంతో భారత్‌కు 203 పరుగుల భారీ విజయం దక్కింది. ఫలితంగా మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యం సాధించింది. ఇప్పటికే టి20 సిరీస్‌ను కైవసం చేసుకున్న కోహ్లీసేన టెస్టు సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. ఏడాది తర్వాత సొంతగడ్డపై తొలి టెస్టు ఆడిన భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సత్తా చాటుకొని పర్యాటక జట్టుపై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. తొలి ఇన్నింగ్స్‌లో మయాంక్ అగర్వాల్ (215), రోహిత్ (176) చిరస్మరణీయ బ్యాటింగ్‌తో ఆకట్టుకోగా.. బౌలింగ్‌లో అశ్విన్ (7/145) రాణించాడు. తర్వాత రెండో ఇన్నింగ్స్‌లోనూ ఓపెనర్ రోహిత్ (127) సెంచరీతో మెరవగా.. బౌలింగ్‌లో షమీ, జడేజాలు విజృంభించడంతో భారత్ రెండో సెషన్‌లోనే విజయాన్ని అందుకుంది. ఓవరాల్‌గా టెస్టుల్లో నెంబర్ వన్ ర్యాంక్‌లో ఉన్న భారత్ తమ స్థాయికి తగ్గ ప్రదర్శన చేసింది. ఇక రెండు ఇన్నింగ్స్‌లలో శతకాలతో మెరిసిన రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సొంతం చేసుకున్నాడు. అక్టోబర్ 10 నుంచి ఇరుజట్ల మధ్య పూణె వేదికగా రెండో టెస్టు జరగనుంది.

ఆదిలోనే..

11/1 ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం చివరి రోజు బ్యాటింగ్ కొనసాగించిన సౌతాఫ్రికాకు ఆదిలోనే అశ్విన్ షాకిచ్చాడు. కుదురుగా ఆడుతున్న డి బ్రూన్ (10)ను అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో సౌతాఫ్రికా 19 పరుగుల వద్ద రెండో వికెట్ కోల్పోయింది.

షమి దూకుడు..

ఈ దశలో పేసర్ మహ్మద్ షమి నిప్పులు చెరిగే బంతులతో సఫారీ బ్యాట్స్‌మెన్‌పై విరుచుకుపడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన షమి రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం చెలరేగి బౌలింగ్ చేశాడు. అప్పుడే క్రీజులోకి వచ్చిన బెంబ బవుమా (0)ను పరుగుల ఖాతా తెరువనివ్వకుండానే పెవిలియన్‌కి పంపాడు. దీంతో సౌతాఫ్రికా ఒక పరుగు వ్యవధిలోనే రెండు వికెట్లు చేజార్చుకుంది. తర్వాత ఓపెనర్ అయిడెన్ మార్క్‌రమ్, కెప్టెన్ డుప్లెసిస్ సఫారీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కొద్ది సేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్న ఈ జోడీ సింగిల్స్, డబుల్స్‌తో స్కోరుబోర్డును ముందుకు నడిపించింది. ఈ క్రమంలోనే సౌతాఫ్రికా 21.5 ఓవర్లలో 50 పరుగుల మార్కును పూర్తి చేసుకుంది. ఇక ఆ తర్వాత మళ్లీ పుంజుకున్న షమి సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపించాడు. ముందు ఆచితూచి ఆడుతున్న డుప్లెసిస్ (13)ను క్లీన్ బౌల్డ్‌చేసిన షమి తర్వాత ఎనిమిది పరుగుల వ్యవధిలోనే తొలి ఇన్నింగ్స్‌లో సత్తా చాటిన డికాక్ (0)ను పరుగుల బోణి చేయకుండానే ఇంటి ముఖం పట్టించాడు. దీంతో సఫారీ జట్టు 60 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిపోయింది.

జడేజా మ్యాజిక్..

ఈ దశలో మార్క్‌రమ్, ముత్తుసామీ సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌ను ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ స్పిన్నర్ రవీంద్ర జడేజా వీరి ఆశలపై నీళ్లు జల్లుతూవ తన స్పిన్ మ్యాజిక్‌ను ప్రదర్శించాడు. అప్పటికే పిచ్‌పై పాతుకుపోయిన మార్క్‌రమ్ (39; 74 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్)ను కళ్లుచెదిరే అద్భుతమైన బంతితో రిటర్న్ క్యాచ్ అందుకున్నాడు. ఇదే మ్యాచ్‌కి టర్నింగ్ పాయింట్. అనంతరం అదే ఓవర్ నాలుగో బంతికి ఫిలాండర్ (0), ఐదో బంతికి కేశవ్ మహారాజ్ (0)లను ఔట్ చేసి సౌతాఫ్రికాకు కోలుకోలేని దెబ్బేశాడు. దీంతో సఫారీ జట్టు 70 పరుగుల వద్ద 8 వికెట్లు కోల్పోవడంతో టీమిండియా గెలుపు లాంఛనమే అయింది.

టెయిలెండర్ల పోరాటం..

భారత్ విజయం ఖాయమని సంబరపడు తుంటే.. ఈ సమయంలో సఫారీ టెయిలెండర్లు ముత్తుసామి, డేన్ పీట్ అద్భుతమైన బ్యాటింగ్‌తో భారత బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. సీనియర్ ఆటగాళ్లు విఫలమైన పిచ్‌పై వీరిద్దరూ మాత్రం పాతుకుపోయారు. సింగిల్స్, డబుల్స్‌తో స్కోరు బోర్డును 100 పరుగులు దాటించారు. అనంతరం లంచ్ విరామాని కి సౌతాఫ్రికా 42 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసింది. లంచ్ తర్వాత కూడా పట్టుదలతో ఆడిన వీరిద్దరూ 9వ వికెట్‌కు 105 బంతుల్లో 50 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యాన్ని విడదీయడానికి కోహ్లీ ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. దూకుడుగా ఆడుతున్న డేన్ 86 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలోనే సఫారీల స్కోరు 150 పరుగుల మైలురాయిని దాటింది. ఆఖర్లో షమి మరోసా రి పుంజుకోవడంతో ఈ భాగస్వామ్యానికి తెరపడింది. బాధ్యతగా ఆడుతున్న డేన్ పీట్ (56; 107 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్)ను షమి అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 91 పరుగుల తొమ్మిదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం కగిసో రబాడా ధాటిగా ఆడుతూ 19 బంతుల్లోనే 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో 18 పరుగులు చేశాడు. చివరికి ఇతనిని కూడా షమి అవుట్ చేసి టీమిండియా విజయాన్ని పూర్తి చేశాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన ముత్తు సామి 108 బంతు ల్లో 5 ఫోర్లతో 49 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కాగా సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 63.5 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌటయింది. భారత బౌలర్లలో షమి 5 వికెట్లు పడగొట్టగా.. జడేజా 4 వికెట్లతో సత్తా చాటుకున్నాడు. అశ్విన్‌కు ఒక వికెట్ దక్కింది.

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 502/7 (డిక్లేర్డ్).
సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 431 ఆలౌట్.
భారత్ రెండో ఇన్నింగ్స్: 324/4 (డిక్లేర్డ్).
సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) అండ్ (బి) జడేజా 39, డీన్ ఎల్గర్ (ఎల్బీడబ్లూ) జడేజా 2, డి బ్రూన్ (బి) అశ్విన్ 10, బెంబ బవుమా (బి) షమి 0, డుప్లెసిస్ (బి) షమి 13, డికాక్ (బి) షమి 0, ముత్తుసామీ (నాటౌట్) 49, ఫిలాండర్ (ఎల్బీడబ్లూ) జడేజా 0, కేశవ్ మహారాజ్ (ఎల్బీడబ్లూ) 0, డేన్ పీట్ (బి) షమి 56, కగిసో రబాడా (సి) సాహా (బి) షమి 18; ఎక్స్‌ట్రాలు: 4, మొత్తం (46.5ఓవర్లలో) 191 ఆలౌట్.
వికెట్ల పతనం: 1-4, 2-19, 3-20, 4-52, 5-60, 6-70, 7-70, 8-70, 9-161, 10-191.
బౌలింగ్: అశ్విన్ 20-5-44-1, జడేజా 25-6-87-4, షమి 10.5-2-35-5, ఇషాంత్ శర్మ 7-2-18-0, రోహిత్ శర్మ 1-0-3-0.

భారత బౌలర్ల ధాటికి కకావికలైన బవుమ, డిబ్రూన్, డుప్లెసిస్ వికెట్లు

రికార్డుల జోరు

అత్యంత వేగంగా అశ్విన్ 350 వికెట్లు

టెస్టుల్లో భారత్ తరపున వేగంగా 350 వికెట్లు తీసిన బౌలర్‌గా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కొత్త రికార్డు సృష్టించాడు. వైజాగ్ వేదికగా సఫారీలతో జరిగిన తొలి టెస్టులో 8 వికెట్లు పడగొట్టిన అశ్విన్ తన ఖాతాలో వేగవంతమైన 350 వికెట్ల రికార్డును వేసుకున్నాడు. అంతుకముందు అనిల్ కుంబ్లే 77 టెస్టుల్లో 350 వికెట్లు పడగొట్టగా.. తాజాగా అశ్విన్ 66 టెస్టుల్లో ఈ ఫీట్‌ను అందుకున్నాడు. మరోవైపు 83 టెస్టుల్లో 350 వికెట్లు తీసిన హర్భజన్ సింగ్ మూడో స్థానంలో నిలిచాడు.

మురళీధరన్ రికార్డు సమం..

అలాగే అశ్విన్ తన ఖాతాలో మరో రికార్డును వేసుకున్నాడు. టెస్టుల్లో వేగంగా 350 వికెట్లు తీసిన శ్రీలంక మాజీ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ రికార్డును సమం చేశాడు. మురళీధరన్ 66వ టెస్టులో 350 వికెట్లు పడగొట్టగా.. తాజాగా అశ్విన్ సైతం అన్నే టెస్టుల్లో 350 వికెట్లు సాధించాడు. ఫలితంగా మురళీతో సంయుక్తంగా టాప్‌లో నిలిచాడు.

అత్యధిక సిక్సర్ల రికార్డు బ్రేక్

భారత్-సౌతాఫ్రికా జట్ల మధ్య జరిగిన తొలి టెస్టులో ఇరుజట్ల బ్యాట్స్‌మెన్ సిక్సర్ల వర్షం కురిపిస్తూ 37 సిక్సులు బాదేశారు. ఫలితంగా ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యధిక సిక్సులు నమోదు చేసిన జట్లుగా ఇండియా-సౌతాఫ్రికా జట్లు నిలిచాయి. దీంతో 2014లో పాకిస్తాన్-న్యూజిలాండ్ జట్లు నమోదు చేసిన 35 సిక్స్‌ల రికార్డు తాజాగా బ్రేక్ అయింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 13, రెండో ఇన్నింగ్స్‌లో 14 సిక్సర్లు బాదగా.. సఫారీ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 7, రెండో ఇన్నింగ్స్‌లో 3 సిక్స్‌లు కొట్టింది.

సరితాదేవి ఔట్

ఉలన్ ఉడె(రష్యా) : మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మాజీ విజేత, భారత బాక్సర్ ఎల్.సరితాదేవి(60కి.గ్రా.) ఆదివారం జరిగిన పోటీలో ఓటమిపాలైంది. నాలుగో సీడ్ సరితాదేవికి తొలి రౌండ్‌లో బై లభించింది. ఆదివారం జరిగిన రౌండ్ 32 పోరులో రష్యాకు చెందిన నటాలియ షడ్రిన చేతిలో 0-5 తేడాతో ఓడిపోయింది. కాగా స్వీటీ బోరా(75కి.గ్రా.), జమున బోరా (54కి.గ్రా.) ఈ పోటీలలో తొలి రౌండ్‌లో విజయాలు సాధించి ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్న విషయం తెలిసిందే.

జపాన్ కింగ్ జకో



టోక్యో : జపాన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీని ప్రపంచ నంబర్‌వన్ నొవాక్ జకోవిచ్ గెలుచుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో జొకోవిచ్ 6-3, 6-2 స్కోరుతో ఆస్ట్రేలియాకు చెందిన జాన్ మిల్‌మన్‌ను చిత్తుగా ఓడించాడు. అరంగేట్రం చేసిన టోర్నీని గెలుచుకోవడం జకోకిది పదవసారి. జపాన్ ఓపెన్‌లో జకోవిచ్ ఈ ఏడాది తొలిసారి రంగప్రవేశం చేశాడు. ఈ టోర్నీలో జకోవిచ్ ఒక్కసెట్‌ను కూడా కోల్పోకపోవడం విశేషం. భుజం నొప్పితో యుఎస్ ఓపెన్‌నుంచి మధ్యలో తప్పుకున్న జకోవిచ్ ఈ టోర్నీలో దాని ప్రభావం కనబడనీయలేదు. ప్రపంచ 15వ నంబర్ డేవిడ్ గాఫిన్ సహా ఎవరూ జకోవిచ్‌ను ఇబ్బందిపెట్టలేకపోయారు. ఫైనల్లో జకో తొలి సెట్ ఆరంభంలోనే బ్రేక్ సాధించి 3-1 ఆధిక్యం సాధించాడు. జకోవిచ్ ప్రత్యర్థిని బేస్‌లైన్‌కే పరిమితం చేస్తూ తిరుగులేని సర్వీసులు, ఎదురులేని ఫోర్‌హ్యాండ్ షాట్లతో అలరించాడు. రిటర్న్ వాలీలను కార్నర్‌లకు పంపిస్తూ, సునిశిత డ్రాప్‌షాట్లతో ప్రత్యర్థిని కోర్టు నలువైపులా పరుగెత్తించాడు. ఒక్కసారికూడా డబుల్‌ఫాల్ట్ చేయని జకో మొత్తం ఆరు ఏస్‌లు సంధించాడు. ఒక్కసారికూడా బ్రేక్‌పాయింట్‌ను ఎదుర్కోలేదు. కాగా మిల్‌మన్ నాలుగు బ్రేక్ పాయింట్లలో ఒక్కదానిని మాత్రమే కాపాడుకోగలిగాడు.

చైనా క్వీన్ ఒసాకా

బీజింగ్: మాజీ ప్రపంచ నంబర్ వన్, జపాన్ క్రీడాకారిణి నవోమి ఒసాకా చైనా ఓపెన్ టెన్నిస్ టోర్నీని గెలుచుకుంది. ఆదివారంనాటి ఫైనల్లో ఒసాకా 3-6, 6-3, 6-2తో ప్రస్తుత ప్రపంచ నంబర్ వన్ ఆష్లే బార్టీ(ఆస్ట్రేలియా)ను ఓడించి 110 నిమిషాలలో ఈ సీజన్‌లో రెండో టైటిల్‌ను దక్కించుకుంది. శనివారం మాజీ చాంపియన్ కరోలిన్ వోజ్నియాకిని ఓడించిన 21 ఏళ్ల ఒసాకా తన సర్వీసును విజయవంతంగా ప్రయోగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంది. పలుమార్లు ఆమె సర్వీసులు గతితప్పాయి. ఆరో గేమ్‌లో తొలుత డబుల్‌ఫాల్ట్ చేసిన ఒసాకా ఏస్‌ను కోర్టు బయటకు కొట్టింది. మళ్లీ డబుల్‌ఫాల్ట్‌తో ప్రత్యర్థికి పాయింట్‌ను సమర్పించుకుంది. గత నెలలో సొంత ఊరిలో పాన్ పసిఫిక్ టోర్నీని గెలుచుకున్న ఒసాకా తరచూ భుజం నొప్పితో బాధపడి మ్యాచ్‌ను కొనసాగించింది. 23 ఏళ్ల బార్టీ 34 నిమిషాలలో తొలి సెట్‌ను గెలుచుకుని ఒసాకాకు పోటీగా నిలిచింది. అయితే ప్రేక్షకుల మద్దతుతో ఒసాకా రెండో సెట్‌లో బ్రేక్‌తో 4-2 ఆధిక్యం సాధించి దానిని నిలుపుకుంటూ సెట్ స్కోరును సమం చేసింది. ఆ తరువాత ఆటపై పట్టు సాధించి బార్టీ సర్వీసును బ్రేక్ చేసి ఆధిక్యం ప్రదర్శించి సెట్‌తోపాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను గెలుచుకుంది. ఇది ఈ ఏడాది ఒసాకా గెలుచుకున్న మూడో టైటిల్ కాగా, కెరీర్‌లో అయిదవది.

పర్దీప్ ప్రతాపం

ప్రొ కబడ్డీ సీజన్-7

గ్రేటర్ నొయిడా : ప్రొ కబడ్డీ సీజన్-7 పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆరంభంలో వెనుకబడిన జట్లు సీజన్ ముగియడానికి ముందు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన జట్లను మట్టి కరిపిస్తున్నాయి. ఆదివారం బెంగాల్ వారియర్స్‌పై పట్నా పైరేట్స్ 69-41 స్కోరుతో ఘన విజయం నమోదు చేసింది. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉన్న బెంగాల్‌ను ప్లేఆఫ్స్‌కు చేరని పట్నా జట్టు 28 పాయింట్ల తేడాతో ఓడించ డం గమనార్హం. పట్నా జట్టులోని పర్దీప్ నర్వాల్ విజృంభన తో బెంగాల్ కుదేలయింది. పర్దీప్ 31సార్లు రెయిడింగ్‌కు వెళ్లి 34 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించాడు. తతివా ఆటగాళ్లలో జంగ్ కున్ లీ 8, నీరజ్‌కుమార్ 5, వికాస్, మహ్మద్ చెరి 4 పాయింట్లతో సహకరించారు. బెంగాల్ జట్టులో సౌరభ్(11), రాకేష్ నర్వాల్ (10) సూపర్ టెన్స్ సాధించారు. మహ్మద్ తగి 6, అవినాష్ 4, ఆదర్శ్ 3 పాయింట్లు సాధించారు. రెయిడింగ్‌లో(41-31), టాకిలింగ్‌లో (17-7) పట్నాదే పైచేయి. బెంగాల్ నాలుగుసార్లు, పట్నా ఒకసారి ఆలౌటయ్యాయి.

మరో మ్యాచ్‌లో యుపి యోధ 43-39 స్కోరుతో పుణెరి పల్టన్స్‌పై గెలుపొందింది. యోధ జట్టులో రిషాంక్ దేవడిగ 8, నితేష్ కుమార్ 6, సురేందర్ సింగ్, సచిన్ కుమార్ చెరి 5, మోను గోయత్, అమిత్ చెరి 4 పాయింట్లు సాధించారు. కాగా పుణె జట్టులో మన్‌జీత్, నితిన్ తోమర్ చెరి 8, అమిత్ కుమార్ 7, సుర్జీత్ సింగ్ 5 పాయింట్లు సాధించారు. రెయిడింగ్ యోధ 21-20తో ఆధిక్యం ప్రదర్శించగా, టాకిలింగ్‌లో పట్నా 17-15తో ఆధిక్యం ప్రదర్శించింది. కాగా యోధ ఒకసారి, పుణె రెండుసార్లు ఆలౌటయ్యాయి.

హసన్ డబుల్

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

దోహా: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నెదర్లాండ్స్ క్రీడాకారిణి సిఫాన్ హసన్ డబుల్ సాధించింది. పోటీల రెండో రోజున 10వేల మీటర్ల పరుగు పసిడిని సొంతం చేసుకున్న హసన్ శనివారం 1500మీ. పరుగులో స్వర్ణం గెలుచుకుని డబుల్ సాధించింది. హసన్ 3ని.51.95 సెకండ్లలో గమ్యాన్ని చేరి అగ్రస్థానం దక్కించుకుంది. కెన్యాకు చెందిన ఫెయిత్ కిప్యెగాన్(3ని.54.22సె.) రజతం, ఇథియోపియాకు చెందిన గుడాఫ్ సెగె (3ని.54.38సె.) కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పోటాపోటీగా సాగిన మహిళల 5000మీ. పరుగులో స్వర్ణ, రజత పతకాలు కెన్యాకే దక్కాయి. హెలెన్ ఓబిరి 14ని.26.72సె.తో అగ్రస్థానంలో నిలవగా, మార్గరెట్ చెలిమొ కిప్కెంబొ 14ని.27.49సె.తో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. కాగా జర్మనీకి చెందిన కాన్‌స్టాంజ్ క్లోస్టర్‌హాఫెన్ 14ని.28.43సె.తో కాంస్యం గెలుచుకుంది. పురుషుల షాట్‌పుట్ స్వర్ణాన్ని అమెరికాకు చెందిన జో కొవాక్స్ గెలుచుకున్నాడు. కొవాక్స్ 22.91మీ. దూరం షాట్‌పుట్‌ను విసిరి అగ్రస్థానం దక్కించుకున్నాడు. అమెరికాకే చెందిన ర్యాన్ క్రూజర్ 22.90మీ.తో రజతం, న్యూజిలాండ్ అథ్లెట్ టొమాస్ వాల్ష్ 22.90మీ.తో కాంస్యం గెలుచుకున్నారు. పతక విజేతల మధ్య వ్యత్యాసం కేవలం ఒక్క సెంటీమీటర్ మాత్రమే.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.